1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 1
పుటలు : 52
రు. 25 లు
ISSN NO:
2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

మార్చి 2022

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in



## తెలుగు భాషోద్యమ సమాఖ్య సర్వసభ్య సమావేశం

2022 ఫిబ్రవరి 20న- విజయవాడ - ఆంధ్ర లొయోలా కళాశాలలో జరిగింది

జాతీయ అధ్యక్షునిగా ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు బాధ్యతను స్వీకరించారు. ఆయనతో పాటు గౌరవాధ్యక్షులు డా॥ చుక్కా రామయ్య, డా॥ సామల రమేష్‌బాబు, మరి కొందరు సభ్యులతో కూడిన తాత్కాలిక కేంద్రమండలి ఏర్పాటయింది. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా పది తీర్మానాలు చేశారు.

అవి: 1. అధికారభాషగా తెలుగును అన్ని రంగాల్లో అమలు చెయ్యాలి. 2. తెలుగు మాధ్యమంలో చదివినవారికి ప్రభుత్వ ఉద్యోగాలలో 20% కేటాయింపు ఉండాలి. 3. న్యాయస్థానాల్లో తెలుగు అమలు చెయ్యాలి. 4. ప్రాథమిక విద్య అమ్మనుడిలోనే ఉండాలి. 5. తెలుగేతర రాష్ట్రాలలోని తెలుగువారి భాషాహక్కులను కాపాడాలి. 6. ధార్మిక, సాంస్కృతిక రంగాల్లో వలసభాషల దూకుడును అరికట్టాలి. 7. భాషాజాతుల వారసత్వ సంపద పరిరక్షణ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపైకి తేవాలి. 8. తెలుగునుడి సాంకేతికంగా పుంజుకునేందుకు పటిష్టమైన కృషిసాగించాలి. 9. విశ్వవిద్యాలయాలలో పరిశోధకులు, ఆచార్యులు ఎంచుకొంటున్న అంశాల పరిధులు ఎల్లలు దాటాలి. 10. మాతృభాషలకు ముప్పును ఎదుర్కోవడానికై రాజ్యాంగానికి తగు సవరణలు చెయ్యాలి. ఈ పది తీర్మానాల సాధనకోసం సమాఖ్య తగు కార్యక్రమాలను చేపట్టనుంది.

**భాషా స్వాభిమానం కోసం రాజ్యాంగ సవరణ తప్పదు**

# తెలుగు భాషోద్యమ సమాఖ్య సర్వసభ్య సమావేశం 20-2-2022

## ప్రధాన వక్తలు - తీర్మాన ప్రతిపాదకులు


సామల రమేష్‌బాబు


మండలి బుద్ధప్రసాద్


గారపాటి ఉమామహేశ్వరరావు


నందివెలుగు ముక్తేశ్వరరావు


పులికొండ సుబ్బాచారి


చిమ్మె జాన్ బర్నబాస్


పిరాట్ల శివరామకృష్ణ


స.వెం. రమేశ్


వెన్నిసెట్టి సింగారావు


మొవ్వా శ్రీనివాసరెడ్డి


సుందర్ కొంపల్లి


రహ్మానుద్దీన్ షేక్

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




మార్చి 2022

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. రచన సొంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | భాషా స్వాభిమానం కోసం రాజ్యాంగ సవరణ తప్పదు | | 07 |
| తెలుగు భాషోద్యమ సమాఖ్య: | సర్వ సభ్య సమావేశంలో చేసిన పది తీర్మానాలు.... | | 09 |
| వలసభాషల దూకుడు: | ధార్మిక, సాంస్కృతిక... | నందివెలుగు ముక్తేశ్వరరావు | 28 |
| వారసత్వ సంపద: | వికటించిన 'అభివృద్ధి' | పి. శివరామకృష్ణ 'శక్తి' | 31 |
| యంత్రానువాదం: | నాడీ జాలికావలయం | రజనీ రెడ్డి.కె | 33 |
| మాతృభాషలు: | భాష ప్రమాదంలో ఉందని ఎలా.... | రహ్మానుద్దీన్ షేక్ | 35 |
| చర్చావ్యాసం: | పిల్లలకు ఎక్కాలు నేర్పడం ఎలా? | రంగనాయకమ్మ | 40 |
| సాహిత్యరంగం: | మరువలేని మంచి.... | మధురాంతకం నరేంద్ర | 49 |
| ధారావాహికలు: | మన చదువుల కథలు–5 | సి.వి.కృష్ణయ్య | 37 |
| | పడమటి గాలితో నివురు...13 | గుజ్జర్లమూడి కృపాచారి | 43 |
| | అడుగుజాడలు–ఆనవాళ్లు–15 | ఈమని శివనాగిరెడ్డి | 46 |
| కవిత: | పలుకబడి పాయల్లో.... | కంచరాన భుజంగరావు | 26 |
| | పురుషులందు... | డా॥ ఎన్.గోపి | 45 |



| కార్టూన్లు | రేఖాచిత్రాలు | ఫోటోలు | కంప్యూటర్ |
|---|---|---|---|
| సరసి | చిదంబరేశ్వరరావు | తమ్మా శ్రీనివాసరెడ్డి | బండారు రఘురాం |


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

**రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.
సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000
4 సంII: రూ.1000, 1 సంII :రూ.300
ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **91402002038788O**
**IFSC Code : UTIB0000556**

గూగుల్ పే/ ఫోన్ పే ద్వారా **'అమ్మనుడి'** పత్రిక చందా పంపవచ్చు
**నెం. '94929 80244'తో**
బిజినెస్ ఆప్షన్‌లోకి వెళ్ళి
**TELUGU JAATHI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **914020020387880**
**IFSC Code : UTIB0000556**
ఎంట్రీ చేసి పంపవచ్చు

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు. **94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డాII సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు.
   దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ**



# ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ సందర్భంగా యునెస్కో డైరెక్టర్-జెనరల్ ఆద్రే అజౌలె ప్రసంగం

"రచయిత జజె దేంబెలె తన రచనలోని ఒక పాత్ర హామెత్ ద్వారా చాలా గొప్ప విషయాన్ని చెప్పారు. హామెత్ తన భాషనను (నుడిని) తిరిగి నేర్చుకోవాలనుకునే కోరికను వెల్లడిస్తాడు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఇది ఒక అవసరంగా పరిణమిస్తోంది. ప్రతి ఒక్కరూ తమ తమ సొంత నుడుల వైపుకు తిరిగి వెళుతున్నారు. తమ సంప్రదాయాలను తిరిగి ఆవిష్కరించుకుంటున్నారు. కొన్ని వ్యామోహాల వలన, పక్కన పెట్టిన తమ అమ్మనుడులను మళ్ళీ నేర్చుకుంటున్నారు.

ప్రతి నుడికీ ఒక విభిన్నమైన స్వరం ఉంటుంది, వస్తువులను వర్ణించే తీరులో విభిన్న విధానం ఉంటుంది, వివిధ అంశాలను గురించి ఆలోచింపజేసే ఆలోచనల్లో ఈ ప్రత్యేకత కనిపిస్తుంది. అందువలన ఒక నుడిని కొత్తగా నేర్చుకోవటం వలన సంభాషణ మెరుగు పడటమో లేదా ఒక నుడిని మరిచిపోవటం వలన ఆ భాషలో సంభాషణలు చేయటం మరుగునపడటమో మాత్రమే జరగవు. మొత్తం ప్రపంచాన్ని చూసే ఒక కొత్త మార్గం ఏర్పడటమో, ఒక మార్గం కనుమరుగవడమో జరుగుతుంది.

బడిలో చేరిన మొదటి రోజు నుంచే చాలా మంది విద్యార్థులు ఒక కొత్త నుడిని తెలుసుకుంటారు. ఆ భాష నేర్పుతోపాటే బోలెడన్ని ఆలోచనలు వచ్చి చేరతాయి. అలానే తమ తమ ఇంటి భాషలను ఈ కొత్త నుడులని నేర్పులో మెల్లగా ఆ విద్యార్థులు మర్చిపోతారు. ఆ విద్యార్థులు తాము పసిపిల్లలుగా ఉన్నప్పటి నుంచి నేర్చుకున్న ఇంటి నుడి అది. ప్రపంచవ్యాప్తంగా పది మందిలో నలుగురు విద్యార్థులకు తాము మాట్లాడే లేదా అర్థం చేసుకునే నుడిలో చదువులు అందడం లేదు. అందువలన వారి చదువులు అధోగతి పాలవుతున్నాయి.

ఇలా అమ్మనుడి నుండి దూరమవటం మనల్నందరినీ ప్రభావితం చేస్తోంది. ప్రపంచం మంచిగా ఉండాలంటే నుడి వైవిధ్యత ఉండాలి. అందువలన నుడుల వైవిధ్యతను కాపాడటం మనందరి బాధ్యత.

సాంకేతికత భాషా వైవిధ్యాన్ని కాపాడేందుకు కొత్త కొత్త ఉపకరణాలను ఇస్తుంది. ఈ ఉపకరణాలు, భాషల వ్యాప్తికి, భాషల విశ్లేషణకు దోహదపడతాయి. మౌఖికంగా మాత్రమే అస్తిత్వంలో ఉన్న భాషలను సైతం సేకరించి భద్రపరచడంలో సహాయం చేస్తాయి. ఇంకా సులువుగా చెప్పాలంటే ఈ సాంకేతిక ఉపకరణాలు ప్రాంతీయ నుడులను ఉమ్మడి వారసత్వంగా మలిచేందుకు బాటలు వేస్తాయి.

కానీ ఇంటర్నెట్(వలగూడు) వలన మరో వైపు ఒకే నుడిని అందరూ వాడే పరిస్థితి ఏర్పడుతోంది. అంటే, మనం పనిగట్టుకొని మన నుడుల్లో వలగూడు వనరులను రూపొందించకపోతే, ఆంగ్ల నుడిలోనో, మరొక నుడిలోనో వలగూడులోని వనరులను ఉపయోగించాల్సి వస్తుంది. పలు నుడుల్లో డిజిటల్ ఉపకరణాలను రూపొందించడం, ఆయా నుడుల్లో దృశ్యక-శ్రవ్యక-ఛాయాచిత్ర-పాఠ్య వనరులను ఇంటర్నెట్‌లో పొందుపరచడం, ఆ పొందుపరిచిన వనరులను అందరికీ అందుబాటులో ఉంచడం, ఇవన్నీ జరిగితేనే జనం తమ అమ్మనుడులను మర్చిపోకుండా వేరే భాషలను నేర్చుకోగలుగుతారు.

జన భాషల దశాబ్ది ఈ ఏడాదితో మొదలవుతోంది. ఈ సందర్భంగా పరిశోధకులు, మీడియాలోని వ్యక్తులు, వక్తలు తమకు చేతనైనంతలో నుడులకు సంబంధించిన వనరులను తయారు చేసుకోవడం, సేకరించడం, భద్రపరచడం, అందరికీ అందుబాటులోకి తేవడం చేయాలి. ఈ అమూల్యమైన వనరులను సంరక్షించడంలో, ప్రపంచ వైఖరిని భాషల పట్ల అనుకూలంగా చేయడంలో సహకరించాలి. ఈ విశ్వ ప్రయత్నానికి నాయకత్వం వహిస్తూ యునెస్కో దశాబ్దం పాటూ తన పనులను ఈ దిశగా ముమ్మరం చేసేందుకు సిద్ధంగా ఉంది.

ఈ ప్రపంచ మాతృభాషా దినోత్సవంనాడున, నేను ప్రతి ఒక్కరినీ భాషాపరమైన, సాంస్కృతికపరమైన వైవిధ్యతను కాపాడమని పిలుపునిస్తున్నాను. మన ఈ మానవత్వపు భాషా వైవిధ్య ఉమ్మడి ఆస్తిని మనమందరం కలిసికట్టుగా తయారు చేసుకుందాం."


STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF **"AMMANUDI",** MONTHLY MAGAZINE, **Tenali** as required under Rule 3 of the Registration of News Papers (Central) Rules 1956.

**FORM IV** (See Rule 3)

| | | | |
|---|---|---|---|
| 1. Place of Publcation | : Angalakuduru | 7. Editor's Name | : SAMALA RAMESH BABU |
| 2. Periodicity | : Monthly | Address | : As above |
| 3. Printer's Name | : SAMALA LAKSHMANA BABU | 8. Names & Addresses of individuals who own the News Paper | : SAMALA LAKSHMANA BABU As above |
| 4. Whether Citizen of India | : Yes | | |
| 5. Address | : D.No.8-386, Angalakuduru Post, Tenali Mandal - 522 211 Guntur Dist., A.P. | | |
| 6. Publishers Name | : SAMALA LAKSHMANA BABU | | |
| Address | : As above | | |

I, Samala Lakshmana Babu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Tenali
28-2-2022

sd/- S. Lakshmana Babu
Publisher

# ఇవీ వార్తలు...

## కోవి-ఆరోగ్య సేతు పుటలు ప్రాంతీయ భాషల్లో లేకపోవడం వలన టీకాల అందజేతలో, అవగాహన పెంచడంలో జాప్యం.

భారతదేశ కేంద్ర ప్రభుత్వం కోవిడ్ మహమ్మారి గురించిన అవగాహన కల్పిస్తూ, పౌరుల రక్షణ కోసం తయారు చేసి, అందరిపై తప్పనిసరి చేసిన ఆరోగ్యసేతు చేపలుకి ఉపకరణం, కోవిన్ టీకాల నమోదు వలగూడులు అన్ని ప్రాంతీయ నుడుల్లో అందుబాటులో లేకపోవడం వలన కోవిడ్ గురించిన అవగాహన ప్రజల్లోకి పెద్దగా వెళ్ళలేదని ఒక పరిశోధన ద్వారా తెలిసింది. ఇంగ్లిష్, అస్సామీ, గుజరాతీ, హిందీ, పంజాబీ, మరాఠీ, బాంగ్లా, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, ఒడియా భాషల్లో మాత్రమే ఆరోగ్య సేతు అందుబాటులో ఉంది. రాజ్యాంగంలో గుర్తింపు పొందిన ఉర్దూ, బోడో, సంతాలీ, మైథిలి, డోగ్రీ, కశ్మీరీ, సింధీ, కొంకణీ మరియు మణిపురి భాషల్లో ఆరోగ్య సేతు అందుబాటులో లేదు. కోవిడ్ టీకా నమోదు వలగూడు కేవలం పన్నెండు భాషల్లో మాత్రమే అందుబాటులో ఉండటం. అంతకన్నా తక్కువ భాషల్లో కాల్ సెంటర్ పని చేయడం వలన టీకాల నమోదులో జాప్యం, టీకాల గురించిన అవగాహనా లోపం ఈ ప్రభుత్వం మరిచిన భాషలు మాట్లాడే ప్రాంతాల్లో ప్రస్ఫుటంగా కనిపించిందని ఈ పరిశోధనా పత్రం తెలిపింది.

## జాతీయ విద్యావిధానం వలన ఒడిశాలో మాట్లాడే 21 మౌఖికభాషల 74మాండలీకాలకు పాఠ్యపుస్తకాలు!

ఒడిశాలో జాతీయ విద్యా విధానం ప్రకారం అమ్మనుడిలో ప్రాథమిక విద్యను అందించేందుకు అక్కడి ప్రభుత్వం నడుం బిగించింది. "సంహతి" అనే ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని వివిధ తెగలకు సంబంధించిన విద్యార్థులకు చివరికంతా విద్య చేరేలా చర్యలు చేపట్టింది.

ఒక అంచనా ప్రకారం అక్కడి రాష్ట్ర షెడ్యూలు కులాల, షెడ్యూలు తెగల పరిశోధన&శిక్షణ సంస్థ (Scheduled Tribes Research and Training Institute (SCSTRTI), తెగల భాషా, సాంస్కృతిక అకాడెమీ(Academy of Tribal Language and Culture (ATLC) ఈ ప్రాజెక్టును సంయుక్తంగా చేపట్టి 1732 వసతిబడులను నడుపుతున్నాయి. వీటిల్లో 4.5 లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు. మరొక 2.5 లక్షల విద్యార్థులను మరో 1450 కొత్త ప్రాథమిక బడులలో చేర్చాలన్నది సంస్థల సంకల్పం. ఇప్పటికే వివిధ తెగలకు సంబంధించి వారి మాతృభాషల్లోనే చదువు నేర్పేందుకు 3328 సాధారణ ఉపాధ్యాయులు, 222 భాషా ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. అయితే ఈ తెగల భాషలలో కేవలం సంతాలీ భాషకు ఓల్‌చికి అనే లిపి ఉంది. మిగితా తెగల భాషలను ఒడియా లిపిలోనే చదివించాల్సి ఉంది. కొత్తగా 1000 మంది ఉపాధ్యాయులకు ఈ విధానంలో తెగల భాషల్లో చదువు చెప్పేలా శిక్షణ ఇవ్వనున్నారు.

## హిందీని జాతీయభాషగా పరిగణిస్తారా అంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన తెలుగు వ్యక్తి.

ఒక నార్కోటిక్స్ కేసులో పట్టుబడిన గంగం సుధాకర రెడ్డి అనే నిందితుడు బాంబే హైకోర్టులో బెయిల్ కోసం చేసుకున్న అభ్యర్థన విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు న్యాయమూర్తి బెయిల్ అభ్యర్థనను కొట్టివేస్తూ, నిందితుడికి నిబంధనలు హిందీలో తెలియపరిచామని, హిందీ జాతీయ భాష అని చెప్పారు. నిందితుడికి కేవలం తెలుగు భాష మాత్రమే వచ్చుని అతను చెప్పినా, న్యాయమూర్తి పట్టించుకోలేదు.

హిందీ జాతీయ భాష అని న్యాయమూర్తి వ్యాఖ్యానించడం పట్ల నిరసన తెలుపుతూ నిందితుడు సుప్రీం కోర్టును ఆశ్రయించాడు.

ఇంతకు ముందు మరో విచారణలో ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానం చేస్తూ ఖైదు చేసే ముందు పోలీసులు నిందితులకు కారణాలను వారికి ఖైదీకి అర్థమయ్యే భాషలో లిఖిత రూపంలో ఇవ్వాలని తీర్పునిచ్చింది.

## అంతర్జాతీయ మాతృభాషా సంస్థలో జరుగుతున్న పనులతీరు ఇది!

పదకొండేళ్ళ క్రితం బాంగ్లాదేశ్‌లో బాంగ్లా నుడితో సహా ప్రపంచ అమ్మనుడులలో ప్రగతి జరిగేలా, పరిశోధనలను ప్రోత్సహించేలా ఐక్యరాజ్యసమితి ఒక ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయ సంస్థను ఏర్పాటుచేసింది. ఆ సంస్థ పేరే అంతర్జాతీయ మాతృభాషా సంస్థ.

అయితే ఇన్నేళ్ళలో ఈ సంస్థకు నిర్దేశించిన అమ్మనుడుల పరిరక్షణ, అమ్మనుడుల గురించిన వనరుల సేకరణ, పరిశోధనలు మరియు తర్ఫీదు కార్యక్రమాలలో ఎలాంటి పనులూ జరగలేదు. కొన్ని సభలు, చాలా కొద్ది జ్ఞాపిక పత్రికలు మాత్రమే వెలువరించింది ఈ అంతర్జాతీయ సంస్థ.

ఇప్పటివరకూ కేవలం ఒక ప్రధాన పరిశోధన మాత్రమే, అదీ అసంపూర్ణంగా, చేపట్టింది ఈ సంస్థ - బాంగ్లాదేశ్‌లోని అల్పసంఖ్యాక భాషలపై ఒక పరిశోధన. నాలుగేళ్ళ క్రితమే ఈ పరిశోధనను అర్థాంతరంగా ముగించారు పరిశోధకులు. పరిశోధన జరిపిన తీరు గానీ, ఫలితాల వెల్లడి గానీ ఇంకా జరగలేదు.

ఈ సంస్థ ప్రపంచ అమ్మనుడుల మ్యూజియంను, వివిధ వ్రాత పద్ధతులను భద్రపరిచే వనరును తయారు చేయాల్సి ఉండి కూడా ఆ దిశగా ఏం పని జరుపలేదు.

ఇదీ మన పొరుగు దేశంలో ఒక అంతర్జాతీయ సంస్థ గత పదకొండేళ్ళలో జరిపిన ప్రగతి. ఇక మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ స్థాయిలో భాషల కోసం ఏం చేస్తున్నాయోనన్న విషయం గురించి ఎంత వెతికినా పెద్దగా ఏమీ కనిపించదు.

మాతృభాషల మీద వివిధ విశ్వవిద్యాలయాల్లో ఏం పరిశోధనలు జరిగాయి? భాషాశాస్త్రానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో చూద్దామని శోధ్‌గంగ(భారత ప్రభుత్వం ద్వారా నడుపబడుతున్న పరిశోధనా పత్రాల నెలవు) చూడగా, అక్కడ వెతికే యంత్రాన్ని అచేతనం చేశారు నిర్వాహకులు!

సంపుటి : 8 సంచిక : 1
అమ్మనుడి
మార్చి 2022

సంపాదక హృదయం

# భాషా స్వాభిమానం కోసం రాజ్యాంగ సవరణ తప్పదు

**మన** రాజ్యాంగం ఒక కళాఖండమో, రాతి విగ్రహమో కాదు, చూసి మురిసిపోవడానికి. అది ఒక విశాల, వైవిధ్యభరితమైన మన దేశానికీ ప్రభుత్వాలకూ ప్రజలకూ ఒక దారి దీపం. ఒక నిరంతర నియంత్రణ సూచిక. అది పవిత్రమైనదే కాని ఎన్నటికీ మార్పునకు సిద్ధపడని ఒక మత గ్రంథం వంటిది కాదు. దేశంలోని ప్రతిభావంతులైన, నిబద్ధత కలిగిన నాటి నేతల, మేధావుల, దేశభక్తుల, ఉద్యమకారుల మేథోమథన ఫలం మన రాజ్యాంగం. ఆ రాజ్యాంగ నిర్మాణ బాధ్యతను చేపట్టిన అంబేద్కర్ ఆనాడే స్పష్టం చేసినట్లు – ఆ రాజ్యాంగ ప్రయోజనం, దాన్ని ఉపయోగించుకొనేవారి చిత్తశుద్ధిని బట్టి, సమర్థతను బట్టి ఉంటుంది. అందుకు తగిన హెచ్చరికలన్నిటినీ ఆయన ఆనాడే చేశాడు.

రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చుకొని 70 ఏళ్లు దాటిన తర్వాత కూడా రాజ్యాంగాన్ని పూర్తిగా తిరగరాయాలనే నేతలూ, దాన్ని ఏమీ మార్చకూడదనే నేతలూ మన పాలకవర్గాల్లో ఇంకా ఉండడమే విచిత్రం.

రాజ్యాంగానికి ఇప్పటికే చేసిన సవరణలూ పరిశీలనలో ఉన్నవీ మొత్తం 100కు దాటిన సంగతి మనకు తెలుసు. ఐనా, ఇంకా మనం కొన్ని కీలక అంశాలపై ఈ 70 ఏళ్ల అనుభవాలనూ, అవసరాలనూ సమీక్షించుకొని, మరి కొన్ని సవరణలను రాజ్యాంగంలో తెచ్చుకోవలసి ఉంది. అటువంటి అంశాల్లో అతి ముఖ్యమైనది మన భాషావిధానం.

భాషావిధానం అనగానే ఎన్నో అంశాలు చర్చకు వస్తాయి. పాలనకు, బోధనకు, సంబంధించి మాత్రమేగాక, కేంద్ర, రాష్ట్రాల భాషా సంబంధాలు, జాతీయ భాష, భాషాజాతుల మనుగడ, అభివృద్ధి, వాటి భవిష్యత్తు– ఇలాంటి అనేక అంశాలు మన ముందుకు వస్తాయి. ఇంతటి కీలకమైన, పెద్ద సమస్య గనుకనే రాజ్యాంగ నిర్మాణ సభ దానిపై రోజుల తరబడీ చర్చించి, స్పష్టత కుదరక, కీలక అంశాలను వాయిదావేసింది. అయినా, ఇంకా అవి అలాగేవున్నాయి. కాలం గడిచేకొద్దీ కొన్ని సమస్యలు రూపుమార్చుకొన్నాయి, కొన్ని బిగుసుకుపోయాయి. వలసభాషల, ఆధిపత్యభాషల పెత్తనం పెరిగి, ప్రజాభాషలైన అమ్మనుడులు విలవిలలాడుతున్నాయి, అనేక సందర్భాల్లో ఆధిపత్య భాషలకు లొంగిపోక తప్పని పరిస్థితిని ప్రజలకు కల్పిస్తున్నాయి. కేంద్ర చట్టసభల్లోని సభ్యులు తమ భాషలో హాయిగా మాట్లాడేందుకు వీలుగాని పరిస్థితి ఉంది. చట్టాల నిర్మాణంలో, వాటి అమలులో వలస, ఆధిపత్య భాషల పెత్తనం వల్ల సామాన్య ప్రజలు తమ మాతృభాషలలో తాము మాట్లాడలేని, వ్రాయలేని, వాదించుకోలేని పరిస్థితుల్లోకి మన వ్యవస్థలు చేరుకొన్నాయి. దేశంలోని అత్యధిక ప్రజల నాలుకలను బిగించివేయడంతో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య వ్యవస్థ అనే మాటలు చెల్లకుండా పోయాయి, బూటకంగా మిగిలిపోయాయి.

తెలుగువారికి రెండు రాష్ట్రాలున్నాయి. దేశంలో ఎక్కువమంది మాట్లాడే ప్రజల్లో మన తెలుగు కూడా అగ్రస్థానంలో ఉంది. అయినా పార్లమెంటులోనూ, పై నుంచి కింద దాకా పరిపాలనలోనూ మన భాష ఎందుకు అక్కరకు రానిదైపోయిందో ? ఆలోచించండి. ఇదే పరిస్థితి మరికొన్ని ఇతర భాషీయులకు కూడా ఉంది. ఈ పరిస్థితి నుండి బయటపడాలంటే– మన రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో గుర్తించిన 22 భాషలను జాతీయ భాషలుగా గుర్తించాలి. అప్పుడే రాజ్యాంగం ఇచ్చిన హక్కుల సమానత అనే గొప్పభావనకు ఆచరణలో తలుపులు తెరుచుకొంటాయి.

మన ప్రధాన మంత్రి మోదీ ఫిబ్రవరి 27న వెల్లడించిన మనసులో మాటలు (మన్ కీ బాత్) ఎంతో ఆహ్లాదాన్ని కలిగించాయి. అదే సమయంలో కొన్ని ఆలోచనలను, ప్రశ్నలను కూడా రేకెత్తించాయి. అమ్మనుడిని స్వాభిమాన సంకేతం అని అంటూ ఎవరి భాషలో వారు మాట్లాడడానికి సిగ్గుపడకూడదని కూడా ఆయన

సంపాదక హృదయం

చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా, మన దేశంలో ఇప్పటికీ కొందరు సొంత భాష, వస్త్రధారణ, అన్నపానీయాల గురించి చెప్పుకోడానికి సంకోచిస్తున్నారని, ప్రపంచంలో ఇలాంటి పరిస్థితి ఎక్కడా లేదని కూడా ఆయన చెప్పారు.

ఇది స్వాభిమానానికి సంబంధించిన అంశమని ఆయన స్పష్టంచేశారు. 'భాషంటే అభివ్యక్తీకరణ మాధ్యమం మాత్రమే కాదు, అది సామాజిక సంస్కృతి, వారసత్వాల సంరక్షణకు దోహదం చేస్తుంది' అని ఆయన ఉద్ఘాటించారు.

అంతేకాదు. 'భాష విషయంలో భారతదేశానికున్న సుసంపన్నతను కొలవడం అసాధ్యం. కశ్మీర్ నుండి కన్యాకుమారి, కచ్ నుండి కోహిమా వరకు వందల భాషలు, వేల యాసలు ఉన్నాయి. ఒకదానికొకటి భిన్నమైనా అన్నీ మమేకమై మనుగడ సాగిస్తున్నాయి. భాషలు ఎన్నున్నా భావం ఒక్కటే' అని కూడా ఆయన ఈ సందర్భంలో అన్నారు. భారతీయ మాతృభాషల గురించి ఇంత చక్కని అవగాహన ఉన్న నేత ప్రధాన మంత్రిగా ఉండడం చాలా గొప్ప సంగతి. ఆయన అత్యంత నిర్ణయాత్మక శక్తి కలిగి వున్న నాయకుడు. పూర్తి అధికారాలున్నవాడు. అంతటి వ్యక్తి నోట ఆ మాటలు రావడం- అదీ 'ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ' రోజుల్లో ప్రజలకు ఈ సందేశం అందడం చాలా ఆనందించవలసిన సంగతి. దేశంలోని భాషల వైవిధ్యత గురించీ, దేశ సమైక్య సంస్కృతులపై స్పష్టత కలిగివున్న నరేంద్రమోదీ గారికి దేశ సమైక్యతను కాపాడుకోవటంలో భాషాజాతుల కీలక పాత్ర గురించి కూడా స్పష్టమైన అవగాహన, ఆలోచన ఉండితీరుతుంది.

అయితే, ఎంతటి నాయకులకైనా తమ రాజకీయ ప్రయోజనాలు ముఖ్యంగా ఉంటాయన్నది ఈ దేశ రాజకీయ చరిత్ర వెల్లడించే నిజం. నరేంద్రమోదీ విషయంలోనైనా ఇదే కొలమానం తప్పదు. తన పార్టీ నమ్మిన ఆశయాదర్శాలు ఆయన ఆలోచనల్లో ప్రధానంగా ఉంటాయి.

మాతృభాషల్ని బట్టే జాతులను గుర్తిస్తాం. అయితే భిన్న భాషీయులు ఒకే భౌగోళిక జాతుల్లో భాగంగా ఉండడానికి భారత ఉపఖండం ఒక పెద్ద సాక్ష్యం. ఇందుకు అనేక కారణాలుంటాయి. తమ వికాసానికి కీలకమైన మాతృభాషల రక్షణ కోసం ఏ జాతి అయినా అవసరమైతే సంఘర్షణకు సిద్ధపడుతుంది. అందుకే తమ ఆత్మగౌరవానికి ఆలంబనమైన తన మాతృభాషను ఎవరు తక్కువచేసి మాట్లాడినా అతడు అంగీకరించడు. చిన్నదైనా, పెద్దదైనా అన్ని భాషలూ గొప్పవేనన్న సంగతిని ఎవరూ మరువకూడదు.

ఇప్పుడు దేశంలోని అన్ని భాషల ఆత్మగౌరవాన్నీ కాపాడవలసిన బాధ్యత ఈ దేశ ప్రభుత్వంపై ఉంది. మోదీ వంటి ప్రధాని అధికారంలో ఉండగానే ఈ పని మొదలు కావాలి. హిందీ ఆధిపత్యాన్నీ, వలస భాషల దూకుడునూ అరికట్టే దేశభాషలను అన్ని విధాలా సాధికారికం చెయ్యాలి. మన దేశ చట్ట సభలలోనే ఈ సంస్కరణ కృషి మొదలు కావాలి. కాశ్మీర్ వంటి సమస్యని పరిష్కరించడానికీ పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా విముక్తం చేయడానికీ చేస్తున్న ఆలోచన, పౌరసత్వ సమస్యల పరిష్కారం కోసం పడుతున్న శ్రమా మోదీ ప్రభుత్వ దీక్షకు, సమర్థతకు అద్దంపట్టేవే. ఐతే అంతకంటే ముఖ్యంగా వైవిధ్య భరితమైన భాషా సంస్కృతులను, వారి ఆత్మగౌరవాన్ని రక్షించేందుకు పూనుకోవాలి. లేక పోతే- దేశంలో భాషల ప్రాతిపదికన వివిధ ప్రాంతాలకు జరుగుతున్న అన్యాయం పైన, సంఘర్షణలు తలెత్తే అవకాశం ఉంది. అది భారతదేశ ఐక్యతకు గొడ్డలిపెట్టుగా పరిణమించే అవకాశం ఉంది.

కేవలం అధికారమే ప్రధానంగా రాజకీయం చేస్తున్న కొన్ని పార్టీలను ఎదుర్కోవడానికి వారిని 'తుక్‌డే తుక్‌డే గ్యాంగ్' అని విమర్శలు చేయడంవల్ల ప్రయోజనం ఉండదు. దేశాన్ని ఆంతరంగికంగా దెబ్బదీసేందుకు మూల కారణం కాగల భాషా సమస్యను పరిష్కరించడానికి కావలసిన తనకుగల అవగాహనతో విజ్ఞతతో ముందుకు సాగాలి. రాజ్యాంగం గుర్తించిన 22 భాషలనూ జాతీయ భాషలుగా గుర్తించేందుకు, పూనిక వహించాలి. అంతేగాక జాతీయ భాష ఒక్కటే ఉండాలనే కాలం చెల్లిన వాదానికి స్వస్తి పలకాలి. అన్ని భాషలను కాపాడేందుకూ, మాతృభాషలలో చదువులను తప్పనిసరి చేసేందుకూ తగిన రాజ్యాంగ సవరణలు చెయ్యాలి. ఈ పనులను మోదీ ప్రభుత్వం చెయ్యగలిగితే- ఆయనకు ఇప్పట్లో తిరిగి వెనక్కు చూసుకోవలసిన అవసరమే ఉండదు.

సామల రమేష్ బాబు

తేదీ : 03-03-2022

# తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడుగా
# ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
## ఫిబ్రవరి 20న విజయవాడలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం




సర్వసభ్య సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు ప్రసంగిస్తున్న దృశ్యం. వేదికపై తీర్మానాల ప్రతిపాదకులు

**ఈ** నెల 20వ తేదీ ఆదివారంనాడు విజయవాడ ఆంధ్ర లయోలా కాలేజి సమావేశమందిరంలో డా॥ సామల రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన తెలుగు భాషోద్యమ సమాఖ్య సర్వసభ్య సమావేశంలో రెండు రాష్ట్రాలనుండి 70 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాఖ్యకు కొత్త అధ్యక్షుడిగా హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు, ప్రముఖ భాషాశాస్త్ర ఆచార్యుడు, భారతీయ భాషల కేంద్ర సంఘం(లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా), అధ్యక్షుడుగా ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు పేరును డా॥ సామల రమేష్‌బాబు ప్రతిపాదించగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

తెలుగు భాషోద్యమ సమాఖ్య 2003 ఫిబ్రవరి 21న స్థాపించిన తరువాత తొలి అధ్యక్షుడిగా సి.ధర్మారావు, రెండవ అధ్యక్షునిగా డా॥సామల రమేష్‌బాబు పనిచేశారు. ఇప్పుడు అధ్యక్షునిగా ఎన్నికైన ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మూడవ అధ్యక్షుడు. సమాఖ్య స్థాపకులలో ఒకరైన డా॥మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేకంగా ఈ సభలో పాల్గొని ఇంతవరకు సమాఖ్య చేసిన ఉద్యమ కార్యక్రమాలు చరిత్రాత్మకమైనవని అన్నారు. ఇకముందు చేపట్టవలసిన కీలకమైన ఉద్యమ కార్యక్రమాలకు తగిన భాషాశాస్త్రవేత్తను ఇప్పుడు మూడవ అధ్యక్షునిగా ఎన్నుకోవడం చాలా మంచి నిర్ణయమని ప్రశంసించారు.

**ఈ సభ 10 తీర్మానాలను చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించింది. అవి:**

1. అధికార భాషగా తెలుగును అన్ని రంగాల్లో అమలు చెయ్యాలి.
2. తెలుగు మాధ్యమంలో చదివినవారికి ప్రభుత్వ ఉద్యోగాలలో 20% కేటాయింపు ఉండాలి.
3. న్యాయస్థానాల్లో తెలుగులో తీర్పులు ఇవ్వాలి.
4. ప్రాథమిక విద్య అమ్మనుడిలోనే ఉండాలి.
5. దేశంలోని ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగువారి భాషాహక్కులను కాపాడాలి.

6. ధార్మిక, సాంస్కృతిక రంగాల్లో వలసభాషల దూకుడును అరికట్టాలి.

7. భాషాజాతుల వారసత్వసంపద పరిరక్షణ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపైకి తేవాలి.

8. తెలుగునుడి సాంకేతికంగా పుంజుకునేందుకు పటిష్టమైన కృషిసాగించాలి.

9. తెలుగుజాతి భాష, సంప్రదాయాలు, సంస్కృతులపై వివిధ విశ్వవిద్యాలయాలల్లో పరిశోధకులు, ఆచార్యులు, ఎంచుకొంటున్న పరిధులు ఎల్లలను దాటి విస్తరించాలి.

10. మాతృభాషలపై ముప్పును ఎదుర్కోవడానికై అవసరమైన రాజ్యాంగ సవరణ చెయ్యాలి.

ఈ అంశాలపై 5 గంటలపాటు విస్తృతంగా జరిపిన చర్చలలో విశ్వవిద్యాలయాల ఆచార్యులు, న్యాయవాదులు, పరిశోధకులు, సామాజిక ఉద్యమకారులు, సాంకేతిక నిపుణులు, రచయితలు పాల్గొన్నారు.

తరువాత– ఒక తాత్కాలిక కేంద్రమండలిని సమాఖ్య నూతన అధ్యక్షుడు ప్రకటించారు. తీర్మానాల పూర్తి వివరాలను, తీర్మానాల ప్రతిపాదకుల ప్రసంగాలను తరువాతి పుటలలో చదువవచ్చు. కేంద్రమండలి సభ్యుల వివరాలను కూడా ఈ పత్రికలో చూడవచ్చు. ఈ మండలి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై సమాఖ్య కార్యక్రమాలను సమీక్షించి తగు నిర్ణయాలను తీసుకొంటుంది. ఈ మండలిలో పూర్వ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు, విశ్రాంత ఐ.ఎ.స్. అధికారి ఎన్. ముక్తేశ్వరరావు, ప్రముఖ పరిశోధకులు డా॥ ఈమని శివనాగిరెడ్డి, 'శక్తి' శివరామకృష్ణ, ఆచార్య పులికొండ సుబ్బాచారి, తెలుగు సాంకేతిక రంగంలో నిపుణులైన డా॥కొలిచాల సురేష్(అమెరికా), డా॥ తొట్టెంపూడి శ్రీగణేష్ (జర్మని), వీవెన్, రహ్మానుద్దీన్ షేక్, మున్నగు 32 మంది ప్రముఖులతో ఈ కేంద్ర సలహా మండలి ఏర్పడింది.

తెలుగు భాషోద్యమ సమాఖ్యకు తొలినుండీ గౌరవాధ్యక్షులుగా ఉంటూ తన మార్గదర్శకత్వంలో సమాఖ్య కార్యక్రమాలకు ఎంతో శక్తినిచ్చిన డా॥ చుక్కా రామయ్య గారిని కొనసాగిస్తూనే ఇప్పుడు అధ్యక్షుడిగా తప్పుకుని సమాఖ్యకు కొత్త అధ్యక్షునిగా ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావును ప్రతిపాదించిన డా॥ సామల రమేష్‌బాబులను కూడా గౌరవాధ్యక్షునిగా ఉంటూ తమ సహకారాన్ని కొనసాగాలని సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. సమావేశకర్తగా డా॥ వెన్నిసెట్టి సింగారావుని నియమించారు.

సమాఖ్య తాత్కాలిక కేంద్రమండలి మార్చి నెలలో తొలిసారిగా హైదారాబాదులో సమావేశమై భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందిస్తుంది.

**వెన్నిసెట్టి సింగారావు**
సమావేశకర్త




సమావేశంలో తీర్మానాలపై చర్చిస్తున్న ప్రతినిధులు

# బహుముఖంగా భాషోద్యమం

**మూడు** దశాబ్దాల క్రితమే అమ్మనుడిని రక్షించుకోవాలనే ఆలోచన బయలుదేరింది. అప్పటికే సుమారు పది సంవత్సరాలకు పైగా తెలుగుభాష పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా కొందరు తమ గళాల్ని వినిపించటం మొదలుపెట్టారు. భూపతి నారాయణమూర్తి అనే దళితోద్యమ నేతను దీనికి ఆద్యుడుగా మనం చెప్పుకోవచ్చు. తెలుగుభాషను రక్షించుకోవాలంటూ ఒక రాజకీయపార్టీనే ఆయన పెట్టాడు. ఆ తరువాత దీనికి చేకూరి రామారావు, సి.ధర్మారావు, ఎన్.ఎస్.రాజు వంటి కొందరు పెద్దలు మాతృభాషా పరిరక్షణ సమితి పేరుతో ఒక సంఘాన్ని స్థాపించి తమ శక్తికొద్దీ ప్రభుత్వానికి విజ్ఞాపనలివ్వటం మొదలుపెట్టారు.'జనసాహితి' అనే సాహిత్య సంస్థ కూడా ముందుగా కదిలింది. 'నడుస్తున్న చరిత్ర' అనే ఒక సామాజిక, రాజకీయ మాసపత్రిక సరిహద్దు రాష్ట్రాల్లో తెలుగువారి భాషాసమస్యల గురించి ప్రచారం చేసింది. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగియైన సి.ధర్మారావుకు నడుస్తున్న చరిత్రతో ఏర్పడిన పరిచయం క్రమంగా పలువురు మిత్రులను కలిపి ఒక చర్చకు దారితీసి కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో రెండురోజుల పాటు తెలుగు భాషోద్యమ సమాలోచనా శిబిరం నిర్వహణకు దారితీసింది. ఈ శిబిరాన్ని అప్పటి శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్, నడుస్తున్న చరిత్ర సంపాదకుడు సామల రమేష్‌బాబు నిర్వహించారు. ఆ సమావేశంలో రాష్ట్రం నలుమూలల నుండి, పొరుగు రాష్ట్రాల నుండి వచ్చిన 200 మందికి పైగా ప్రతినిధులు చేసిన నిర్ణయం ప్రకారం 'తెలుగు భాషోద్యమ సమాఖ్య' పేరుతో ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయించింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఫిబ్రవరి 21న జరపాలన్న యునెస్కో పిలుపునందుకుని తెలుగు భాషోద్యమ సమాఖ్యను 2003 ఫిబ్రవరి 21 నే ప్రారంభించాలని నిర్ణయించింది. ఆ ప్రకారం హైదరాబాద్‌లో పెద్దయెత్తున ఫిబ్రవరి 21 న జరిగిన 'బృహత్సభ'లో అనేకమంది హేమాహేమీలు పాల్గొనగా జరిగిన సమాఖ్య ప్రారంభోత్సవ సమావేశం తెలుగుజాతి భాషోద్యమంలో ఒక మలుపుగా, పెద్ద ముందడుగుగా నమోదు అయింది. సి.ధర్మారావు, రమేష్‌బాబు అధ్యక్ష, కార్యదర్శులుగా కేంద్రసంఘం ఏర్పడి, అనేక ఉద్యమాలను, పోరాటాలను నిర్వహించింది. పొరుగు రాష్ట్రాల్లో కూడా సమాఖ్య శాఖలు ఏర్పడ్డాయి. 2004 చివరిలో ప్రాచీనభాషగా తమిళాన్ని మాత్రమే గుర్తించడంలోని అశాస్త్రీయతను అర్ధసత్యాన్ని, ఎత్తిచూపి ప్రజల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో కదలిక వచ్చేట్లుగా ఉద్యమాన్ని నడిపింది. ఫిబ్రవరి 21న హైద్రాబాద్‌లో పెద్ద నిరాహారదీక్ష కార్యక్రమాన్ని చేపట్టటంతో అన్నిపార్టీలు, ప్రభుత్వమూ కదిలివచ్చాయి. రచయితల సంఘాలు, ఇతరులు కదిలి కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగుకు కన్నడానికి కూడా ప్రాచీనభాషా ప్రతిపత్తిని ఇవ్వడానికి కేంద్రం అంగీకరించక తప్పలేదు. రాష్ట్రంలో తెలుగును ఒక తప్పనిసరి భాషగా జి.ఓ. రప్పించడంలోనూ ఇంకా అనేక మార్పులకూ తెలుగు భాషోద్యమ సమాఖ్య కృషి కారణమైంది. 2009లో సమాఖ్యకు సామల రమేష్‌బాబు అధ్యక్షుడిగా బాధ్యత స్వీకరించారు. తెలుగు భాషకు ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, తెలుగుభాష అభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు, ఇంకా కొన్ని కీలకమైన 9 డిమాండ్లతో రాష్ట్రమంతటా చేపట్టిన ఉద్యమం చాలాకాలం సాగి తిరుపతిలో జరిగిన 4వ ప్రపంచ తెలుగు మహాసభలను సమాఖ్య బహిష్కరించి, వీధులకెక్కడానికి దారితీయడంతో ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి కొన్ని డిమాండ్లకు అంగీకరించింది. అయితే రాష్ట్ర విభజనవల్ల ఏర్పడిన రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తెలుగుపట్ల ఏమంత శ్రద్ధ చూపకపోవడంతో తెలుగుకు మంత్రిత్వశాఖ పేరుకే మిగిలి, సాంస్కృతిక శాఖ క్రింద కాలాన్ని వెళ్లబుచ్చుతోంది. తెలంగాణ ప్రభుత్వ పూనికతో ప్రపంచ తెలుగు మహాసభలు ధూంధాం అంటూ హైదరాబాదులో జరిగాయి. తెలుగును విద్యారంగంలో, పరిపాలనలో ఉద్ధరిస్తామంటూ ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు పెద్దపెద్ద ఆశలను రేకెత్తించినా, చివరకు ఆచరణలో ఏమీ లేకపోవడంతో తుస్సుమంది. ఇటు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పరిపాలనలో కూడా ఇంచుమించు అలాగే జరిగింది. మున్సిపాలిటీల నిర్వహణలోని పాఠశాలల్లో తెలుగుమీడియం స్థానే ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టటం, ఇంకా అటువంటి కొన్ని చర్యలు చాపకింద నీరులా సాగి పాఠశాల విద్యలో తెలుగు స్థానాన్ని కల్లోల భరితం చేశాయి. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో కలిసి సాగించిన ఉద్యమాలు నిష్ఫలమైపోయాయి. తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ స్థాపనకు ఒక చట్టాన్నే తెస్తామన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక జి.ఓ.తో సరిపుచ్చుకొని కాలక్షేపం చేసింది. ఇంతలో ఎన్నికలు జరిగి వైకాపా పార్టీ అధికారంలోకి రావటంతో అంతా మళ్ళీ మొదటికొచ్చింది. పాఠశాల విద్యను ఇంగ్లీషు మీడియంలోకి తేవాలని తెదేపా రహస్యంగా చేసిన ప్రయత్నాలకు భిన్నంగా వైకాపా ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియాన్ని బహిరంగంగా ప్రకటించి కోర్టులను కూడా ధిక్కరించి, మరీ ప్రవేశపెట్టింది. ఇదే సమయంలో అటు తెలంగాణలో కూడా ఇంగ్లీష్ మీడియం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఒక భాషగానైనా తెలుగును బోధించడం పల్చబడిపోయింది. ప్రైవేటు పాఠశాలల్లో, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకొంటున్న పిల్లల తెలుగు పరిజ్ఞానం నానాటికి

అడుగంటిపోతోంది. తెలుగు రాయడానికి, మాట్లాడడానికీ కూడా సిగ్గుపడే ధోరణి ప్రబలుతోంది.

తెలుగు బోధన సంగతి ఇలావుండగా, ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ పరిపాలన దాదాపు ఆంగ్లంలోనే జరుగుతోంది. నేతలు ప్రజలతో మాట్లాడ్డం మాత్రమే తెలుగులో. పరిపాలనంతా ఆంగ్లంలోనే! ఇది భాషారాష్ట్రాల ఏర్పాటులక్ష్యానికే వ్యతిరేకం. చట్టసభల్లో వాదనలు తెలుగులోనే. చట్టాలు మాత్రం ఆంగ్లంలో. న్యాయస్థానాల్లో ఏ స్థాయిలోనూ తెలుగు లేదు. ఈ పరిస్థితి కొద్దిసంవత్సరాలు సాగితే పేరుకే తెలుగురాష్ట్రాలుంటాయి! పరిపాలనలో గానీ, పాఠశాలల్లో గానీ, న్యాయస్థానాల్లో గానీ తెలుగు పూర్తిగా అదృశ్యమయ్యే పరిస్థితి వుంది. ఈ పరిస్థితిని ముందుగానే అంచనావేసిన కొందరు మేధావులు, ఉద్యమకారులు పాతికేళ్ళ క్రితమే తెలుగునాట ఉద్యమాన్ని ప్రారంభించారు. కాలం గడిచేకొద్దీ పరిణామాలిలావున్నాయి. అయితే ఇంత జరుగుతున్నా యునెస్కో లెక్కల ప్రకారం తెలుగు అదృశ్యమయ్యే ప్రమాదం లేనట్టే ! ఎందుకంటే తెలుగు రాష్ట్రాలలోను, ఇతర రాష్ట్రాల్లోనూ, విదేశాల్లోనూ వున్న కోట్లాది తెలుగు ప్రజలు ఇంకా తెలుగు మాట్లాడుతున్నారు గనుక ! సాంస్కృతికరంగాల్లో ఇంకా వెలుగుతున్నారు గనుక ! తెలుగు సినిమాలూ, టీవీలూ దేశవిదేశాల్లో గొప్పగా ఆదరణ పొందుతున్నాయి గనుక ! వీటన్నిటికీ మించి ఆటపాటల్లో, పరిపాలనలో, పరిశోధనల్లో, సాంకేతికరంగాల్లో ప్రపంచంలో అన్నిచోట్లా తెలుగుయువత ముందడుగు వేస్తూ పేరు తెచ్చుకుంటున్నారు గనుక ! ఆ యువతలో చాలామందికీ వారి పిల్లలకూ తెలుగు రాయడం రాకపోయినా వారంతా తెలుగువారుగానే చలామణి అవుతున్నారు గనుక ! అయితే ఇదెంతకాలం సాగుతుంది? శాస్త్ర, సాహిత్య, కళారంగాలతో సహా మానవ జాతివికాసానికి చెందిన, సమస్త అభివృద్ధిలోనూ ముందుండి, ప్రపంచంలోని అతిపెద్ద భాషాజాతుల్లో ఒక్కటై అద్భుతమైన చరిత్రను, ప్రత్యేకతలను కలిగిన తెలుగుజాతి ఘనత అంతా, ఆ ప్రజలు తమ భాషను రాయలేని, చదువలేని స్థితికి చేరుకోవడమనే పతనానికి చేరుతున్నది. ఈ పతనంతో తెలుగుజాతిగా మన గుర్తింపును ఎన్నాళ్ళు కాపాడుకోగలుగుతాం? ఈ పతనాన్ని నివారించుకొని గొప్పభవిష్యత్తువైపు ప్రయాణించడం అనేది మన ముందున్న సవాలు.

తెలుగును కాపాడుకోవడం అంటే ఇతర భాషలను నేర్చుకోవద్దని కాదు. వలస బానిసత్వ బుద్ధి నుంచీ, భయాన్నుంచీ, ఆత్మన్యూనత నుంచీ బయటపడి మన మాతృభాషలో మనం పూర్తిగా వికసిస్తే, శక్తి యుక్తులను పెంచుకొంటూ అవసరమైన పరభాషలను కూడా- ఇప్పుడు ఆంగ్లం కావచ్చు, రేపు మరికొన్ని భాషలు కావచ్చు, ఎన్నైనా నేర్చుకోవచ్చు. నిజానికి స్వంత భాషపై పట్టు పెంచుకొంటే దాని ఊతంతో ఏ ఇతర భాషలపై నైనా ప్రావీణ్యత సాధించవచ్చు. భారత రాజ్యాంగమూ, అనేక అధ్యయనాలు చెప్పేదీ, ఐక్యరాజ్యసమితి/ యునెస్కో, ప్రపంచ మేధావులూ అందరూ చెప్పేదీ ఇదే. కేవలం ప్రజల అవసరాలను అడ్డుపెట్టుకొని వారిని పక్కదారి పట్టించే వెన్నులేని కొందరు ప్రభుత్వ నేతల రాజకీయాలకు జాతిని బలిపశువు చేస్తున్నారు. ప్రాథమిక దశలో మాతృభాషను తప్పనిసరి చేసి, ఆ బోధనను పటిష్టంగా చేస్తూ, అన్ని విధాలా ఆధునిక భాషగా దానిని ఎదిగించుకోవడం కోసం, సాంకేతికంగా కూడా వనరులను వినియోగించుకోవడానికి ఇప్పుడొచ్చిన లోటేమీ లేదు. వనరులూ, నిపుణులు, మేధావులూ మనకు అందుబాటులో ఉన్నా కేవలం తప్పుదారి పట్టి, ఓట్లకోసం అధికారం కోసం ప్రజల బలహీనతలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకొనే మన పాలక వర్గాల వల్లా, వారికి తాబేదారులైన కొందరు అధికారుల వల్లా, విద్యతో సహా వీలైన అన్ని కీలక రంగాలను శాసిస్తున్న వ్యాపార వర్గాల వల్లా తెలుగుజాతి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది. అందువల్లనే ఈ అంశాలన్నిటిపైనా అవగాహనతో బహుముఖ పోరాటానికి తెలుగు భాషోద్యమ సమాఖ్య సిద్ధమవుతున్నది.

ఇటీవలి కాలంలో మాతృభాషల రక్షణకై ప్రపంచంలోనూ- ముఖ్యంగా భారతదేశంలోని కొన్ని భాషాజాతుల్లోనూ ఆరాటం, ఆలోచన మొదలైంది. విశ్వవిద్యాలయాల స్థాయినుండి క్రింది వరకూ ఉద్యమాల ప్రభావం విస్తరిస్తున్నది. ఈ నేపథ్యంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య తన ఉద్యమంలో అన్ని స్థాయిల్లోని విద్యాసంస్థల ప్రాతినిధ్యంతో ఉద్యమ పథంలో సాగాలని నిర్ణయించుకొని ముందడుగు వేస్తున్నది.

---

–డాక్టర్ సామల రమేష్‌బాబు

తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు.

*నేడు విజయవాడలో జరుగనున్న తె.భా.సమాఖ్య సర్వసభ్య సమావేశం,*

రేపు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

(ఇందులో చాలాభాగం ఫిబ్రవరి 20న ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చింది)

అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ ప్రేమించలేడు..

# తీర్మానాల ప్రతిపాదనలకు ముందుగా తెలుగు భాషోద్యమ సమాఖ్య వ్యవస్థాపక సభ్యులు డా.మండలి బుద్ధప్రసాద్ ఇలా ప్రసంగించారు

తెలుగు మాధ్యమంలోనే ప్రాథమిక విద్య కొనసాగాల్సిందే అని ప్రభుత్వాలు ఆజ్ఞ జారీ చేస్తే ఎంతటి వారి కొడుకులైనా, మనుమలైనా కచ్చితంగా అదే మాధ్యమంలో చదివి తీరుతారని మాజీ మంత్రి, మాజీ శాసనసభ ఉప సభాపతి, డా.మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. అలా చేయడంలో ప్రభుత్వాలు ఎందుకో వెనకడుగు వేస్తున్నాయి? తెలుగు మాధ్యమం పేరుతో ఇంగ్లీషు భాషను పేదలకు దూరం చేస్తున్నామనే వారికి ఇది తన సూటి ప్రశ్న అని అన్నారు. ఫిబ్రవరి20న లొయొలా కళాశాలలో జరిగిన తెలుగు భాషోద్యమ సమాఖ్య సర్వ సభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రాథమిక విద్య కచ్చితంగా మాతృభాషలో ఉండాలని యునెస్కో సూచించిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన తమ సమాఖ్య కూడా దిగి వచ్చి ప్రాథమిక విద్య వరకైనా మాతృభాషలో బోధన చేయాలని కోరుతున్నామన్నారు. ఒక భాషగా తెలుగు నేర్పుతామనే వారు, ఒక భాషగా ఇంగ్లీషు నేర్పడం ఎందుకు చేతకాదని ప్రభుత్వాల నుద్దేశించి ఆయన ప్రశ్నించారు.



తెలుగు భాష పట్ల చిన్నచూపును చాలా ఏళ్ళ క్రితమే గమనించానని, తన పిల్లలే తెలుగు చదవడంలో విఫలమవుతుంటే ఆశ్చర్యం కలిగేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. తాను కూడా తెలుగు మాధ్యమంలోనే విద్యాభ్యాసం అంతా పూర్తిచేసి ఉన్నత స్థాయికి ఎదిగానని చెప్పారు. ఆ సమయంలో తెలుగు భాష పరిరక్షణ కోసం మాతృభాషా సమితి పేరిట శ్రమిస్తున్న సి ధర్మారావు వంటి వారితో కలిసి తెలుగు భాష ఉద్ధరణకు ఉమ్మడి వేదిక అవసరాన్ని వివరించి, తెలుగు భాషోద్ధరణకే కట్టుబడి ఉన్న నడుస్తున్న చరిత్ర పత్రిక సంపాదకునితో కలిసి తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏర్పాటు చేసిన నాటి రోజులను సభికుల ముందుంచారు. తాను, సామల రమేష్‌బాబు సమావేశకర్తలుగా శ్రీకాకుళంలో నడిపిన రెండు రోజుల శిబిరం సంగతిని ఈ సందర్భంగా సభికులకు గుర్తుచేశారు. అదే వేదిక పైకి తెలుగు భాషోద్యమ కార్యకర్తలందరినీ ఒక తాటి పైకి తేవడంలో కృతకృత్యులమయ్యామన్నారు.

అదే సమయంలో రెండు కార్యక్రమాలు జరిగాయని, హైదరాబాద్‌లో నెలకొల్పిన తెలుగు తల్లి విగ్రహం శిలాఫలకాన్ని ఆంగ్లంలో 'టెలుగూ టల్లీ' అని ఉండటాన్ని నిరసించామని, అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ ముందర శిలాఫలకంలో అంతా ఆంగ్లంలో రాసి 'ఆంధ్రప్రదేశ్ శాసనసభ' అని చిన్న అక్షరాలతో సరిపెట్టడాన్ని నిరసిస్తూ అందోళన చేపడితే ధర్మారావుగారు, తదితర పెద్దలందరితో పాటు అలా భాషోద్యమ సమాఖ్య సాధించిన విజయాలను సభ ముందుంచారు బుద్ధప్రసాద్.

1 వ తరగతి నుండి 10 వ తరగతి వరకూ తెలుగు మాధ్యమం అమలు చేయాలని అనధికార తీర్మానాన్ని తాను శసనసభలో ప్రవేశపెట్టానన్నారు. తన తీర్మానాన్ని ఉపసంహరిస్తే ఒక భాషగా తెలుగును తప్పనిసరి చేసేందుకు జి.వో. ఇస్తామన్నారు. అందువల్ల తాను తీర్మానాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. తర్వాత ప్రభుత్వం జి.ఒ. ఇచ్చిందిగానీ ఆ జి.ఒ. ప్రభుత్వ పాఠశాలలో కొంతమేరకు అమలైనా, ప్రైవేట్ విద్యాలయాల్లో అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు , కొన్ని సంస్థలు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోవడం వెనుక తెలుగు భాషోద్యమ సమాఖ్య కృషి సమున్నతమని, 2002 లో సమాఖ్య స్థాపన అనంతరం భారీ స్థాయిలో హైదరాబాద్ లలిత కళాతోరణంలో భారీ సభ మొట్టమొదటి సారి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో తమ సమాఖ్యే నిర్వహించిడం గర్వకారణమన్నారు. ఇప్పుడు తెలుగు భాష సంక్షోభంలో ఉన్న సమయంలో సమాఖ్యను మరింత శక్తిమంతం చెయ్యాలని నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరిగింది. కానీ ఇంతవరకు అధ్యక్షుడుగా ఉన్న రమేష్‌బాబు గౌరవ అధ్యక్షునిగా కొనసాగాలని కోరుతున్నానన్నారు. 2002 నాటి తీర్మానాలు కాలానికి నిలబడేవే! కానీ నేటి పరిస్థితులకు అనుగుణంగా మార్చాల్సిన ఆవసరం మాత్రం ఉందని, అందుకే తాజా తీర్మానాలతో ఉద్యమానికి ఊపిరులూదాలంటున్నట్లు ఆయన చెప్పారు.

ప్రముఖ తెలుగు ఎన్నారై, శాస్త్రవేత్త ఎల్లాప్రగడ సుబ్బారావు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వారి మాతృభాషా మాధ్యమంలో చదివారన్నారు. అలా చదవడం వల్ల క్షిపణుల తయారీకి అడ్డంకి కాలేదని అబ్దుల్ కలాం చెబుతుండేవారన్నారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వి రమణ తెలుగు మాధ్యమం గురించి తరచూ వేదికలపై చర్చ లేవనెత్తుతూ తెలుగు భాషోద్యమానికి పరోక్షంగా ఊతమిస్తున్నారన్నారు. అది తమ కార్యకర్తలకు ఎంతో ఉత్సాహాన్నిస్తోందని అన్నారు. ఈసారి యునిస్కో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో సాంకేతికతకు పెద్దపీట వేయాలని సూచించింది కనుక విద్యావిధానంలో సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. అంతర్జాలాన్ని వినియోగించుకుని తెలుగుని అంతర్జాతీయ భాషగా వినియోగించుకోవలసి ఉంది. ఇప్పుడు ఎన్నికైన అధ్యక్షులు గారపాటి ఉమామహేశ్వరరావు అందులో అనేక ఉపకరణాలను అందుబాటులోకి తెచ్చిన ప్రతిభావంతులని సభకు తెలియజేశారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు సాంకేతిక ఉపకరణాలు అందుబాటులోకి తెచ్చి తెలుగు విజయం అనే వెబ్ సైట్ లో ఉంచామన్నారు. అయితే రెండు రాష్ట్రాలు వాటిని విసిరిపారేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ ఎన్.వి.రమణ ఏపి హైకోర్టులో పనిచేస్తున్నప్పుడు వారు జూడిషియల్ అకాడమి అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారని, తాను అధికారభాషా సంఘం అధ్యక్షుడుగా ఉన్నానని, ఆ సమయంలో న్యాయపాలనలో తెలుగు తేవాలని, ముఖ్యమంత్రి, హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తితో కూడా సమావేశాలు నిర్వహించామన్నారు. ఆ సమయంలో 50 నుంచి 60 తీర్పులు తెలుగులో వచ్చాయని తెలిపారు. కొన్ని ఉపకరణాలు లేకపోవడం వల్ల హైకోర్టులో తీర్పులు తెలుగులో కష్టమని కోర్టు తెలిపిన నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఉపకరణాలను అందించిందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం అది ఎక్కడివేసిన గొంగళిగానే ఉందన్నారు. కనుక సాంకేతికతాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.



### తీర్మానం : 1

## అధికార భాషగా తెలుగును అన్ని రంగాల్లో అమలు చెయ్యాలి

1966లోని 9వ చట్టం ప్రకారం తెలుగును అన్ని పాలనా వ్యవహారాల్లో పూర్తిగా అమలు చెయ్యాలి. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఎన్నో సార్లు ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆ తరువాత ప్రభుత్వాలు జీవోలను, ఇతర అదేశాలను ఎన్నోసార్లు ఇవ్వడం జరిగింది. అయినా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఈ విషయంలో వ్యవహరించడంలేదు. ఎప్పటికప్పుడు దాటవేత ధోరణిలోనే నేతలు, అధికారులు, వ్యవహరిస్తున్నారు. పాలక పార్టీలలో, నేతలలో రాజకీయ సంకల్పం లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. భాషారాష్ట్రాల ఏర్పాటునూ, ప్రజాస్వామ్య మౌలిక లక్ష్యాలనూ దెబ్బతీసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ప్రజల భాషలో మాట్లాడుతూనే పరాయి భాషలో పరిపాలించడం ద్వారా వీరు ప్రజలను మోసం చేస్తున్నారనీ ఇకనైనా ఈ ధోరణిని మార్చుకొని పూర్తిగా పాలనను అధికార భాషా చట్టం ప్రకారం ప్రజల భాషల్లోకి తేవాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రభుత్వాలను హెచ్చరిస్తూ తీర్మానిస్తున్నది. ఈ విషయమై అన్ని ప్రజాసంఘాలు ఉద్యమించాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరుతున్నది.

**- ప్రతిపాదన : పులికొండ సుబ్బాచారి**

ఈ ప్రతిపాదనను శ్రీ గంధం సుబ్బారావు ప్రతిపాదించ వలసి ఉంది. అయితే ఆయన కరోనా కారణంగా సభలో పాల్గొన జాలనందున –ఆచార్య పులికొండ సుబ్బాచారి ఈ తీర్మానాన్ని ప్రతిపాదించి ఇలా ప్రసంగించారు.

## ఆచార్య పులికొండ సుబ్బాచారి ప్రసంగం

**ఉ**మ్మడి తెలుగు వారందరికీ కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి. దాదాపు ఇప్పటికి 70 సంవత్సరాలకు పైగా తెలుగు వాళ్ళు ఒక రాష్ట్రము కింద స్వతంత్ర దేశంలో ఉన్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత "అధికార భాషగా తెలుగుని అమలు చేయండి" అని ఇలా ఒక సభ పెట్టడం తెలుగు వారంతా సిగ్గు పడాల్సిన విషయం. మనకు స్వతంత్రం వచ్చిందా? రాలేదా? అనే అనుమానం అప్పుడప్పుడు కలుగుతుంటుంది. ఒక స్వతంత్ర దేశంలో ఒక పౌరుడు తన ఇంటి పక్కన ఉన్నటువంటి ప్రభుత్వ కార్యాలయానికి పోయి తనకు కావాల్సిన పనులన్నీ కూడా తన భాషలో చేసుకోగలగాలి. ఆ పని ఈ రోజుకు కూడా చేసుకోలేకపోతున్నాం. ఎందుకంటే చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు లేదు. కాబట్టి భాష దృష్ట్యా చూసుకుంటే మనకు ఇంకా స్వతంత్రం అనేది రాలేదు. అందుకు మనమంతా సిగ్గుపడాలి. "అధికార భాషగా అన్ని స్థాయిల్లో తెలుగు ఉండాలి" అనే ఈ తీర్మానంతో మిగతా ఇంకొన్ని విషయాలు కూడా ముడిపడి ఉన్నాయి. అధికార భాషగా పూర్తిగా తెలుగు అమలులో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులంతా కూడా తెలుగులోనే పని చేయాల్సివస్తుంది. దానికి వాళ్లంతా తెలుగులో చదువుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది. అధికార భాషగా తెలుగును అమలు చేయడానికి తెలుగు మాధ్యమంలో చదువు చెప్పడానికి విడదీయరాని సంబంధం ఉంది. కానీ ఆ విడదీయరాని సంబంధాన్ని ప్రభుత్వం గుర్తించట్లేదు అని సుబ్బాచారి వ్యాఖ్యానించారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఇంకో సమస్య ఏంటంటే ప్రైవేట్ రంగంలో ఉన్న విద్యావ్యాపారులు 'ఇంగ్లీష్‌లో చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయి'అనే ఒక వ్యాపార సూత్రాన్ని తీసుకొచ్చారు. ఈ దౌర్భాగ్య పరిస్థితి 1970 వ దశకం తర్వాత బాగా గట్టిపడింది. ఆ సమయంలో ఇంటర్, డిగ్రీ తెలుగు మాధ్యమంలోనే ఉండేవి. ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు స్నాతకోత్తర విద్య వరకు సబ్జెక్ట్స్‌ని తెలుగులో తయారుచేశారు. ఆ టెక్స్ట్ పుస్తకాలు ఇంకా తెలుగు అకాడమీ వారి దగ్గరున్నాయి. ఇంత జరిగినా తర్వాత మనం నిన్నటి వరకు తెలుగు కాస్త వెలుగుగా ఉందనుకున్నప్పటికీ, తెలంగాణాలో ఇప్పుడు ప్రాథమిక విద్య మొత్తాన్ని ఇంగ్లీష్ మీడియంలో చెప్పేస్తారనే ప్రకటన చేసింది ప్రభుత్వం. సరిగ్గా ఈ పరిస్థితిలో మనం ఎక్కడ ఉన్నాం అంటే స్క్వేర్ వన్ దగ్గర ఉన్నాం. వైకుంఠపాళిలో ఎక్కడ మొదలు పెట్టామో అక్కడికే వచ్చాము. 75 ఏళ్ళ స్వతంత్ర దేశంలో తెలుగును అధికార భాషగా చేయమని మనం చెప్పుకుంటున్నామంటే ఇది ఎవరి లోపం, ఎవరి పాపం. ఎంతో మంది నిన్న మొన్నటి వరకు కూడా ఈ అంశంపై చాలా పని చేశారు. చాలా ప్రయత్నం చేశారు. తెలుగును ఎందుకు అధికార భాషగా చెయ్యట్లేదు.. అసలు మనం ఎక్కడున్నాం. ఇలాంటి పరిస్థితి ఏ ఇతర రాష్ట్రంలోనూ లేదు అని సుబ్బాచారి అన్నారు. కర్నాటక యూనివర్సిటీకి వెళ్ళినప్పుడు అక్కడ స్నాతకోత్తర విద్య అనేది కన్నడలో చెప్పే అవకాశం ఉంది. ఒకవేళ ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నా కూడా కన్నడ మీడియంలో పరీక్ష రాసుకునే అవకాశం ఉన్నది. తమిళనాడు, కేరళలో చేసినట్టుగా ఇక్కడ మనం ఎందుకు చేయలేకపోతున్నాం. తెలుగు జాతిలో ఉన్న లోపంఏమిటి ? అని ఆయన ప్రశ్నించారు. మన ముఖ్యమంత్రులు చాలా తెలివైనవారే వున్నారు. వాళ్ళు మాట్లాడుతుంటే తెలుగు చాలా అద్భుతంగా ఉంటుంది. కెసిఆర్ కానీ, జగన్ కానీ ప్రజలకు అవసరమైన భాషతోనే వాళ్ళ మధ్యకు వెళ్లగలుగుతున్నారు. అనర్గళంగా మాట్లాడగలుగుతున్నారు. ''జనం నుంచి ఓట్లు కావాలి అనుకున్నప్పుడు జనం భాషలో మాట్లాడుతున్నారే. జనానికి కావాల్సిన పరిపాలనను మాత్రం జనం భాషలో ఎందుకు అందించలేకపోతున్నారు ? అని ఆయన ప్రశ్నించారు. 1966 లోని 9 వ చట్టం ప్రకారం తెలుగును అన్ని పరిపాలన వ్యవహారాల్లో పూర్తిగా అమలు చేయాలి. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆ తర్వాత దీనికి సంబంధించి ఎన్నో ఆదేశాలు కూడా ఇచ్చారు. ప్రభుత్వాలు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. అధికారులు, నేతలు ఈ విషయంలో దాటవేత ధోరణినే అనుసరిస్తున్నారు. వారిలో రాజకీయ

సంకల్పం లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. భాషా రాష్ట్రాల ఏర్పాటును ప్రజాస్వామ్య, మౌలిక లక్ష్యాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ప్రజల బాష మాట్లాడుతూనే పరాయి భాషలో పరిపాలించడం ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ ధోరణిని మార్చుకుని అధికార భాషా చట్టం ప్రకారం పాలనను ప్రజల భాషలోకి తేవాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రభుత్వాలను హెచ్చరిస్తూ తీర్మానిస్తోంది. ఈ విషయమై అన్ని ప్రజాసంఘాలు కూడా ఉద్యమించాలని కోరుతోంది.

తెలుగును అధికార భాషగా చేయకపోవడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. వ్యాపార రంగం, రాజకీయ రంగం , మూడు ఇటీవలే వచ్చిన మతపరమైన ఒక కోణం . ఇంతకుముందు జిల్లా పరిషత్ పాఠశాలలు చాలా గొప్పగా పనిచేసేవి. తొలితరం లో ఉన్న ప్రముఖులంతా కూడా ఎస్సెస్సెల్సి వరకు తెలుగు మాధ్యమంలోనే చదువుకున్నారు. నేను ఎం. ఏ వరకు తెలుగు మీడియంలోనే చదువుకున్నాను. ఇంగ్లీష్ కూడా నేర్చుకున్నాను. ఎంత అంటే అమెరికా పిల్లలకు కూడా ఇంగ్లీష్ లో పాఠాలు చెప్పేంత నేర్చుకున్నాను. ఇలా చెప్పేవాళ్ళు చాలా మంది వున్నారు. ఐతే పరిస్థితి ఎలా ఉంది అంటే ప్రాథమిక పాఠశాల విద్య వరకైనా తెలుగులో చెప్పండి అనే దాని కంటే కనీసం 5 వ తరగతి వరకైనా తెలుగులో చెప్పండి అనే పరిస్థితికి దిగజారింది అని ఆయన అన్నారు. 'ఇంగ్లీష్ లో చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయి' అనే సూత్రం వలన పాఠశాల విద్య మొత్తం కూడా ఇంగ్లీష్ లోకి వచ్చింది. దీనికి ఇంకో కారణం ఏంటంటే అధికార భాష అనేది లేకపోవడం. ఏపీ ఉద్యోగులంతా కొన్ని రోజుల కిందట సమ్మె చేశారు. ఏపీ లో 13 లక్షల మంది, తెలంగాణ లో 10 లక్షల మంది ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. తెలుగు వాళ్ళ కోసం పని చేయాలి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు 'తెలుగులో చదువుకున్న వాళ్ళకే ఉద్యోగాలు ఇస్తాం' అని ప్రకటన చేస్తే ఇక్కడి వాళ్లంతా తెలుగులోనే చదువుకుంటాడు. ఇతర రాష్ట్రాలకు దేశాలకు వెళ్ళేవాళ్ళు చాలా తక్కువ మంది వుంటారు. అలా అని ఇంగ్లీష్ ప్రాధాన్యాన్ని తగ్గించమని చెప్పడం ఉద్దేశం కాదు. ప్రభుత్వం ఉద్యోగ ప్రకటన ఇచ్చేటప్పుడు ప్రజలకు కావాల్సిన భాషలో పని చేయాల్సి ఉంటుందని చెప్పాలి. అప్పుడు ఏ కోర్ట్ కూడా ఏమి చేయలేదు. నిజామాబాద్ లో మాత్రం 95 శాతం తెలుగును అమలు చేసారు. అన్నింటికంటే తక్కువగా చిత్తూరు జిల్లాలో 12 శాతం అమలయ్యింది. అన్నిటికంటే తక్కువగా సెక్రటేరియట్ లో 3 శాతం మాత్రమే అమలు జరిగింది. ఆంగ్ల మానసపుత్రులు ఐఏఎస్ అధికారులే దీనికి ప్రధాన కారణం. వాళ్లకు ఫైల్ నోట్ రాయడం రాదు. తెలుగులో రాయించుకోవాలంటే చికాకు నేర్చుకోరు. ఎవరైనా తెలుగులో రాస్తే ఇంగ్లీష్ లో రాయమని చెప్పే అధికార గణమే ఇక్కడ ఎక్కువ. తెలుగును అధికార భాషగా చేయడానికి అడ్డుపడేవాళ్ళల్లో వీళ్ళే మొదటి స్థానంలో ఉంటారు. హిందీ మాట్లాడే వారి సంఖ్య పెరుగుతూ వెళ్తే తెలుగు మాట్లాడే వారి సంఖ్య తగ్గుతూ వచ్చింది. కేంద్రం హిందీని అధికార భాషగా చేయడానికి ఎన్నో నిఘంటువులు తయారు చేసింది. ఎన్నో ప్రయత్నాలు చేసింది. హిందీ ఆఫీసర్లను నియమించింది. కానీ తెలుగు కి సంబంధించి ఇంతవరకు వీటిల్లో ఏదీ అమలు జరగలేదు. ఒక్క తెలుగు ఆఫీసర్ ని నియమించుకోలేక పోయాం. ఉన్నత చదువులు హిందీ మీడియంలో చదువుకోవడానికి అవసరమైన పదకోశాలన్నీ కూడా వాళ్ళు ముందుగానే తయారు చేసి పెట్టుకున్నారు. భాష సంఘాలు, సమాఖ్యలు వ్యక్తిగతం గా కానీ, సంస్థల రూపంలో కానీ చేస్తూ ఉంటే వచ్చే ప్రయోజనం చాలా ముఖ్యం. తెలుగులో పాలన అనేది లేకపోతే ఓట్లు రావు అనే స్థితి వస్తే తప్ప, నేతల్లో ప్రజా ప్రతినిధుల్లో, ప్రభుత్వాల్లో చలనం అనేది రాదు. తెలుగు మాట్లాడే వారంతా ఒక రాజకీయ పార్టీ పెట్టైనా సరే లేదా నిరసనగా ప్రతి ఎమ్మెల్యే సీటుకు ఇద్దరు ముగ్గురు లేదా ఇరవై ముప్పై మంది పోటీ చేసి ప్రభుత్వాన్ని చికాకు పెట్టి "మీరు తెలుగులో పాలన చేయడం లేదు కాబట్టి మేం ఇలా నిరసన తెలుపుతున్నాం" అని చెప్పగలిగితే తెలుగును అమలు చేయకపోతే ఇలాంటి సమస్య వస్తుంది అనే విషయం అర్థమయ్యి నేతల్లో వేడి పుట్టి తెలుగులోనే పాలనా చేయడానికి ఇదొక మార్గంగా ఉపయోగపడుతుందని వాడి వేడిగా ప్రసంగించారు. తన తీర్మానాన్ని ఆమోదించాల్సిందిగా ఆయన చేసిన విన్నపాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



### తీర్మానం : 2

## తెలుగు మాధ్యమంలో చదివినవారికి ప్రభుత్వ ఉద్యోగాలలో 20% కేటాయింపు ఉండాలి

తెలుగు మాధ్యమంలో చదివిన వారికి రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రభుత్వ ఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను కోరుతూ తీర్మానిస్తున్నది. మన పొరుగునే ఉన్న తమిళనాడులో ప్రభుత్వ జీవో ఎమ్.ఎస్.నెం. 145 పి& ఏ.ఆర్.(ఎస్) డిపార్టుమెంట్ తేది 30-09-2010, ద్వారా తమిళమీడియంలో డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులకు రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాలలో 20% రిజర్వేషన్లు ఇస్తున్నారు. చెన్నై హైకోర్టు కూడా 23-02-2016న ఈ చట్టాన్ని సమర్థించింది. తమిళ మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు 20% ఉద్యోగాలు రిజర్వు చేయడంలో ఎలాంటి తప్పులేదని ప్రకటించింది. రాజ్యాంగంలోని 345 అధికరణం ప్రకారం ఎవరి భాషను వారు కాపాడుకోవాలని, ఆయా రాష్ట్రాలలో పాలనా భాషగా అధికార భాషగా అభివృద్ధి చేసుకోవాలని కూడా తెలియజేసింది. మన రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ కూడా ఈ విషయంలో చొరవ తీసుకొని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా ఇటువంటి ఉత్తర్వులను ఇవ్వాలని ఈ సమావేశం ప్రభుద్వాన్ని కోరుతూ తీర్మానిస్తున్నది.

– **ప్రతిపాదన :రెహ్మతుల్లా నూర్‌బాషా** విశ్రాంత ప్రభుత్వ అధికారి

ఆయన రాలేనందున సభాధ్యక్షుడు డా. సామల రమేష్‌బాబు ఈ తీర్మానాన్ని సభముందు పెట్టి వివరించారు. సమగ్రంగా చర్చించిన తదుపరి సభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది

## తీర్మానం : 3
# న్యాయస్థానాల్లో తెలుగు అమలు



అ. అవిభక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1974లో జారీచేసిన 485 జి.ఓ.ను పూర్తిగా రద్దుచేసి దిగువస్థాయి క్రిమినల్ న్యాయస్థానాల భాషగా తెలుగును ప్రకటిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉత్తర్వులు వెలువరించాలని కోరుతూ తీర్మానించడమైనది.

ఆ. దిగువస్థాయి సివిల్ న్యాయస్థానాలలో తెలుగులో కార్యకలాపాలు జరిగే విధంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 137ను సవరించవలసినదిగా రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలను కోరుతూ తీర్మానించడమైనది.

ఇ. న్యాయశాస్త్ర విద్యాబోధన తెలుగుభాషలో జరిగేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాల్సిందిగా బార్ కౌన్సిల్ మరియు రెండు రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానించడమైనది.

ఈ. ప్రజాస్వామ్యంలో ఉండే శాసన, న్యాయ, పరిపాలనావ్యవస్థలు మూడింటిలోను తెలుగుభాష అమలు జరగాలి. మిగతా రెండింటిలో మార్పు రాకుండా కేవలం న్యాయవ్యవస్థలో రావాలనుకోవడం సరికాదు. కనుక ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చూపుసారించి, న్యాయవ్యవస్థలో తెలుగు అమలుకు శాసనపరమైన తగుచర్యలను – పైన పేర్కొన్న 1, 2, 3 తీర్మానాలలో పేర్కొన్న చర్యలను గైకొనాలని కోరుతూ తీర్మానించడమైనది. -

**ప్రతిపాదన : చిమ్మె జాన్ బర్నబాస్**
అడ్వకేట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు

# చిమ్మె జాన్ బర్నబాస్ ప్రసంగం

**తె**లుగు భాషోద్యమ సమాఖ్య సభ్యులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది, చిమ్మె జాన్ బర్నబాస్ “న్యాయ వ్యవస్థలో తెలుగు అమలు చేయాలని– దానికి తగ్గ కృషిని సమాఖ్య చేపట్టాలని కోరుతూ 4 అంశాలుగల తీర్మాన పత్రాన్ని ప్రతిపాదించారు. ఆయన ఇలా ప్రసంగించారు.

మామూలుగా కార్య నిర్వహణ వ్యవస్థ, శాసన నిర్మాణ వ్యవస్థ గురించి ఎంతో కొంత అందరికీ తెలిసే ఉంటుంది. కానీ న్యాయ వ్యవస్థ గురించి తెలియదు. న్యాయవ్యవస్థకి సంబంధించిన ప్రతి సమాచారం ప్రస్తుతం వెబ్సైట్లో మొత్తం ఆంగ్లంలోనే ఉంటుంది. ఉదయం లేచిన దగ్గర నుంచి న్యాయ వ్యవస్థకు సంబంధించి హైకోర్టు న్యాయమూర్తులతో పాటు అందరూ ఇంగ్లీష్‌లోనే మాట్లాడుతున్నారు. బట్టు దేవానంద్, విశ్వసాయి వంటి న్యాయమూర్తులు తప్ప తెలుగులో ఎక్కువ ఎవరూ సంభాషించడం లేదు. తెలుగు భాష రాకపోవడమే దీనికి కారణం అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ అధ్యక్షులుగా గౌతమ్ సవాంగ్‌ని నియమించారు. ఆయన మాజీ డీజీపీ. తెలుగువారు కాదు. వేరే భాష మాతృభాషగా కలిగిన వారిని నియమించుకునే దుస్థితికి తెలుగువారం వచ్చాము. ఉదాహరణకు వివిధ కళల్లో ఆరితేరిన వారి నుండి ఒకరిని ఎంచుకుని రాజ్యసభలో సభ్యత్వం ఇవ్వవలసి ఉంటుంది. కానీ ప్రస్తుతం అంబానీ అనుచరుడికి పరిమల్ నత్వకి సభ్యత్వం కల్పించారు. ఆయన తెలుగువారు కారు. ఇక్కడ నుంచి మొదలైన ఈ పద్ధతి తొందరగా మారదు. అది ఒక్క న్యాయ వ్యవస్థకు మాత్రమే పట్టిన దుస్థితి కాదు అని జాన్ వాపోయారు. గత వారంలో జరిగిన ఆరుగురు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారంలో ఒకరు మా ఊరికి చెందినవారు, కొనగంటి శ్రీనివాస్ రెడ్డి. ఆయన తెలుగులో మాట్లాడ్డం అరుదు. కనుక న్యాయమూర్తులను కులం, ఆస్తి, నేపథ్య ప్రాతిపదికన నియమించుకున్నంత కాలం సుప్రీంకోర్టులో ‘కొల్లీజియం’ వ్యవస్థ, పేరుకు మాత్రమే ఉంటుంది.

జస్టిస్ ఎన్ వి రమణ గారు రెండో సారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాక కానీ... ఆరుగురు న్యాయమూర్తుల నియామకం జరగలేదు. ఇలాంటి పరిస్థితిలో న్యాయవ్యవస్థ ఎలా మారుతుంది? అని ప్రశ్నించారు. ఉదాహరణకు కాపీ అప్లికేషన్ అనే పదాన్ని తెలుగులో ‘నకలు కొరకు దరఖాస్తు’ అంటారు విజయవాడ స్థానిక కోర్టులో కూడా ఈ పదాన్ని పబ్లిక్ ప్రాసిక్యూషన్‌లో కానీ ఎక్కడా వాడడం లేదు ఇంగ్లీష్‌లో మాట్లాడినపుడే దానికి విలువ వస్తుంది. పెళ్లిళ్లలో, పబ్లిక్ మీట్‌లో సైతం ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్ళకి ప్రాధాన్యత ఇస్తున్న పరిస్థితి సమాజంలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని తల్లిదండ్రులు ఒత్తిడి తెస్తున్నారని ఆయన అన్నారు.

అధికార భాషా సంఘం అధ్యక్షులు ఏ ఏ శాఖలలో తెలుగు వాడకం ఏ స్థాయిలో ఉంది అనేది కూలంకషంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. అందుకు వారు పూర్తి అధికారం కలిగి ఉన్నారని జాన్ అభిప్రాయపడ్డారు.

ఐఏఎస్ అధికారులు, మినిస్టర్లు.. కింది వారిని కలవమని చెప్పడానికి బదులు స్పీక్ అనే మాటను రాస్తుంటారు దాని బదులు తెలుగులో సమానార్థం వాడొచ్చు రండి మాట్లాడండి అనే పదాల్ని. ప్రస్తుతం ఇంగ్లీష్ పదాలు కూడా షార్ట్ కట్ మొదలుపెట్టారు ఒక్కొక్క అక్షరాన్ని వాడుతున్నారు.. మార్పు అనేది కింది స్థాయి నుంచి

జరగాలి పరిపాలన స్థాయి, కార్యనిర్వహణ స్థాయి, శాసన నిర్మాణ స్థాయిలో మార్పు రాకుండా న్యాయ వ్యవస్థలో మార్పు రావాలని ఆశించడం అనేది భ్రమ. కనుక అన్ని వైపుల నుంచి తెలుగు వాడకం ద్వారా న్యాయ వ్యవస్థలో కూడా తెలుగు వాడకానికి సమాఖ్య కృషి చేయాలని తన ప్రతిపాదనలు ఆమోదానికై సభ ముందుంచుతున్నట్లు జాన్ తెలిపారు. సభ ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదించింది.

తెలుగు భాషోద్యమ సమాఖ్య 2018 ఫిబ్రవరి 18న (అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం 21వ తేదీ సందర్భంగా) న్యాయస్థానాలలో తెలుగు వినియోగం కోసం ఉద్యమ సమాలోచన సదస్సును విజయవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఉమ్మడిరాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు, విశ్రాంత జిల్లా న్యాయాధికారి శ్రీ మంగారి రాజేందర్, కృష్ణాజిల్లా న్యాయాధికారి శ్రీ వై.లక్ష్మణరావులతోపాటు బార్ అసోసియేషన్ ప్రముఖులు వక్తలుగా పాల్గొన్న ఈ సభ కొన్ని తీర్మానాలను ఆమోదించింది. వాటి ప్రాతిపదికన నేను ఈ సభ ఆమోదం కోసం నాలుగు తీర్మానాలను మీముందుంచుతున్నాను.

**తీర్మానం : 4**

## ప్రాథమిక విద్య అమ్మనుడిలోనే ఉండాలి



ప్రతి సమాజం తనకు కావలసిన శాస్త్రజ్ఞానాలను సృష్టించుకుంటుంది. విద్య మనిషికి రెండు విధాలైన కౌశలాలను అందిస్తుంది. అందులో మొదటిది,

తోటి వాళ్లతో ఆమోదయోగ్యమైన సహజీవనం చేసేందుకు వీలు కలిగించే ఆలోచనలకు ప్రోది చేసేదిగానూ, రెండవది తనకి, తన కుటుంబ సభ్యులకు జీవితాన్ని అందించేదిగానూ ఉండాలి.

ఈ రెండు లక్షణాలలో ఏది పోగొట్టుకున్నా, భాష ప్రజల భాష కానేరదు. జీవ భాషగా మనలేదు. భారత రాజ్యాంగంలో 350ఎ అధికరణలో ప్రతి రాష్ట్రం, అధికార యంత్రాంగం భాషా అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన పిల్లలకు ప్రాథమిక విద్య బోధన కోసం తగిన సౌకర్యాలని అందించడానికి ప్రయత్నించాలి. తద్వారా మాతృభాష మాధ్యమం ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తోంది. కోట్ల మంది తెలుగువారికి సేవ మరియు వస్తు సౌకర్యాలు అందించడానికి అవకాశం దొరుకుతుంది. దీనికి మాతృభాషలో చదువు తప్పనిసరి. ఈ అవసరాలను గుర్తించి, అమ్మనుడి అవసరాన్ని సమర్థిస్తూ తెలుగు భాషోద్యమ సమాఖ్య తరఫున సభ్యులందరూ తీర్మానాన్ని బలపరుస్తారని ఆశిస్తు ప్రతిపాదిస్తున్నాను."

**– ప్రతిపాదన : గారపాటి ఉమామహేశ్వరరావు**

ప్రభుత్వ ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో కూడా ప్రాథమిక విద్య మాతృభాషలో అమలు చేసే విధంగా చట్టం చేయాలి అన్న సూచన సభికుల నుంచి అందింది. దీనిని కూడా ఆమోదిస్తూన్నట్లు ప్రతిపాదకుడు ప్రకటించారు. ఆయన ప్రసంగంపై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ సభ తీర్మానించింది

## ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ప్రసంగం

"తెలుగు వారం బానిస పాలనలో ఉంటున్నాము. మనకు చేత గాక, చేవ లేక, చేష్టలుడిగి బ్రతుకుని ఈడుస్తున్నాం. ఎలాగో బతుకుతాం అనుకొనే పద్ధతిలోకెళ్ళిపోతున్నాం" అని ఆందోళన వ్యక్తం చేశారు తెలుగు భాషోద్యమ సమాఖ్య నూతన అధ్యక్షులు డా. గారపాటి ఉమామహేశ్వరరావు. 'ప్రాథమిక విద్య అమ్మనుడిలోనే ఉండాలని, ఉమామహేశ్వరరావు తన తీర్మానాన్ని ప్రతిపాదించారు. అనంతరం ఆయన తన తీర్మానానికి ఆధారంగా సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు వారి కష్టాన్ని దూరం చేసుకోవడానికి కొన్ని ప్రతిపాదనలు సూచించేందుకు ఈరోజు ఇక్కడ సర్వ సభ్య సమావేశాన్ని మనం జరుపుకుటున్నాం. అందరికీ తెలుసు అందరికీ మాతృభాష ఉండాలి. ఇది ప్రజా ప్రభుత్వం. ప్రజా ప్రభుత్వం ప్రజల పాలనలో సాగాలి. ఒకేలా అలా సాగకపోతే ఏం చేయాలి ఎందుకసలు సాగటం లేదు? అనేది ఆలోచించాల్సిన విషయం. ప్రతి ఒక్కరికీ అన్ని అవయవాలు ఉన్నాయి. కాళ్లు, చేతులు, తల, ముక్కు, నోరు, కళ్లు అన్నీ ఉన్నాయి. అన్ని జ్ఞానేంద్రియాలూ ఉన్నాయి. వాటన్నిటినీ జాగ్రత్తగా కాపాడుకుంటాం. ఎందుకంటే, అవి శరీరంలో ఒక భాగం. ఏది పోయినా మనకి నష్టమే! ఎందుకంటే ఇవి మనతో పుట్టినవి. భాష కూడా అంతే! తరతరాల నుంచి వేలాది సంవత్సరాలుగా భాష మనతో తయారైంది. మనం సృష్టించలేదు. ఇక్కడ కూర్చున్న వాళ్లలో ఎవరూ దానిని సృష్టించలేదు. లేకపోతే ఎవరి తాతలో తెలుగును సృష్టించలేదు. కానీ వేల సంవత్సరాల నుంచి తరతరాలుగా మన జాతితో పాటు మన తెలుగు తయారైంది.

అలాంటి తెలుగుని ఇన్ని కోట్ల మంది మాట్లాడుతున్న తెలుగును రోజులో ఒక్క జి ఓ తో దూరం పెట్టలేము. ఒక వేళ అలా పెడుతున్నామంటే ఎలాంటి సమయంలో పెడతాము? బయట వాళ్లు వచ్చి మన మీద దాడి చేసి మన వాళ్లను పాదాక్రాంతం చేసి ఈ నేలపై వారిని "నా భాషనే నువ్వు వాడు. నేను మీకు అధినాయకుణ్ణి ఇక మీరందరు నాకు బానిసలు, నీ భాష ఈరోజునుంచి వాడటానికి ఒప్పుకోము కుదరదు" అని చెప్పి అధికార భాషగా పర భాషని అందరు వాడుతూ ఉంటే, దాన్ని చూసి దాన్ని ఒప్పుకొని ముందుకెళుతుంటే దానర్థం ఏంటంటే ఇక్కడి వారందరి బ్రతుకు బానిస పాలైంది. తెలుగు రాష్ట్రాల్లో సుమారు పన్నెండు కోట్లమందున్న తెలుగుకు పనికి రాకుండా ఎట్లైపోతుంది?. అసలు ఎవరి కోసం, దేనికోసం ఇదంతా? ఇంత పెద్ద సమాజంలో, కోట్ల మంది మాట్లాడే సమాజంలో, వారి భాష పనికిరానిదెట్లయిపోతుంది? అసలిది అర్థం కాని సమస్య. ఇన్ని కోట్ల మంది మాట్లాడే భాష ఇవాళ పనికి రాకుండా ఎట్లా తయారైంది ? దానికి కారణం ఆలోచిస్తే అందరికీ మనకు తెలిసిందే! చరిత్ర అందరం చదువుకున్నాం. చరిత్రలో ఒక భాగంగా తయారై మన ముందుకొచ్చి మనని దిగమింగేసే స్థాయికి వచ్చింది పరాయి భాష! మన భాష మనకి పనికి రానప్పుడు మనం వేరే భాషలో పని చేయాల్సొచ్చినప్పుడు ఆ భాషను ప్రత్యేకంగా నేర్చుకొని దానిలో నిష్ణాతులమవడానికి కొన్ని తరాలు పట్టొచ్చు. ఆ తరాలు పట్టే సమయంలో మనది మనకి కాకుండా అయిపోతుంది. కొంతమంది ముందుకెళ్ళిపోతా ఉంటారు. కొంతమంది వెనకబడి పోతూ ఉంటారు. మనలోనే అనేక రకాలుగా ఇంగ్లీష్ వచ్చిన వాళ్లు, ఇంగ్లీష్ రాని వాళ్లు, తెలుగొచ్చిన వాళ్లు, తెలుగు రాని వాళ్లుగా ఈ సమాజం చీలిపోతుంది. దీన్ని ఆపు చేసి ఇన్ని కోట్ల మంది కోసం సేవలలోను, వస్తు సౌకర్యాలను కల్పించేందుకు వీలుగా మాతృభాష అమలులోకి తేవాలి. దీని వలన మాతృభాష ప్రయోగం వలన ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయ్ అని చెప్పడానికి ఇలాంటి అవగాహన అందరికి కలిగించడానికి ఇలాంటి సభలు అవసరమవుతాయి అన్నారు. ఇది ఏ కొందరికోసమో, ఏ ఒకరి కోసమో కాదు. అసలు ఇదంతా మనమెందుకు జరుపుకుంటున్నామంటే గోడ ఎంత గట్టిగా ఉంటె అంత బలంగా మనం విసిరిన బంతి వెనక్కొచ్చి తగులుతుంది. తెలుగు వారికి వారి భాషను వాడొద్దు అంటూ ఆదేశాలు జారీ చేస్తున్నందువల ఇవాళ తెలుగు వారందరికీ కష్ట కాలం దాపురించింది. అంటే విద్య అనేది సమాజంలో ప్రతి వారి జన్మ హక్కు. ఈ విద్య ప్రజల భాషలో ఉంటె అతి సులువుగా, అతి తక్కువ కాలంలో అందరికి ఆమోదయోగ్యమైన రీతిలో, అందరికి ఒకే స్థాయిలో, అన్ని చోట్ల అందుబాట్లోకి రావాలి. అంటే ఏదో ఒక ప్రభుత్వ పాఠశాలలోనో, లేకపోతే ప్రైవేట్ లోనో, కార్పొరేట్ లోనో కాదు. అన్నింటా అందరికి చట్టరీత్యా ప్రాథమిక విద్య అనేది అందుబాటులోకి రావాలి అని అన్నారు. "మనమెవరం ప్రభుత్వ పాఠశాలలో ఉండాలనో, లేకపోతె ఇంకో చోట మాత్రమే ఉండాలనో కోరుకోటం లేదు అందరికి ఒకే విద్య చట్టరీత్యా మాత్రమే వీలవుతుంది. ప్రాథమిక విద్య అందరికి మాతృభాషలో జరగాలి అందరికి అందుబాటులోకి రావాలి" అని తెలిపారు. 350 ఏ అధికరణం ప్రకారం మన రాజ్యాంగంలో దీనిని పొందుపరచారు. భారత రాజ్యాంగంలో 350 ఆ అధికరణంలో ప్రతి రాష్ట్రానికి సంబంధించిన అధికార యంత్రాంగం భాషా అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన పిల్లలకు ప్రాథమిక విద్య మాతృ భాషలో బోధన కోసం తగిన సౌకర్యాలను అందించడానికి ప్రయత్నించాలి అని స్పష్టంగా చెప్పిందన్నారు. అంటే రాజ్యాంగం అల్ప సంఖ్యాక వర్గాలకోసం మాతృ భాషలో విద్యని ఈ అధికరణంలో నిర్దేశించినప్పుడు అధిక సంఖ్యాక వర్గాల చిన్న పిల్లలకు కాదంటుందా? వాళ్లకు ఎలాగూ వస్తుంది అనే వాళ్లెవరైనా ఉంటారా? దీన్ని అర్థం చేసుకునే పద్ధతిని వదిలేసేసి రాజ్యాంగం మనకెక్కడా చెప్పలేదు కాబట్టి మేము జిఓలు చేస్తాము అని తెలుగు ప్రజలను నమ్మించటానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దాని కోసం మనం ప్రజలకు అవగాహన కలిగించాలి. రాజ్యాంగం ఏమి నిర్దేశిస్తున్నది అని తెలిపి ప్రాథమిక విద్యలో తప్పనిసరిగా తెలుగు మాధ్యమం అందుబాటులోకి రావాలి అనే విషయాన్ని కూలంకషంగా చర్చించాలి. అది కూడా అన్నింటా రావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అని తెలుగు భాషోద్యమ సమాఖ్య చెప్పటం లేదు. ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్లు, ప్రైవేట్ ఇంకా ఏదన్నా ఉంటె అన్ని చోట్ల మాతృభాషలో ప్రాథమిక విద్య అందుబాటులోకి తీసుకొని రావాలి. ఇది తప్పని సరి అని ఆయన స్పష్టం చేశారు.

పూర్వం చెప్పుకున్నట్లు భాషంటే స్వంతం అని కాదు. సమాజాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్ళి నిలబెట్టే ఆర్థిక సాధనం భాష అనే కొత్త సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లాలి. చాణుక్యుడు ఆర్థిక శాస్త్రం చదువుకున్నాడా? లేదు. కానీ అది దేశాన్ని ముందుకు తీసుకెళ్ళేదే ఆర్థిక శాస్తం. అది అందరికీ అమోదయోగ్యమైనదై ఉండాలి. అది సాకారమవ్వాలంటే అమ్మనుడి ద్వారా మాత్రమే జరుగుతుంది. చదువుల్లో దాన్ని చూడాలి. విద్యా మాధ్యమం ద్వారా అమ్మనుడి ఉండాలి. అది ఎక్కడో కొన్ని పాఠశాలల్లో ఉంటేనో కాదు. చట్టరీత్యా ఈ సమాజం మొత్తానికీ అదే ఏకరీతిగా ముందుకు రావాలి. మాతృభాషలోకి విద్య అందుబాటులోకి రావాలి. రాజ్యాంగం కూడా అదే నిర్దేశించింది. మాతృభాషలో విద్య జరిగితే ఉపాధి ఉద్యోగావకాశాలు ఇనుమడిస్తాయి. దానికోసమే మాతృభాషా మాధ్యమం అవసరం. అంతేగాని ఇంగ్లీషు మాధ్యమం ద్వారా పరదేశాలకు వెళ్లవచ్చు అని చెప్పడం ఎంతవరకు సమంజసం? ఇదే దేశంలో ఇదే ప్రాంతంలో చదువుకుని ఉపాధి పొందే హక్కు ఇక్కడ పుట్టిన వారికి లేదా? అని ఆయన ప్రశ్నించారు.

**ఏ రాష్ట్రంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా తెలుగువాళ్ళంతా ఒక్కటే**

తీర్మానం : 5

## తెలుగేతర రాష్ట్రాలలో తెలుగువారి భాషాహక్కుల రక్షణ



'భాషాపరమైన మైనారిటీలకు ప్రాథమికస్థాయిలో మాతృభాషలో విద్యాబోధన' విషయమై రాజ్యాంగంలో 350ఎ, 350బి అధికరణాలలో పేర్కొన్న అంశాలు ఆచరణలో పూర్తిగా ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అమృత మహోత్సవాలు జరుపుకొంటున్న ఈ సమయంలో ఈ అంశంపై లోతుగా సమీక్షించాలి. ముఖ్యంగా తెలుగు భాషా జాతికి సంబంధించి, భాషారాష్ట్రాల ఏర్పాటు జరిగిన తర్వాత మొత్తం ఆ జాతి జనుల్లో సగం మంది తెలుగు రాష్ట్రాలకు బయటి ప్రాంతాల్లో ఉండిపోయారన్న సంగతి అలక్ష్యం చేయబడింది.

రెండు తెలుగురాష్ట్రాల ఏర్పాటు వాస్తవ విరుద్ధంగా జరిగినందువల్ల ఈ దురదృష్టకర పరిస్థితి ఏర్పడింది. తెలుగేతర రాష్ట్రాల్లోని తెలుగువారు నిర్లక్ష్యానికి, అణచివేతకు గురి అవుతూనే ఉన్నారు. వీరికి రాజ్యాంగం ప్రకారం కనీసం ప్రాథమిక విద్యను తెలుగునుడిలో నేర్చుకునే సౌకర్యాలను ప్రభుత్వాలు సమకూర్చడం లేదు. పాలనలో కూడా తెలుగు అల్పసంఖ్యాకులకు ఎక్కడా తగిన స్థానం ఇవ్వబడలేదు. ఈ పరిస్థితిని సవరింల్సిన 350-ఎ, బి అధికరణాలను పటిష్టం చేసి చట్టపరంగా తగుచర్యలు గైకొనాలనీ, ఇందుకోసం రెండు తెలుగురాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా తగినంత శ్రద్ధ చూపాలని కోరుతూ తీర్మానించడమైనది.

– ప్రతిపాదన : స.వెం.రమేశ్

## స.వెం. రమేశ్ ప్రసంగం

**తె**లుగు రాష్ట్రాలేతర రాష్ట్రాలలో తెలుగు వారి భాషాహక్కుల రక్షణపై తెలుగు భాషోద్యమ సమాఖ్య కృషి సల్పాలని స. వెం. రమేశ్ తీర్మానాన్ని ప్రతిపాదించారు. వారి తీర్మానానికి కారణభూతమైన విషయాలను, తెలుగుకు సంబంధించి అనేక విషయాలను సభముందుంచి సభికులను ఆశ్చర్య చకితులని చేశారు. ఆయన మాట్లాడుతూ తమిళుల మాదిరి తెలుగు దేవాలయాల్లో మంత్రాలను అన్నమయ్య పాటల ద్వారా మంత్రాలుగా రూపొందించి పఠించాల్సిన అవసరం ఉందని వక్కాణించారు. తమిళనాడులో ఆళ్వార్ ప్రబంధంలోని పాటలు ఎలా మంత్రాలుగా చలామణి అవుతున్నాయో వివరించిన ఆయన ఈ సందర్భంగా పలు చర్చనీయాంశాలను సభముందుంచారు.

ప్రతి ఇద్దరు తెలుగు వాళ్లలో ఒకరు బయట ప్రాంతాలలో ఉన్నారు. నాలుగు సంవత్సరాల పాటు తమిళనాడులో ఉడుముల పేట, మటం గుంట అనే రెండు తాలూకాల్లో తాను కొంతమంది మిత్రులతో కలిసి తెలుగు నేర్పించేందుకుతిరిగిన సమయంలో అనేక విషయాలను గుర్తించారని ఆయన తెలిపారు. ఆ రెండు తాలూకాలు, పాత కోయంబత్తూర్ జిల్లా, ప్రస్తుతం తిరుపూర్ జిల్లాలో ఉంటాయ్. ఉడుముల పేట పెద్ద పట్టణం. లక్ష జనాభా ఉంటారు. ఉడుముల పేట నుంచి 12 కిలోమీటర్లలో కేరళ మొదలవుతుందని చెప్పారు. తాము అక్కడ ఉన్నప్పుడు ప్రస్తుతం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన గారపాటి ఉమామహేశ్వరరావు వచ్చారు. అక్కడ ఇంటింటికీ తిరిగాం. జనాభాలెక్కలు సేకరించాం. అక్కడ తమిళ, తెలుగు, కన్నడిగులు ఉంటారు. కానీ కేరళకు అతి సమీపగ్రామాలైనప్పటికీ మళయాలీలు లేరు. అందరం అక్కడ ఒక తమిళ జానపద పాట కోసం ఆ రెండు తాలూకాల్లో 470 పల్లెలు తిరిగాం కానీ ఆ పాటలు తమ బృందానికి దొరకలేదు. ఆశ్చర్యం ఏమిటంటే ఆ 470 పై చిలుకు పల్లెల్లో ఒక్క తమిళ జానపదం కనిపించలేదు. తెలుగు జానపద పాటలు కొన్ని వేలు దొరికాయి. వందలు కాదు వేలు అని చెప్పారు. సభంతా ఆశ్చర్యంలో ఉండగా .. "అయితే దొరికినంతనే మేమేమి చేయగలం.? కేవలం మేము కార్యకర్తలం. కేవలం తెలుగు నేర్పే కార్యకర్తలం. వారిలో తెలుగు వారనే ధైర్యం నూరి పోయడానికి తిరిగే వాళ్లం. కాని పిహెచ్‌డి తీసుకునేందుకు తిరిగే వాళ్ళం కాదు. మరి ఆ సేకరణ పని ఎవరు చేయాలని? పరిశోధక విద్యార్థులని సూటిగా ప్రశ్నించారు. అక్కడ ఉన్నవారిలో అధికులు దళితులు. వారిలో నూటికి 90 మంది తెలుగు వారు. 10 మంది తమిళులు. అయితే అక్కడి తమిళ వారిలో యువకులు పాటలు పాడుతున్నారు కానీ అవి ఇళయరాజా, రహమాన్ వంటి వారి సినిమా పాటలు మాత్రమే పాడుతున్నారు. తమిళ పల్లె పాటలు ఒక్కటి కూడా లేవక్కడ. ఇటువంటి ఒక వెయ్యి సంఘటనలను చెబుతాను. మీరు రావాలి కదిలి.రావాలి మా వారు భోజనం పెడతారు, పడుకోవడానికి చోటు చూపిస్తారు, పాటలు పాడతారు" అని సభలో ఆశీనులైన విద్యార్థులను, స్కాలర్లను కోరారు. ఆయన మాట్లాడుతూ తాను తిరుపతి, అనంతపురం హైద్రాబాదు, చాలా చోట్ల చాలా విశ్వవిద్యాలయాల్లో చాలామంది అధ్యాపకులను కలిసి అడిగానని, వారిని రమ్మని ఆహ్వానించానని, వారి శిష్యులను పంపమని కోరానని, కానీ ఫలితం శూన్యం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకి 2000 సంవత్సరం నుండి ఆంధ్రప్రదేశ్ తో అనుబంధం ఉందని, అప్పటి వరకూ అమ్మమ్మ వాళ్ల ఊరు ప్రళయకావేరి దగ్గర ఒక పల్లె సూళ్ళురు పేట పట్టణం, తిరుపతి తప్ప ఏమి తెలీదన్న ఆయన, 2000 లలో సామల రమేష్ బాబు గారి పరిచయం ఏర్పడిన నాటీ నుంచి ఆంధ్రప్రదేశ్ నాలుగు మూలలూ తెలుసుకున్నట్లు చెప్పారు. అప్పటి నుంచి ఎన్ని సార్లు ఎంతో మంది అధ్యాపకులని కోరినా ఒక్క

అధ్యాపకులు కూడా స్పందించకపోవడాన్ని ఆయన నిరసించారు. ఏ ఒక్క పరిశోధక విద్యార్థిని కూడా పంపకపోవడం గర్హనీయమన్నారు.

బంగ్లాదేశ్ లో రాత్రంతా రామాయణాన్ని గెంతు భజన చేస్తూ గానం చేసే 25 ఏళ్ళ కుర్రాళ్ళు అక్కడి పల్లెల్లో కనీసం ఒక యాభై మంది ఉన్నారు. పరిశోధకులు, పరిశోధక విద్యార్థులు వెళతామంటే రానుపోనూ చార్జీలు మినహా అన్నీ ఏర్పాట్లు చేయిస్తానని ఆయన వాగ్దానం చేశారు. ఎన్ని రోజులైనా, సదరు విద్యార్థులని వారి సొంత మనుషుల్లాగా అక్కడి వారు చూసుకుని పంపిస్తారన్నారు. వెళ్ళేవాళ్ళున్నారా అని ఆయన సభలోని విద్యార్థులని నేరుగా అడిగారు. తాను 'ప్రళయ కావేరి' పుస్తకం రాసే నాటికి 'శక్తీ' శివరామకృష్ణ పరిచయం లేదని చెబుతూ తన అనుభాన్ని సభ్యులతో పంచుకున్నారు రమేశ్. తర్వాత హోసూరులో జిల్లా రచయితల సంఘం తమిళనాడు జిల్లాల్లోని కథలు రాయించి ప్రచురించారు. మేము తెలుగు వాళ్లమని చెప్పి పాఠాలు నేర్పించాం. వారి చుట్టూ ఉండే కథలు తెప్పించుకొని చదవండి అక్కడి వారి చుట్టూ అల్లుకున్న బంధాలు, కొండలు, గుట్టలు చెట్లు చేమలు, మేకల దారులు, అన్నిటి పేర్లు తెలుగులో దొరుకుతాయని అని శివరామకృష్ణగారు ప్రస్తుతం సభలో చెప్పినంత ఆవేశంగా చెప్పారని" గుర్తుచేసుకున్నారు. హోసూర్లో, ఉడుముల పేటలో మేకలు వెళ్ళే దారులు కొండలు, గుట్టలు చాల మటుకు తెలుగు పదాలే వినిపిస్తాయ్. వారి కథలు తెప్పించుకుని చూడండి అని సవెం రమేశ్ అన్నారు. అదంతా తెలుగు వారి సంపద అని , నిజం నమ్మి తీరాల్సిన విషయమని చెప్పారు. కన్యాకుమారికి ఒక 80 కిలో మీటర్ల ఎగువన కూడా నామినేరు చుట్టుపక్కల కూడా గుట్టలు, దారులు, అడవులు, కొండల పేర్లు కూడా తెలుగు పదాలున్నాయని తెలియజెప్పి సభికులని ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఇలా 80 పల్లెల్లో సేకరించిన 4000 మాటలని ఒక యూనివర్శిటీ ప్రొఫెసరు ఇప్పుడే ఇస్తానని 2014లో తీసుకెళ్ళారు! ఇంతవరకూ అతీగతీ లేదు. ఇప్పటికీ అవి వారి దగ్గర ఉన్నాయి. ఆయన అవసరం అనుకుంటే మళ్ళీ సేకరిస్తామని, కానీ అవి వారు చేయాల్సిన పనులు కాదని చెప్పారు. శంఖంలో పోస్తేనే తీర్థమన్నట్లు యూనివర్శిటీ వాళ్ళు చేయాల్సినవని, వారు పరిశోధించి బయటపెట్టాల్సినవన్నారు. ఇక ఎన్ని ప్రాచీన కళలు తెలుగు వారివి మనుగడలో ఉన్నాయో చెప్పుకొచ్చారు. తెలంగాణాలో మనుగడలో ఉన్న పటం కథలు, పటం వేలాడదీసి చెప్పే కథలు. మంగలి వారి కట్నం కథలు వంటివి తమిళనాడులో ఇంకా మనుగడలో ఉన్నాయని తెలిపారు. తమిళనాడులోని వారి జిల్లాల్లో గొల్లల వారికి పటం కథలు చెప్పే ఆచారం ఉందని తెలిపారు. గొడుగెండె కథలు గురించి చెప్పారు. అతి పెద్ద గొడుగు కు లోపల లావు పాటి కర్రతో ఆ గొడుగు పై బొమ్మలతో ఉన్న తిప్పుతూ కాటంరాజు కథలు చెప్పే ఆచారం వారి జిల్లాలో ఇంకా మనుగడలో ఉందన్నారు. వందల మంది ఎదురుగా కూర్చుని ఆసక్తిగా చూస్తారని చెప్పారు. అవి తెలుగు కథలని గుర్తు చేశారు. తమిళనాడులో 110 జానపద కళారూపాలున్నాయని అక్కడి ప్రభుత్వం ప్రకటించిందని, అందులో 105 తెలుగు కళారూపాలు కాగా, ఐదు మాత్రమే తమిళులవని తెలిపారు. అలాంటి అనేక విషయాలు తమ దృష్టికి వచ్చాయని, కనుక యూనివర్శిటీల నుంచి పరిశోధక విద్యార్థులు కదలి రావడమే ఆలస్యమని చెప్పారు. తానొక్కడే తెలుసుకుని త మాట్లాడినా బూడిదలో పోసిన పన్నీరే! అని ఆయన ఆవేదన చెందారు.

తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది



## తీర్మానం: 6

## ధార్మిక సాంస్కృతిక రంగాల్లో వలసభాషల దూకుడును వ్యతిరేకించాలి

సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించడంలో పీఠాధిపతులు, ఆచార్యులు, ఇతర ధార్మిక సంస్థల నేతలు, దేవాలయ యాజమాన్యం, సాంస్కృతిక కళారంగాలవారు ప్రముఖంగా కనబడుతుంటారు. విచిత్రంగా వీరు ఇటీవల అవసరం లేకపోయినా ఎక్కువగా ఆంగ్లంలో మాట్లాడటం మొదలుపెట్టారు. తెలుగువారి కార్యక్రమాల్లో కూడా సందర్భాన్ని ఆంగ్లంతో చెప్పడాన్ని ఒక సంప్రదాయంగా మార్చివేస్తున్నారు. ఇందువల్ల వీరు ప్రజలతో తమ సాంస్కృతిక దూరాన్ని పెంచుకొంటున్నారని తెలుగు భాషోద్యమ సమాఖ్య భావిస్తున్నది. ఈ వలస ధోరణుల నుండి బయటపడి ప్రజలతో సాన్నిహిత్యాన్ని పెంచుకోడానికి మాతృభాషలే సాధనమని వీరు మరచిపోకూడదు. ఈ మేరకు వారి మనోవైఖరిలో, ఆచరణలో మార్పు రావాలని తెలుగుజాతి గౌరవాన్ని, తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి వారు పూనిక వహించాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని తెలుగుభాషోద్యమ సమాఖ్య కోరుతూ తీర్మానిస్తున్నది.

**– ప్రతిపాదన : నందివెలుగు ముక్తేశ్వరరావు**

విశ్రాంత ఐ.ఎ.ఎస్. అధికారి

తీర్మానాన్ని ప్రతిపాదించి, ఆయన ఈ క్రింది విధంగా ప్రసంగించారు.
తర్వాత తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది

# నందివెలుగు ముక్తేశ్వరరావు ప్రసంగం

ధార్మిక, సాంస్కృతిక రంగాలలో వలస భాషల దూకుడును అరికట్టాలని తన తీర్మాన ప్రతిపాదనను సభికుల ముందుంచారు నందివెలుగు ముక్తేశ్వరరావు గారు. ఈ సందర్భంగా తన తీర్మానాన్ని బలపరచాలని సభికులని అభ్యర్ధిస్తూ, తన ప్రతిపాదనకు కారణాలను ఆయన సభ ముందుంచారు. తీర్మానాల్లో అది ఆరో తీర్మానం. సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించడంలో పీఠాధిపతులు, ఆచార్యులు, ఇతర ధార్మిక సంస్థల నేతలు, దేవాలయాల యాజమాన్యాలు, సాంస్కృతిక, కళా రంగాల వారు ప్రముఖంగా కనపడుతూ ఉంటారు. విచిత్రంగా వీరు కూడా అవసరం లేకపోయినా ఎక్కువగా ఆంగ్లంలో మాట్లాడటం మొదలుపెట్టారు. తెలుగువారి కార్యక్రమంలో కూడా సందర్భాన్ని ఆంగ్లంలో చెప్పడం అలవాటుగా చేసుకున్నారు. ఇందువల్ల వీరు ప్రజలతో సాంస్కృతిక దూరాన్ని పెంచుకుంటున్నారు అని తెలుగు భాషోద్యమ సమాఖ్య భావిస్తున్నదని ముక్తేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ వలస ధోరణి నుండి బయటపడి ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకోవడానికి అమ్మనుడిలోనే సాధ్యం అని మరిచిపోకూడదు. ఈ మేరకు వారి మనో వైఖరిలో, ఆచరణలో మార్పు రావాలని తెలుగు జాతి గౌరవాన్ని, తమ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టడానికి వారు పూనిక వహించాలని అందరికీ ఆదర్శంగా నిలవాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరుతూ తీర్మానం ప్రతిపాదిస్తోందన్నారు ముక్తేశ్వరరావు. అది తీర్మానం యొక్క ఆవశ్యకత అన్న ఆయన, ప్రతి ఒక్కరూ సాధారణంగా మాట్లాడుతున్నప్పుడు ప్రభుత్వాలు, ప్రభుత్వాలు అనుసరించేటటువంటి విధానాలు విచారకరం, వాటిలో వచ్చే విధానాల గురించి తరచూ మాట్లాడాతుండటం జరుగుతుంటుంది. కానీ భాష గురించి మాట్లాడేటప్పుడు భాషా పర్యావరణం మొత్తం కూడా దృష్టిలో తీసుకోవాలన్నారు. పర్యావరణం అన్నప్పుడు సామాజిక శాస్త్రంలో ఏ అర్థం తో వాడుతున్నామో అంటే వ్యక్తి చుట్టూ ఉండే మనుషులు, జంతువులు, పక్షులు, గాలి, నీరు, నీరుని జలవరణం అని, రాళ్లను శిలావరణం అని, అలా అన్ని ఆవరణాలను గురించి లెక్క వేసుకుంటున్నప్పుడు భాషకు సంబంధించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ధార్మిక ఆవరణాలు ఉన్నాయి. ప్రపంచం అంతా STEM వైపు నడుస్తోంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు వెళుతున్నాం. అవన్నీ కూడా ఎదురుగా కనపడే వస్తువుల గురించి మాట్లాడతాయి. సాధారణంగా కనిపించే వినిపించే ప్రపంచం కాకుండా అందరి అంతరంగాల్లో ఇంకో ప్రపంచం ఉంది. మనశ్శాంతి కావాలంటే కళ్లు మూసుకుంటాం, మనసును నిశ్శబ్దంగా ఉంచుతాం. ఎవరికి వారు తర్కించుకుంటూరు, బాధపడతారు, ఆలోచిస్తారు, దుఃఖపడతారు. ఆ మనసులో ఎవరికి వారు వెతుక్కుంటూ ఉన్నప్పుడే తానెవరని, తన చుట్టూ ఉన్న ప్రపంచంతో తనకు ఉన్న సంబంధం ఏమిటి? ఈ లోకం లోకి ఎందుకు వచ్చారు? ఇలాంటివి ప్రశ్నలు వస్తే అది ఆధ్యాత్మిక రంగం, ధార్మిక రంగం అవుతుందని వివరించారు. మనసుకి సంబంధించిన, అంతరాంతర పొరల్లో ఉన్న అంశాల్ని ధార్మిక విలువల్ని చెప్పవలసిన ధార్మిక ఆధ్యాత్మికలో అంతరంగం ఒకటన్నారు. కవులు, కళాకారులు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఈ సభలో కాళిదాసు, ఒక కృష్ణ శాస్త్రి, ఒక అన్నమయ్య కూర్చుని ఉంటే వాళ్లు కూడా మనం చూస్తున్న సభని చూస్తూ ఉంటారు. కానీ వారు చూసే కోణం వేరు, ఆ కోణానికి వారు వెతుక్కునే పదం వేరు, దాని ద్వారా వారు చెప్పే ఆ సత్యం, ఆవిష్కరించే సత్యం. మనకు కనిపించే సత్యం మరింత సౌందర్యవంతంగా, మరింత ప్రకాశవంతంగా, మరింత లోకానికి ఉపయోగపడేదిగా ఉంటుంది. ఇది దీంట్లో నేను చెప్పే ఒక ఆధ్యాత్మిక, కళలు, సంస్కృతి,సాహిత్య రంగాలు మనిషి కోసం మాట్లాడతాయి, మనిషి ప్రవర్తన గురించిమాట్లాడతాయి, సమాజంలో మనిషికి ఉండాల్సిన తీరు గురించి మాట్లాడతాయి. సమాజం ఎటు వెళ్లాలి అనే దానిమీద మాట్లాడతాయి అని ముక్తేశ్వరరావు తెలిపారు.

మన దేశభాషల్లో కోటానుకోట్ల విషయాలు ఉన్నాయి. వీటిని వ్యక్తీకరించవలసినవారు, లోకానికి మార్గదర్శకత్వం చేయవలసినవారు కవులు, కళాకారులు. వాళ్లే వాళ్ళ పని మానేసి వాటిని ఇంగ్లీష్‌లో ట్రాన్స్‌లేట్ చేస్తున్నారు అంటే ఏమి చెప్పాలి ? అని ఆవేదన వ్యక్తం చేశారు ముక్తేశ్వరరావు. తెలుగు వారు ఏం చేస్తున్నారంటే 'నాగా భరణాన్ని బహూకరించారని' గుడిలో చెప్పాల్సి వచ్చినప్పుడు వారు దానిని చిత్ర విచితంగా అనువాదం చేసి ఆంగ్లంలో ప్రకటించడం వింటుంటాం. 'అదిగో అల్లదివో శ్రీహరివాసము, పదివేల శేషుల పడగల మయము' అనే దానికి ఎలా అనువాదంలో మాట్లాడుకోగలం, ఆ అభివ్యక్తి ఎలా ప్రకటించడం అని ఆయన ప్రశ్నించారు. కనుక ఆ భావనలు అమ్మనుడిలోనే తీయగా ఉంటాయని ఆయన తెలిపారు. .

రాను రాను తెలుగు వారు సంస్కృతికి, భాషకి దూరం అవుతున్నారు. పిల్లలకి కూడా సంగీత కచేరీ జరుగుతుంటే రాగ్ ఆనంద భైరవి, తాళ్ ఆది తాళ్ అని చెబుతున్న పరిస్థితి సమాజంలో నెలకొందని అది సరికాదన్నారు.

ఇతర భాష వారు ఎవరూ లేనప్పుడు, అందరూ కేవలం తెలుగువారు ఉన్నప్పటికీ ఇలా అంగ్లంలో తర్జుమా చేసి చెబుతున్నారు. తాము ఒక ఎలైట్ క్లాస్ అని అనుకోవాలన్న దృష్టి మఠాలకు, మఠాధిపతులకు, కవులకు, కళాకారుల, వరకూ వచ్చింది. ఆఖరికి చాలా ప్రధానమైన, కీలకమైన అంశాలు సభలో జరిగినప్పుడు కూడా వాటిని గురించిన ప్రస్తావన లేకుండా, ఆ అనుభూతి లేకుండా, నేలదనం లేకుండా, ఆ తీయదనం లేకుండా, కమ్మదనం లేకుండా వస్తున్నటు వంటి పోకడలు అరికట్టకపోతే, వీరు శిష్ట వర్గాలు ప్రభావాన్ని కలిగి ఉంటారు. వారిని గురించి ఎందుకు మాట్లాడుతున్నామంటే లక్షల మంది, వేలమంది వారిని అనుసరిస్తున్నారు, వింటున్నారు కనుక వారు బాధ్యతగా మనవలసిన అవసరం ఉంది. వారు ఇక నుంచి అయినా వలస భాష దూకుడు తగ్గించి, దేశ భాషలలో ప్రజలకు అర్థమయ్యే తీరు తెన్నులతో అందించాలని కోరుకుంటూ ఈ అవకాశం ఇచ్చిన తెలుగు భాషోద్యమ సమాఖ్యకు ధన్యవాదాలు అని ఆయన తన తీర్మాన ఆవశ్యకతను వివరించారు.

(ఈ అంశంపై ముక్తేశ్వరరావు గారు వ్రాసిన ప్రత్యేక వ్యాసాన్ని ఈ సంచికలో చదువచ్చును)



### తీర్మానం: 7

## భాషాజాతుల వారసత్వ సంపద పరిరక్షణ అంశాన్ని అంతర్జాతీయ వేదికల దృష్టికి తేవాలి

ప్రతి సమాజం తనకు కావలసిన శాస్త్రజ్ఞానాన్ని సృష్టించుకొంటుంది. ఆ సృజనాత్మకతను కోల్పోయిన జాతిభాష నిర్జీవంగా మారుతుంది. పారిశ్రామిక విప్లవం తరువాత వర్ధిల్లిన విద్యావిధానాలు ఈ సమిష్టి సంస్కృతిని నిర్లక్ష్యం చేశాయి. 'అభివృద్ధి' పేరిట విదేశీయ భావజాలం, దృక్పథం, పెత్తనం చలాయించసాగాయి. ఇప్పుడు అభివృద్ధి వికటించి దిద్దుబాటు కోసం, సుస్థిర అభివృద్ధి పేరిట సమిష్టి సృజనలో పటిష్టత కోసం అన్వేషిస్తున్నది. తరతరాలకు జ్ఞానాన్ని అందించడంలో భాష ప్రముఖపాత్ర వహిస్తుంది. కాబట్టి శాస్త్రజ్ఞులు, సంప్రదాయజ్ఞులు తెలుగుజాతి శాస్త్ర వారసత్వం వైపు – స్వదేశీశాస్త్ర జ్ఞాన వారసత్వంలోకి తరచి చూడాలి. సుస్థిర అభివృద్ధి కోసం పనిచేసే అంతర్జాతీయ వేదికలు, జీవవైవిధ్య సదస్సుల దృష్టికి తేవాలి. అప్పుడే భాషాజాతులు వారసత్వసంపదను రక్షించుకోగలుగుతాయనీ, ఆయాజాతుల పరిపూర్ణవికాసంతో పాటు మొత్తం మానవజాతుల సమగ్రమైన అభివృద్ధికి దోహదం అవుతుందని తెలుగుభాషోద్యమ సమాఖ్య నిర్ద్వందంగా అభిప్రాయపడుతున్నది.

– ప్రతిపాదన : **పిరాట్ల శివరామకృష్ణ**
సంచాలకులు: 'శక్తి' గిరిజన సేవాసంస్థ

పై తీర్మానాన్ని ప్రతిపాదించి విస్తృతంగా ప్రసంగించారు. దీనికి సంబంధించి పలువురు ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. పై తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా అంగీకరించింది. ఈ సందర్భంగా కొన్ని వివరాలతో డా॥ శివరామకృష్ణ వ్రాసిన వ్యాసాన్ని ఈ పత్రికలోనే చదువవచ్చును.



### తీర్మానం: 8

## తెలుగునుడి సాంకేతికంగా పుంజుకునేందుకు పటిష్టమైన కృషిసాగించాలి

శాస్త్ర సాంకేతిక రంగాలలో గత దశాబ్ద కాలంగా జరిగిన ప్రగతి అంతకు ముందు సాంకేతికతల్లో జరిగిన విప్లవాలన్నిటితో పోల్చితే రెట్టింపు పనులు జరిగాయి. ఈ ప్రగతిని అందిపుచ్చుకోవాలంటే ఆయా భాషా సమూహాలు తమ సొంత భాషల్లో ఆ విజ్ఞానాన్ని తయారు చేసుకోవాలి. విద్య, వైద్యం, వినోదం, వృత్తి మొదలగు రంగాలలో జరుగుతున్న ప్రగతిని తెలుగు వారికి అందించాలంటే తెలుగు భాషలోకి పారిభాషిక పదాలు చేరాలి. సాంకేతిక సాహిత్యం తెలుగులోకి రావాలి. మున్ముందు వచ్చే సాంకేతిక విషయాలన్నిటినీ అందించేలా తెలుగు భాషను మనం సిద్ధం చేయాలి. ఆ విధంగా తెలుగును ఆధునిక భాషగా తయారు చేసుకోవాలి.

తెలుగు భాషను సాంకేతికంగా పరిపుష్టం చేసేందుకు ఎన్నో సంస్థలు నడుం బిగించాయి కానీ వనరులు లేక కొన్ని ప్రయత్నాలు మొదట్లో, కొన్ని సగంలో ఆగిపోయాయి. కొన్ని అంశాల్లో అసలు తెలుగులో ఏ పనీ మొదలవ్వలేదు.

మరొక పక్క తెలుగుకు ఆధునిక హోదా తెచ్చేందుకు ఒక్కో సంస్థ తనదైన మార్గంలో విడిగా పని చేస్తోంది. ఒక సంస్థకు, మరొక సంస్థకు మధ్య ఎలాంటి సంబంధాలూ లేకుండా జరుగుతున్న ఈ ప్రగతి అసమంగా ఉంది. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఇలాంటి అన్ని సంస్థలను కలుపుగోలు చేస్తూ తెలుగుపై జరుగుతున్న కృషిని అందరికీ చేరవేసేందుకు ఒక సమన్వయ సంస్థగా పనిచేస్తుంది.

తెలుగునుడిని ఆధునికులకు సరిపోయేలా తీర్చిదిద్దేందుకు కావాల్సిన వనరులను, సమాచారాన్ని సంగ్రహించి, సమీకరించి, సంపాదించి తెలుగు భాషోద్యమ సమాఖ్య ఒకే వేదిక ద్వారా ఇలాంటి వనరులను ఆసక్తి ఉన్న పరిశోధకులకు అందిస్తుంది.

తెలుగు సాంకేతిక నిపుణుడు శ్రీ **రహ్మానుద్దీన్ షేక్** ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు.

ఈ తీర్మానంపై పలువురు ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. ముఖ్యంగా విశ్వవిద్యాలయాల పరిశోధకులు, అధ్యాపకులు, పాల్గొని తీర్మానాన్ని బలపరచారు. సభ ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంగా శ్రీ రహ్మానుద్దీన్ షేక్ ప్రసంగ సారాంశం ఇది:

## రహ్మానుద్దీన్ షేక్ ప్రసంగం

**శాస్త్ర** సాంకేతిక రంగాలలో కాలం మొదటి నుంచి ఒక దశాబ్దం క్రితం వరకూ జరిగిన ప్రగతికి గత దశాబ్ద కాలంలో జరిగిన ప్రగతి రెట్టింపు అనీ, ఈ రంగంలో ప్రతీ ఏడాది జరిగే ప్రగతి అంతకు ముందు జరిగిన ప్రగతికి రెట్టింపుగా జరుగుతోందని చెప్పారు. ఒక జామెట్రిక్ ప్రోగ్రెషన్‌లాగా ఈ ప్రగతి జరుగుతూ ఉంది. పెరుగుతూ పోతూనే ఉంది సాంకేతికత. ఈ సాంకేతికను అందిపుచ్చుకోవడం కోసం తెలుగులో ఏమేం జరగాలి? ఏమేం చేయాలి? అందుకు కావలసిన వనరులు ఏమిటి? అన్నీ సమకూర్చుకోవడం దిశగా పనులు జరగాలి. ఇందులో పనిచేసే అన్ని సంస్థలను కలుపుకుంటూ, సమన్వయంగా ఈ పనులు జరగడం కోసం తెలుగు భాషోద్యమ సమాఖ్య పనిచేయాలి అనేది తన ఆకాంక్ష అని రహ్మానుద్దీన్ అన్నారు. ఈ ప్రగతిని అందిపుచ్చుకోవాలంటే ఆయా భాషా సమూహాలు తమ తమ స్వంత భాషల్లో ఆ విజ్ఞానాన్ని తయారు చేసుకోవాలి. విద్య, వైద్యం, వినోదం, వృత్తి మొదలైన రంగాలలో జరుగుతున్న సాంకేతిక ప్రగతిని తెలుగు వారికి అందించాలంటే తెలుగు భాషలోకి పారిభాషిక పదాలను చేర్చాలి. సాంకేతిక సాహిత్యం తెలుగులోకి రావాలి. ముందు ముందు వచ్చే సాంకేతిక విషయాలన్నింటినీ అందించేలా తెలుగును సిద్ధం చేయాలి. ఆ విధంగా తెలుగును ఆధునిక భాషగా సిద్ధం చేసుకోవాలి. తెలుగు భాషను సాంకేతికంగా పరిపుష్టం చేసేందుకు ఎన్నో సంస్థలు నడుం బిగించాయి. కానీ వనరులు లేక కొన్ని ప్రయత్నాలు మొదట్లో, కొన్ని సగంలో ఆగిపోయాయి. కొన్ని అంశాలలో అసలు తెలుగులో ఏ పనీ మొదలవ్వలేదు. మరొక పక్క తెలుగుకు ఆధునిక హోదా తెచ్చేందుకు ఒక్కో సంస్థ విడి విడిగా పనిచేస్తోంది. ఒక సంస్థకూ, మరొక సంస్థకూ ఎలాంటి సంబంధాలు లేకుండా జరుగుతున్న ఈ ప్రగతి అసమగ్రంగా ఉంది. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఇలాంటి అన్ని సంస్థలను ఏక త్రాటిపైకి తెచ్చి తెలుగు కోసం సాంకేతికంగా జరుగుతున్న కృషిని అందరికీ చేరవేసేందుకు ఒక సమన్వయ సంస్థగా పనిచేయాలి అని అభిప్రాయపడ్డాడు. తెలుగునుడిని ఆధునికులకు సరిపోయేలా తీర్చిదిద్దేందుకు కావలసిన వనరులను సేకరించి/సంపాదించి, సమీకరించి, భద్రపరిచి తెలుగు భాషోద్యమ సమాఖ్య ఒకే వేదిక ద్వారా ఆసక్తి ఉన్న పరిశోధకులకు అందించాలి.

సాంకేతికత విషయం రాగానే రెండు విషయాలు గుర్తించాలి. సాంకేతిక వనరులను తెలుగులో తయారు చేసుకుంటున్నామా? ఇప్పటికే ఆంగ్లంలో బహుళంగా లభ్యమవుతున్న వనరులను వాడుకుని సరిపెట్టుకుంటున్నామా? Are we creators of technology or are we mere consumers? అని ఆలోచించుకోవాల్సిన సందర్భం అని రహ్మానుద్దీన్ అన్నారు. ఈ ఆలోచనలను ఆధారం చేసుకుని తెలుగులో సాంకేతికత ఎలా వస్తుంది అని మనం ఆలోచిస్తే ఒక ఐటీ ఇంజనీరింగ్ రంగాన్నే ఉదాహరణగా తీసుకుంటే- కంప్యూటర్ సాఫ్టువేర్ రాసేవాళ్ళను చూస్తే అందులో సగం భారతీయులు, ఆ భారతీయుల్లో 60-70 శాతం మంది తెలుగువాళ్ళు ఉంటారు. కానీ తెలుగులో ఒక్క సాఫ్టువేర్ కూడా రాదు. ఇలాంటి అసమానత ఎందుకు వచ్చింది? ఎక్కడ వుంది తప్పు? అనేది కొంచెం మనకై మనం ఆలోచించుకోవాలి. మామూలుగా జనం సాంకేతికతను అనుకూలంగా మలచుకునేప్పుడు, సాంకేతికతను సొంతం చేసుకునేటప్పుడు మూడు విధాలుగా సాంకేతికత ప్రవేశిస్తుంది. ఒకటి పూర్తి ఆసక్తి తో అది సొంతంగా నేర్చుకుంటారు. లేదంటే ఆ సాంకేతికత వీళ్ళ స్నేహితులు కానీ సమూహానికి చెందిన వాళ్ళు కానీ నేర్చుకుంటున్నారని ఆ వత్తిడితో నేర్చుకుంటారు, లేదా ప్రభుత్వపరంగా, లేదా కాలం కొంత దాటాక జరుగుతున్న మార్పులవల్ల కానీ బలవంతంగా అందరూ కొత్త సాంకేతికతలోకి తోసి వేయబడతారు. ఇప్పుడు జరుగుతున్నది ఏంటంటే చాలా సాంకేతికతలలోకి మనం బలవంతంగా తోసివేయబడుతున్నాం. అందులో తెలుగులో కనుక ఈ సాంకేతికతలు అందుబాటులో లేకపోతే జనం మెల్లిగా, ఇబ్బందులతో ఆంగ్లంలోకి మారతారు. ఉదాహరణకు ఏటీఎం మిషన్ ఉంది, దాన్ని ప్రతి ఒక్కరూ వాడాలి – వేరే మార్గం లేదు. ఆ ఏటీఎంలో తెర మీద కనిపించే భాష తెలుగులోనే ఉంటే, మనం ఒకరకంగా వాడతాం, మనకు తెలియని ఆంగ్లంలో ఉంటే ఒక రకంగా వాడతాం. ఆంగ్లంలో వాడితే ఇబ్బంది. తెలుగులో వాడితే సౌలభ్యమూను. సెల్‌ఫోన్ ఉంది, దాన్ని ప్రతి ఒక్కరూ వాడాలి. బలవంతంగా మనం అందులోకి తోసివేయబడుతున్నాం. బ్యాంకింగ్ టెక్నాలజీ కూడా కొద్ది రోజులలో నెట్ బ్యాంకింగ్ లోకి పూర్తిగా మారిపోతుంది. అప్పుడు బలవంతంగా ప్రతి ఒక్కరూ కూడా నెట్ బ్యాంకింగ్ వాడాల్సిందే అని ఆయన అన్నారు. అలా జరిగితే ఆ సందర్భంలో ఒకవేళ నెట్ బ్యాంకింగ్ తెలుగులో అందుబాటులో లేకపోతే ఒకరికి తెలుగు మాత్రమే వచ్చి ఆంగ్లం రాని పక్షంలో వాళ్ళు ఆ సేవను వాడుకోలేరు. ఇదొక పెద్ద ప్రమాదంగా తయారై పోతుందని ఆవేదన వ్యక్తం చేశారాయన. దీన్ని అరికట్టాలంటే ఏం చేయాలి? సాంకేతికత ప్రతి ఒక్కటీ కూడా, ప్రతి అంశాన్ని కూడా తెలుగులోకి అందుబాటులోకి తేవడానికి కృషి మాత్రం జరిగి తీరాల్సిందే! ఈ బలవంతంగా సాంకేతికత లోకి వెళ్ళే వారి కోసం అయినా సాంకేతికతను తెలుగులోనికి తేవాల్సిన అవసరం వుంది- అని రహ్మానుద్దీన్ అభిప్రాయపడ్డారు.

ఇదీ తన ఈ ప్రతిపాదన వెనుక ఉన్న నేపథ్యం అని చెప్పిన ఆయన ఇంకా మాట్లాడుతూ మనం ఏదైనా సాంకేతిక వనరును తయారు చేసేటప్పుడు కూడా సాంకేతికత తెలుగులోనే రావాలి, ఉదాహరణకు ఆండ్రాయిడ్ ఫోనుల్లో, ఆపిల్ ఫోనుల్లో వాడే ఆప్స్ ని మనం తెలుగులోనే చేసుకోగలగాలి. ఏ సాంకేతికతనైనా వాడుకునేటప్పుడు మనకు కనిపించేదంతా తెలుగులో వుండాలి. ఇంటర్ఫేస్ పూర్తిగా తెలుగులో వుండాలి అని రహ్మానుద్దీన్ అన్నారు.

## తీర్మానం: 9

## విశ్వవిద్యాలయాలలో పరిశోధకులు ఆచార్యులు ఎంచుకొంటున్న పరిధుల ఎల్లలు దాటాలి

తెలుగువారు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక పూర్వమే నేటి రెండు తెలుగు రాష్ట్రాల ఆవల అనేక ప్రాంతాలలో, దేశాలలో కొన్ని వందల, వేల సంవత్సరాలకు పూర్వమే తెలుగువారు తమ సంస్కృతిని విస్తరించుకున్నారు. వారందరూ ఇప్పటికీ ఆయా ప్రాంతాలలో తెలుగు మాట్లాడుకొంటూ, తెలుగుజాతి సంప్రదాయ సంస్కృతులను ఆచరిస్తూ, గౌరవించుకొంటూ, తెలుగును వారి గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నారు.

ఈ నేపథ్యంలో తెలుగుజాతి భాష, సాంప్రదాయాలు, సంస్కృతులపై వివిధ విశ్వవిద్యాలయాలల్లో పరిశోధకులు, ఆచార్యులు, ఎంచుకొంటున్న పరిధులు ఎల్లలు దాటవలసిన అవసరాన్ని గుర్తించాలని వారిని కోరుతూ సమాఖ్య తీర్మానిస్తున్నది.

**– ప్రతిపాదన : మొవ్వా శ్రీనివాసరెడ్డి**
**సుందర్ కొంపల్లి**

## మొవ్వా శ్రీనివాసరెడ్డి, సుందర్ కొంపల్లి ప్రసంగాలు

**అం**తర్జాతీయంగా అల్లుకున్న తెలుగు తీవెల గురించి కొద్దో గొప్పో పరిశీలిస్తున్నాం గానీ ప్రక్క రాష్ట్రాలలోని తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు పట్టించుకోవడంలో కొంత వెనుకబడ్డట్టే కనిపిస్తోందని డా. సుందర్ కొంపల్లి అన్నారు. 'విశ్వవిద్యాలయాల పరిశోధకులకు విన్నపం' అని తమ తీర్మానాన్ని డా.మొవ్వా శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రతిపాదించిన సుందర్ మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాల ఎల్లలైతే భాషా ఆధారంగా జరిగాయి గానీ, అప్పటికే ఎల్లలు దాటి ప్రక్క రాష్ట్రాలలో శతాబ్దాలుగా నివసిస్తున్న తెలుగువారి అచార వ్యవహారాలు, సంప్రదాయాలుపై పూర్తిస్థాయిలో సమాఖ్య పట్టించుకోవలసి ఉందని అన్నారు. పరిశోధక విద్యార్థులు కూడా వారి గురించి పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు. చత్తిస్‌ఘడ్, బస్తర్ లాంటి ప్రదేశాలలో అధికంగా తెలుగువారు ఉండేవారని, వారిని ఉద్యమంలో కలుపుకోవలసి ఉందన్నారు. అలా ఇతర రాష్ట్రాలలో విస్తరించిన వారి గురించి ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు డా. సుందర్ కొంపల్లి.

తెలుగు భాషోద్యమ సమాఖ్య సభ్యులు మొవ్వా శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ సుందర్ కొంపల్లి సంయుక్తంగా ఓ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆ సందర్భంగా శీనివాసరెడ్డి మాట్లాడుతూ... తామిద్దరూ హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో సహాధ్యాయులమని, ఉపాధ్యాయులుగా కూడా కలిసి పనిచేశామని తెలిపారు. అదే కళాశాలలో ఉపన్యాసకులుగా తానున్ననని, సుందర్ తన ప్రయాణ మార్గాన్ని మార్చుకుని ఆదిమ తెగలు జాతుల గురించి ఎక్కువ కృషి చేస్తున్నారని తెలిపారు.

ఆయన కొనసాగిస్తూ 'ఈ రోజు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లకు పరిశోధకులకు మా విన్నపం' అనే సాహసోపేతమైన తీర్మానం చేస్తున్నామన్నారు. తెలుగువారికి రెండు ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటుకు ముందే కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఎన్నో ప్రాంతాల్లో తెలుగు వారికి ప్రత్యేకమైన సంస్కృతి ఉంది. వారు తెలుగు సంస్కృతిని, సంప్రదాయాలను గుండెల్లో పెట్టుకుని పూజిస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో, తెలుగు పరిశోధకులు తమ పరిశోధనల పరిధి



విస్తరించుకోవలసిన అవసరం ఉందని, దానిని గుర్తించాలన్నారు. తెలుగు ప్రజలు వేల సంవత్సరాల క్రితం ఏ ప్రాంతాల్లో ఉండేవారు? అతి ప్రాచీన కాలం నుండి వారు అక్కడే ఉన్నారా? ఎంతమంది ఉన్నారు? ఏం చేస్తూ ఉన్నారు? వారి ఆచార సంప్రదాయాలు ఎలా ఉండేవి? వారి సమస్యలు ఏమిటి? వారి ప్రగతికి, అభివృద్ధికి అడ్డుపడిన విషయాలు ఏంటి ? వంటి అంశాలపై పరిశోధన సాగించాలి. తెలుగుశాఖ వారు వారికి ఎటువంటి సహకారం అందించాలి? పాలనా సేవ అందించాలా? పాఠశాల నిర్మించాలా ? వారికి ఎటువంటి శిక్షణ ఇవ్వాలి? అనే విషయాలపై చర్చ, పరిశోధన విస్తృతంగా జరగాలని అభిలషించారు.

తెలుగువారు అప్పటికే శ్రీలంక, ఇండోనేషియా, మారిషస్, బర్మా, చైనా మరియు అండమాన్ లాంటి దేశాల్లో విస్తరించి ఉన్నారు. వారికి ఎటువంటి సహకారం అందించాలి అనే విషయాలపై పరిశోధన కొనసాగించారు. ఈ రోజున తమ తీర్మానానికి రెండు పుస్తకాలు ఉత్తేజాన్ని ఇచ్చాయని వాటిలో ఒకటి స.వెం రమేశ్ రచించిన 'ఎల్లలులేని తెలుగు' అనే పుస్తకం కాగా రెండవ పుస్తకం డి.పి. అనూరాధ రచన 'జగమునేలిన తెలుగు' అని కొనియాడారు.

రొమిల్లా థాపర్ 'ల్యాండ్ ఆఫ్ స్నేక్ చార్మర్' అనే భారతీయ సంస్కృతి గురించి రాసిన పుస్తకంలో ఈ ప్రాంతం గురించి రాశారు. అలా ఇక్కడ నుండి ప్రక్క దేశాలకు వేల సంవత్సరాల క్రితమే వలసలు వెళ్ళాయని కొన్ని సంఘటనలను అనురాధ తన పుస్తకంలో వివరించారని గుర్తుచేసుకున్నారు.

అనూరాధ శ్రీలంకలో పరిశోధన నిమిత్తం వెళ్ళినప్పుడు ఒక పాములు పట్టే వాడు పాములు ఆడిస్తున్నాడు, ప్రక్కన వ్యక్తి తెలుగులో బూతులు తిట్టడం గమనించారు అని జగమునేలిన తెలుగు పుస్తకంలోని కొన్ని ఘటనలను ఉటంకించారు. “అంటే ఎన్నో వేల సంవత్సరాల క్రితమే ఎన్నో దేశాలలో తెలుగువారు విస్తరించారు అనేది తెలుస్తుంది. కంభంపాటి సత్యనారాయణ రావు గారి పుస్తకం ‘చరిత్ర – సంస్కృతి’ చదివినప్పుడు శాతవాహన కట్టడాలు బౌద్ధ కట్టడాలు, అమరావతి పాఠశాల గురించిన సమాచారం తెలిసింద”న్నారు.

ప్రస్తుత కాలంలో తెలుగు సంస్కృతి గురించిన పరిశోధనలు చాలా తగ్గుతూవచ్చాయి. యువతరం ఇటువంటి పరిశోధనలు భుజాలకెత్తుకొని మళ్లీ ఉత్తేజంతో కొత్త విషయాలను కనుక్కోవాలని



ఆశిస్తూ దీనికి ప్రభుత్వ సహకారం కూడా తోడవ్వాలని కోరుకుంటున్నాను అని తన తీర్మాన ప్రసంగాన్ని ముగించారు.

కాగ ఇదే తీర్మానాన్ని శ్రీనివాస్ రెడ్డితో కలసి ప్రతిపాదించిన సుందర్ కొంపెల్ల అనేక కొత్త విషయాలను సభికులతో పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ, వారు చేసిన తీర్మానం వాస్తవం దాల్చడం చాలా క్లిష్టమైన సమస్య అని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలే మాట వినవు.. అలాంటిది ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విశ్వవిద్యాలయాలు వినే అవకాశం లేదు. వాళ్ళు అనుకునేవి వాళ్ళు చేస్తారు. మన సంస్కృతి, భాష, నుడికారాన్ని, జానపద, గిరిజన సంస్కృతిని పోషించింది ఫోక్ కమ్యునికేషన్స్ వంటి విదేశీ స్వచ్ఛంద సంస్థలే అని వివరించారు. దాని నుండి  భారతియులు ముఖ్యంగా తెలుగు వారు ఒకటి తెలుసుకోవాలి. భారతీయ సంస్థలు గడిచిన 15 నుంచి 20 ఏళ్ల కాలంలో ఎంతో స్వతంత్రంగా ఎదిగాయి. కోవిడ్ సమయంలో తెలుగు వారికి చెందిన మందుల కంపెనీలు కూడా అత్యధిక లాభాలను గడించాయి.  విద్యా విషయంగా, పరిశోధనాత్మక విషయంగా, విశ్వ విద్యాలయాల ద్వారా చదువుకుని, సంపద గడించిన వారిని సంప్రదించి ఆయా విశ్వ విద్యాలయాల్లో పరిశోధనల మద్దతుకై ప్రయత్నించాలి. కార్పొరేట్ రెస్పాన్సిబులిటీ 2013 చట్టం ప్రకారం సమ్మలు 2 నుండి 5 శాతం ఇటువంటి విషయాలకు అనగా సమాజ సంక్షేమం కోసం కచ్చితంగా ఖర్చు పెట్టాలి.  లేని పక్షంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.  కనుక అలాంటి సంస్థలన్నీ ఏదో విధంగా ఖర్చు చేయక తప్పదు. ఆ ఖర్చును పరిశోధనలకు కేటాయించాలని కోరాలి. దానికి సమాఖ్య కృషి అవసరమని, ప్రభుత్వం పై ఎంతకాలం పోరాడగలం అందుకే మొదట ఒకటి, రెండు విశ్వవిద్యాలయాల్లో ఆయా సంస్థల సహకారం సక్రమంగా మొదలయ్యేలా చేయగలిగితే చాలని, అప్పుడే చాలా గొప్ప విషయం అవుతుందన్నారు.  ఇంకా కొన్ని సూచనలను సమాఖ్య ముందుంచారు సుందర్. గ్రామీణ స్థాయిలో తెలుగు పై అభిమానం ఉన్నవాళ్ళు ఉన్నారని, భాషకు పూర్తిగా వ్యతిరేకంగా ఏమి లేరని కనుక ఆయా ప్రాంతాలలో లాంగ్వేజ్ క్లబ్స్ లాంటివి ఏర్పాటు చేయాలని సూచించారు.  విదేశాల్లో ఇలాంటి క్లబ్స్ ఉన్నాయి. వారికి అకడమిక్ పుస్తకాలు ఉండవు. ఇక్కడ పద్యాలు...పెద్ద బాలశిక్ష లాంటివి ...ఏదైనా నేర్చుకోవచ్చు.  చిన్న సమావేశ మందిరాలు నేర్చుకోవడానికి.  స్వచ్ఛందంగా కొన్ని గ్రామాల్లో అవలంబించాలన్నారు.  బొమ్మిడాల కృష్ణమూర్తి లాంటి వారు సాయం అందిస్తే బావుంటుందన్న ఆయన విదేశాలలో కాఫీ క్లబ్‌లనేవి ఉంటాయని. అక్కడ అనేక విషయాల పై చర్చ జరుగుతుంటుందని సభికుల దృష్టికి తెచ్చారు.

ఇలాంటివి ప్రయోగాత్మకంగా చేస్తే ఉభయ తారకంగా ఉంటుంది. విశ్వవిద్యాలయలకి కంపెనీల నుంచి నిధులు కూడా భారీ స్థాయిలో లభిస్తాయి.  దీనివల్ల పరిశోధనలు దేశంలో పెరుగుతాయి. కంటికి కనపడని మహిమలు లాంటివి ఇవి.  పెద్ద కార్పొరేట్ సంస్థలు పూనుకుంటే..  ఒక్కో విశ్వవిద్యాలయంలో ఒకరిద్దరు పరిశోధక విద్యార్థుల చొప్పున 4 విశ్వవిద్యాలయాలకు స్పాన్సర్ చేస్తే ఏడాదికి ఒక్కో సంస్థకు కోటిరూపాయలకు మించి కాదు. కోటి రూపాయలనేవి సదరు కంపెనీలకు చాలా చిన్న విషయం అని స్పష్టం చేశారు సుందర్. ఇదే అన్ని విశ్వవిద్యాలయాల్లో అవలంబించినా .. కార్పొరేట్ సంస్థలకు పెద్ద భారం కాదు.  మనం క్షేత్ర స్థాయిలో చేయగలిగెవి ఇవే అని తమ తీర్మానానికి పరిష్కారాన్ని చూపే ప్రయత్నం చేశారు ప్రొ.సుందర్ కొంపల్లి.

తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది

మాతృభాషల్ని అణచివేసే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకమైనవి.
అభివృద్ధి నిరోధకమైనవి కూడ.
అలాంటి ప్రభుత్వాలను అధికారంలో ఉండనీయకూడదు.

–ఒక సామాజిక ఉద్యమనేత

సృజనకు విత్తు సొంతభాష... రచనకు సత్తువ ప్రజల భాష



తీర్మానం: 10

## మాతృభాషలకు ముప్పును ఎదుర్కోవడానికై రాజ్యాంగానికి సవరణలు చెయ్యాలి

**- ప్రతిపాదన :డా॥ సామల రమేష్‌బాబు**

'మాతృభాషలకు ముప్పును ఎదుర్కొనడానికి రాజ్యాంగ సవరణ చేయాలని డా॥ సామల రమేష్‌బాబు తన తీర్మానాన్ని సభ ముందు ప్రతిపాదించారు. దాని అవసరం గురించి సవివరంగా తెలియజేస్తూ ఆయన ప్రసంగించారు. సమాజాన్ని నిర్మించుకోవడం కోసం, సమాజాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకుపోవడం కోసం.. రూపొందించబడిన విలువైన డాక్యుమెంట్ మన రాజ్యాంగం. అవసరాన్ని బట్టి సవరణ చేసుకోవచ్చు. కానీ మొత్తంగా తీసేసి కొత్తది తెచ్చుకోవాల్సిన అగత్యం లేదు. అనుభవంలో అనేక విషయాలు తెలుస్తుంటాయి. సవరణల అవసరమవుతుంది. రాజ్యాంగంలో ఇప్పటికీ ఒక 100 సవరణలు వచ్చాయి. రాజ్యాంగాన్ని రూపొందించిన కమిటీ జరిపిన చర్చల్లో దాదాపు చాలావరకు జాతీయ భాష గురించి, భాషా ఐక్యత గురించి, జరిగినంతగా చర్చ ఇంకే విషయం మీద జరగలేదు. ఇది చాలా క్లిష్టమైన సమస్య. దేశంలో ఎన్నో భాషలున్నాయి. రాజ్యాంగం ద్వారా ఇప్పటికీ దాదాపు 22 భాషలు గుర్తించబడ్డాయి. వీటన్నింటినీ జాతీయ భాషలుగా గుర్తించాల్సిందే అని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటి వరకూ హిందీ కూడా జాతీయ భాషగా గుర్తించబడలేదన్నది వాస్తవం. రాజ్యాంగంలో పేర్కొన్న 22 భాషలూ జాతీయ భాషలుగా గుర్తించబడాలి. లేకపోతే అది అవమానమే. సాంకేతికంగా ఇంత ముందుకు వెళ్తున్న రోజుల్లో కూడా ఇంకా దేశం మొత్తానికి కలిపి ఒకే జాతీయ భాష ఉండాలనేది అవివేకమైన ఆలోచన.

ప్రధానమంత్రి మోదీ గారు ఏ సభలకు వెళ్లినా హిందీలో మాట్లాడుతారు. అది అవతల వాళ్ళకి అర్థమవుతుంది. అలాంటి యంత్రాంగం ఉంది. అలాగే మన తెలుగువారు చట్టసభల్లో ఢిల్లీలో మాట్లాడడానికి వెళ్లినప్పుడు మన భాషలోనే హాయిగా మాట్లాడుకోవచ్చు. అలా మాట్లాడాలి అంటే ఆ భాష జాతీయ భాష అయి ఉండాలి. రాజ్యాంగం గుర్తించిన 22 భాషలను జాతీయ భాషలుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. అలా చేస్తే చాలా సమస్యలు పోతాయి.

అంతేగాక, మాతృభాషల రక్షణకు సంబంధించిన ముఖ్యమైన సమస్యల పరిష్కారం కోసం కూడా రాజ్యాంగ సవరణలు అవసరం ఉంది. వీటిని చర్చకుపెట్టాల్సి ఉంది.

దీనికోసం ఒక ఎక్స్పర్ట్ కమిటీని ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన ముగ్గురు న్యాయనిపుణులను కమిటీలో భాగస్వామ్యం చేసి ఒక ఉప సంఘం ఏర్పాటు చేసి ఎటువంటి ప్రతిపాదనలు చేయాలి? ఎలాంటి సవరణలు తీసుకురావాలనే చర్చలు చేసి వారి సూచనల ప్రకారం ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. అని ఆయన సభికులను కోరగా సభయావత్తు ఏకగ్రీవంగా ఆమోదించింది.

కవిత

## పలుకుబడి పాయల్లో...

గర్భస్థ శిశువు మెదడుకణాల్లో
ఉసురు దాగిన పోగులా
శబ్ద సముశ్చయమేదో దాగి ఉంటుందేమో!
పసికందు పురిటి జన్యువుల్లో
ఉగ్గుపాల నిగ్గులా
పద సంకేతాలేవో యిమిడి ఉంటాయేమో!
ఉమ్మనీటిలో ఈదులాడుతున్నపుడే
ఆకర భాషా జ్ఞానానికి ఆదిమ రూపమైన
వ్యాకరణ సూత్రాలు అబ్బుతాయేమో!

ఏ కుదురు నుండి విచ్చుకుంటుందో
పసిమొలక లాంటి ఒక్కో పదం!
తరాల వంతెన కింద
పలుకుబడి పాయల్లో

ఉగ్గుచుక్కల ఊటలా జనిస్తుంది
పసినోట మాటగా ధ్వనిస్తుంది
జవసత్వాల జీవ లక్షణమై రక్తంలో కలుస్తుంది
క్యార్‌మన్నది మొదలు కన్నుమూసే వరకూ
అమ్మభాష అన్నింటా తోడై నిలుస్తుంది.
గోరుముద్దలు గోముగా అందుకున్నట్టు
రుచిరాగాల పాలముద్దలు ప్రియమార తిన్నట్టు
అల్లనల్లన పిల్లచేప ఈత నేర్చినట్టు
సహజంగాస్వరపేటిక పలుకునందుకుంటుంది
అమ్మను మురిపించే కన్నబిడ్డ భాష
బొమ్మలు ముద్దాడే కన్నతల్లి భాష
అమ్మఒడిలో నుడివిన తేనెసోనల పీయూష

ఆజన్మాంతం అమ్మై వెంటుండే అమ్మభాష
అనాయాసంగా ఒంటబడుతుంది
అనూచానంగా చెంతనుంటుంది.

తల్లిభాషతోనే బుద్ధివికాసం
చామ్‌స్కీ చెప్పినా, ఛాయరాజ్ చెప్పినా
మాతృభాష పునాదుల మీదే జ్ఞానప్రకాశం!
అమ్మమాట తృణీకరించి
అందలాలెక్కాలనుకుంటే
అరుగును తవ్వి
ఆకాశానికి నిచ్చెన పేర్చడమే!

కంచరాన భుజంగరావు
9441589602


ENG. MED. SCHOOL
మాతృభాషా దినోత్సవం
అది డిజైన్ కాదురా
ఏదో లాంగ్వేజిలా వుంది!!


అది చీర కాములు కాదమ్మా!
బీరకాయలు! నీ కోడలు
ఇంగ్లీషు మీడియం కదా!!

నందివెలుగు ముక్తేశ్వరరావు
9491428084

# ధార్మిక, సాంస్కృతిక రంగాల్లో వలసభాషల దూకుడును అరికట్టాలి

**ఒక** చిన్న గ్రామంలో ఒక వ్యక్తి ఉండేవాడు. అతని దగ్గర ఒక గాడిద ఉండేది. రోజూ అతని గాడిద పొలం నుండి మట్టిని తన ఇంటికి తీసుకువెళుతుంది. పొలం చాలా దూరంలో ఉన్నందున, తన గాడిదను సమీపంలో కట్టి, మధ్యలో ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటాడు.

ఒకరోజు, ఆ వ్యక్తి తాను రోజూ గాడిదకు కట్టే తాడును తీసుకోవడం మర్చిపోయాడు. చెట్టు వద్దకు రాగానే, "ఈ రోజు ఈ గాడిదను ఎలా కట్టాలి? నేను నిద్రపోతే అతను పారిపోవచ్చు." గాడిద పారిపోకుండా ఉండేందుకు గాడిద చెవులు పట్టుకోవాలని నిర్ణయించుకున్నాడు.

కానీ ఈ విధంగా గాడిద, వ్యక్తి ఇద్దరూ విశ్రాంతి తీసుకోలేకపోయారు. అటుగా వెళుతున్న ఒక జ్ఞాని, ఆ మనిషి.. గాడిద చెవులు పట్టుకోవడం చూశాడు. అప్పుడు అతని సమస్య ఏమిటో తెలుసుకోవాలనుకున్నాడు. ఆ మనిషి సమస్య ఏమిటో జ్ఞానితో చెప్పగా, తెలివైన సాధువు ఇలా అన్నాడు:

"గాడిదను రోజూ కట్టే చోటికి తీసుకెళ్లండి. తాడును ఉపయోగించి అతనిని కట్టివేసినట్లు నటించండి. అది పారిపోదని నేను మీకు హామీ ఇస్తున్నాను."

అతడు సాధువు చెప్పినట్టే చేశాడు. అతను గాడిదను వదిలి నిద్రించడానికి వెళ్ళాడు. తిరిగి లేచేసరికి గాడిద అక్కడే ఉంది. వెంటనే అతను ఇంటికి బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. కానీ గాడిద కదలలేదు.

"ఈ గాడిదకి ఏమైంది!"

అని అతను నిస్పృహతో అరిచాడు!

అదృష్టవశాత్తూ, ఆ మనిషి జ్ఞానిని మళ్లీ చూశాడు. అతని వద్దకు పరిగెత్తాడు. గాడిద వింత ప్రవర్తన గురించి చెప్పాడు.

"నువ్వు గాడిదను కట్టివేసావు, కానీ మీరు దానిని విప్పారా?" వెళ్లి, మీరు గాడిదకు కట్టిన తాడును విప్పినట్లు నటించండి."

ఆ మనిషి సాధువు సలహాను అనుసరించాడు.

ఇప్పుడు గాడిద ఇంటికి బయలుదేరడానికి సిద్ధంగా ఉంది.

గాడిద అంటే బంధించిన గాడిద అని ఆ వ్యక్తికి అర్థమైంది. తెలివైన సాధువుకు కృతజ్ఞతలు తెలిపి తన గాడిదతో సంతోషంగా ఇంటికి వెళ్లాడు.

మానసిక బానిసత్వం బానిసత్వం యొక్క అన్ని రూపాల్లోకెల్లా హీనంగా మిగిలిపోయింది, ఇది స్వేచ్ఛ ఉన్నట్లు భ్రాంతిని కలిగిస్తుంది. కానీ తెలిసిన, అర్థం చేసుకునే మనస్సు బానిసగా మారదు.

చాలా మంది గేట్-లెస్ సెల్స్‌లో బంధించబడ్డారు. బోనులలోని పక్షులు ఎప్పుడూ పాడవు... ఏడుస్తాయి.

మన స్వంత తప్పుడు ఆలోచనల చెర నుండి మనల్ని మనం విడిపించుకునే వరకు మనం ఎప్పటికీ స్వేచ్ఛగా ఉండటానికి మార్గం లేదు. మీకు తెలియకపోతే, మీ ఆలోచనలు మిమ్మల్ని నిర్వచించడంలో చాలా దూరం వెళ్తాయి అది మీ చర్యలలో ప్రతిబింబిస్తుంది.

మానసిక బానిసత్వం నుండి మిమ్మల్ని మీరు విముక్తి చేయడానికి ప్రయత్నం చేయండి. ఏ జాతి లేదా తెగ మీ కంటే గొప్పది కాదు. ఏ మానవుడూ నీ కంటే గొప్పవాడు కాదు. మీ ప్రత్యేకత మీదే!

**భావ దాస్యం ప్రమాదకరం కదా!**

ఈ కథ విన్నప్పుడు నాకు భారతదేశంలో గర్వంగా ఆంగ్లాన్ని తప్పుగా మాట్లాడే మేధావులు గుర్తుకొస్తుంటారు!

ఆ భాషలో ప్రావీణ్యం లేకపోయినా ఆంగ్లంలో మాట్లాడితేనే గొప్ప... అనే భావన భారతదేశమంతా వ్యాపించి ఉన్నా ఆంధ్రదేశంలో దానికి ఆదరణ ఇంకాస్త ఎక్కువ!

ఎందుకంటే ఇక్కడ మధ్యతరగతి మేధావులే కాదు! సాంస్కృతిక వారసత్వానికి ప్రతినిధులుగా, తేజోమూర్తులుగా విరాజిల్లే పీఠాధిపతులు కూడా అపభ్రంశ ఆంగ్లంలోనే మాట్లాడుతుంటారు!

తెలుగు భాష ఉనికి గురించి, అస్తిత్వం గురించి ఆందోళన పడవలసిన అవసరం లేదని చేకూరి రామారావు లాంటి భాషావేత్తలు చెప్పినప్పుడు నిజమే అనుకున్నాం! కానీ పదాలు, పదబంధాలు స్థాయిని దాటి వాక్య,అన్వయ స్థాయిలలో ఆంగ్లం చాప కింద నీరులా ప్రవేశిస్తుంటే ఆందోళన పడకుండా ఎలా ఉండగలం?

మెకాలే మన జాతికి చేసిన ద్రోహాన్ని ఎన్నాళ్ళు పురాణాలుగా చెప్పుకుంటాం? ఇకనైనా దానిలో నుంచి బయట పడాల్సిన అవసరం లేదా?

భాషావరణం గురించి బాధపడే మేధావులు ఇలా ఆలోచిస్తుంటే, ప్రభుత్వాలు మాత్రం సరిగ్గా దీనికి వ్యతిరేక పథంలో ప్రయాణం చేస్తున్నాయి

దీనికి ఎక్కడో ఒకచోట విరామ చిహ్నం పెట్టవలసిన అవసరం ఉంది.

పాలనారంగంలో తెలుగు అమలు గురించి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం ఒక ఎత్తయితే, సాంస్కృతిక రంగంలో అవగాహన కల్పించడం మరింత అవసరంగా కనిపిస్తోంది.

**ఎక్కడ మొదలు పెడదాం?**

మన సంస్కృతికి, వారసత్వానికి ప్రాతినిధ్యం వహించే సంగీత, నాట్య, సాహిత్య, చిత్ర కళ మొదలైన వాటి గురించి సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నప్పుడు చాలామంది వచ్చీరాని ఆంగ్లంలోనే పరిచయాలు, ముగింపులు, అభిప్రాయాలు పలకడం విచారించదగ్గ విషయం.

భాషా పరిరక్షణ నిజానికి ఇక్కడ నుండి మొదలు కావాలి అన్నది అందరూ ఒప్పుకోవాల్సిన సత్యం. ధార్మిక క్షేత్రాలు, ఆలయాలు,

సాంస్కృతిక పరిరక్షణ కేంద్రాలు . ఇవన్నీ తెలుగు పలుకుబడితో విలసిల్లుతుంటే అప్పుడు పాలనా రంగం వైపు, న్యాయ రంగంవైపు మన చూపు సారించ వచ్చు.

సాధారణ ప్రజలు ఆశ్రమాలకు ఎందుకు వెళ్తారు? ఆశ్రమాలలో ఆధ్యాత్మిక అనుభూతి పొందడం కోసం. జీవితంలో ఎదురయ్యే అనేక రకాల సమస్యలకు పరిష్కారాలు వెతుక్కుంటూ ఆశ్రమాలకు వెళ్తారు. అద్భుతమైన, సుందరమైన, సత్యమైన, శివ మయ మైన, మంగళకరమైన పరమాత్మ తత్వాన్ని తెలుసుకోవడానికి వెళ్తారు. ఆశ్రమాలలో అథితి బోద ఆచరణం ప్రచారం ప్రధానంగా ఉంటాయి. వీటిలో ఆచరణ మన సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఉండాలి. అలాగే బోధ కూడా మనకు అందుబాటులో ఉన్న ఉదాహరణలు, భాషతో ఉండాలి.

అరుణాచలం రమణ మహర్షి గారు, వ్యాసాశ్రమం పీఠాధిపతులు, శుక బ్రహ్మ ఆశ్రమం అధిపతులు గతంలో భగవద్గీత మొదలైన గహనమైన విషయాలను లక్షలాది కోట్లాదిమంది సామాన్యులకు మామూలు భాషలోనే బోధించి ప్రజల ఆదర అభిమానాలకు పాత్రులు అయ్యారు

**భాషకు వైరస్ సోకింది**

ఈ మధ్య కాలంలో ఆశ్రమాలన్ని ఆంగ్లో శాక్సన్ పద్ధతిలో ఇంగ్లీష్ పదజాలంతో ఉపదేశాలు సందేశాలు ఇవ్వటం మొదలు పెట్టాయి. మన భాషలో ఉన్న సౌందర్యాన్ని సహజత్వాన్ని దూరం చేసుకున్నట్టుగా ప్రవర్తిస్తున్నాయి

ఉదాహరణకు సుందరకాండ గురించి చెప్పే సందర్భంలో హనుమంతుడు మంకీ గాడ్ అవుతాడు. రావణాసురుడికి ఫ్రైటెనింగ్ ఫీచర్స్ ఉంటాయి.

ఇటువంటి కృత్రిమ పరిభాషలో చెప్పడం వల్ల పురాణ ఇతిహాసాలలో ఉన్న పాత్రల స్వభావం సామాన్య ప్రజలకు శ్రోతలకు పూర్తిగా ఎలా అర్థమవుతుంది? ఆ పాత్రకు ఉన్న పవిత్రత, హుందాతనం శ్రోతలకు ఎలా తెలుస్తుంది?

చెప్పేది ఏమో పురాణేతిహాసాలకు సంబంధించిన అంశం. వాడే భాష ఏమో అంతగా ప్రావీణ్యం లేని ఆంగ్లం. అందువల్ల వీరు ఆయా పాత్రల స్వభావాన్ని పట్టి ఇవ్వలేకపోతున్నారు. అంతరార్థాన్ని దర్శించ లేక, ఆవిష్కరించ లేక ఇబ్బంది పడుతున్నారు.

ధార్మిక ప్రవృత్తిని ప్రజలలో వ్యాప్తి చేయడం కోసం అవతరించిన కొన్ని మిషన్స్ కూడా ఇదే బాటలో ప్రయాణించడం దురదృష్టకరం. ఆ మిషన్స్ నిర్వహిస్తున్న శత జయంతులు, పెద్ద సమావేశాలు అన్ని కూడా ఆంగ్ల భాషలోనే కొనసాగుతున్నాయి. దీనివల్ల సమాజంలో ఉన్న సామాన్య ప్రజానీకం అంటే రైతులు, కూలీలు, కార్మికులు, విద్యార్థులు, గ్రామీణప్రాంత ప్రజలు, రామకృష్ణ పరమహంస, శారదామాత, వివేకానంద స్వామి మొదలైన మహనీయులు జాతికి అందించిన సందేశాలను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. అందుకోలేక పోతున్నారు.

ఆయా సంస్థలు ఇప్పుడు వ్యవహరిస్తున్నట్లు కాకుండా దానికి భిన్నంగా ఆయా రాష్ట్రాల మాతృభాషలలో వివేకానంద, రామకృష్ణ పరమహంస, శారదా మాతల సాహిత్యాన్ని అందించగలిగితే ఎంతోమంది లాభపడతారు. సంఘం ధార్మిక మార్గంలో ప్రయాణం చేయడానికి వీలవుతుంది.

**దేవాలయానికీ తప్పని ఇబ్బంది**

తెలుగునాట ఈ దుస్థితి మరీ అధికంగా ఉంది. దేవాలయాలు ఆధ్యాత్మిక అనుభూతికి, భక్తిమయ వాతావరణానికి నిలయాలు, కేంద్రాలు. అక్కడ కట్టు, బొట్టు, ఆచారం, వ్యవహారం, భాష తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా గా ఉండాలి. కానీ శిలాఫలకాల దగ్గర్నుంచి దేవీ దేవతల చిత్ర పటాల, మూర్తుల నామధేయాల వరకు అన్ని ఆంగ్లంలోనే దర్శనమిస్తున్నాయి. గుడిలో ఉన్నాము అన్న వాతావరణానికి మనల్ని దూరం చేస్తున్నాయి.

గుడికి ఒక వారసత్వ ఉంటుంది. ఒక సంస్కృతి ఉంటుంది. అక్కడి పూజారులు, సేవకులు.. వీరందరికీ ఒక పరి భాష ఉంటుంది. వారు దానిని ఉపయోగిస్తేనే ఉచితంగా, హుందాగా ఉంటుంది.

ఉదాహరణకు నైవేద్యం, పూల హారాలు, ఉద్ధరిణె, ఏక హారతి, శఠారి మొదలైన పదాలు ఉన్నాయి. వీటిని కూడా ఆంగ్లంలో చెప్పాలని ప్రయత్నించడం వికృతంగా ఉంటుంది. దేవుడికి అలంకరించే నాగాభరణం, మకర తోరణం వంటివి కూడా ఇవే కోవలోకి వస్తాయి.

serpent hood was presented by sri ఇలా అనడం కొన్ని దేవాలయాలలో వింటున్నాం. ఇది ఎంతవరకు బాగుంది?

అలాగే పురాణ ఇతిహాసాలలో ఉండే కథలను స్థానిక భాషలలో చెబితే అర్థం అవుతుంది. పరమార్థం బోధపడుతుంది. వారి చర్య సార్థకం అవుతుంది. ఉడతా భక్తి.. అనే పద బంధాన్ని వివరించడానికి squirrel and Rama అని చెప్పడం మొదలు పెడితే వినేవాడు ఎంత ఆసక్తిగా వింటాడు? చెప్పేవాడు ఎంత సమర్థంగా చెప్పగలడు? ఇది సాధ్యమయ్యే పనేనా? ఇది సహజమయిన పనేనా?

**కళారంగమూ ఇంతే**

అలాగే మరో ముఖ్యమైన రంగం కళారంగం.

కళారంగంలో సాహిత్యానికి సంబంధించిన అంశాలే కాకుండా మరెన్నో విలువైన, సమాజాన్ని సవ్యమైన దిశలో నడిపించే మార్గ నిర్దేశనం చేసే విషయాలు ప్రస్తావించబడుతూ ఉంటాయి. ఇవన్నీ ఇతర భాషలలో చెప్పాలని ప్రయత్నించడం వృథా ప్రయాస.

పదివేల శేషుల పడగల మయము అన్న విషయాన్ని ten thousand serpent hooded hills అని చెప్పినంత మాత్రాన పాటలోని అసలు విషయం అర్థమవుతుందా?

కంటి అఖిలాండ కర్త అధికుని గంటి..

పొడగంటి వంటి వాక్యాలను ఆంగ్లంలో వివరించాలి అనుకోవటం అవివేకం కాక మరి ఏమిటి? పొడగంటి అనే మాటకు ఉన్న అర్థ ఛాయలను ఏ ఆంగ్ల భాషా పదాలు వ్యక్తీకరించ గలవు? లీలగా కనిపించడం అనే అర్థం వచ్చేట్టుగా ఏ ఇంగ్లీష్ భాష పదాలు వాడగలరు?

కూచిపూడి, భరతనాట్యం వంటి నాట్యరీతుల వెనక భక్తి తత్వము నమ్మకాలు విలువలు ఉన్నాయి. త్యాగయ్య అన్నమయ్య వంటి వాగ్గేయకారులు ఈ విలువలను నమ్మకాలను వారి రచనల్లో ప్రతిఫలింప చేస్తూ వచ్చినవారు.

తెలుగు కీర్తనల గురించి తెలుగువారికి వివరించేటప్పుడు అటు శుద్ధఆంగ్లం కానటువంటి ఇటు స్వచ్ఛమైన తెలుగు కాని సంకరజాతి భాషలో పరిచయం, విశ్లేషణ, ముగింపు ఇవ్వడం సమంజసం కాదు. దానివల్ల ఆయా సంప్రదాయాల, ఆయా వ్యక్తుల కు సంబంధించిన

**వలస పాలకులు వెళ్లిపోయారు గాని వారు వదిలివెళ్లిన ఇంగ్లీష్ వైరస్‌లాగా మన బుర్రలను వదలకుండా పట్టుకొని ఉంది. కరోనా పోయినా దాని వల్ల తర్వాత వచ్చే అనారోగ్య సమస్యల్లాగా ఇంగ్లీష్ మనలో ఉండిపోయింది. పిల్ల పోయినా పీతి కంపు పోలేదంటే ఇదేనేమో! ఈ వైరస్ సాంస్కృతిక ఆధ్యాత్మిక రంగాలలో ఉన్న స్వామిజీలకు, కళాకారులకు సోకడం దురదృష్టకరం..**

రామణీయకత, ఆర్ద్రత లోపిస్తున్నాయి.

రామదాసు, అన్నమయ్య, త్యాగయ్య వంటి వారు అనాదిగా తెలుగు ప్రజల హృదయాలను చూరగొన్న మహనీయులు. వారి జయంతులు వర్ధంతులు జరిపేటప్పుడు కూడా యానివర్సరీ పేరుతో ఆంగ్లంలోనే జరుపుతున్నారు. వీరి పరిచయాలను ఆంగ్ల భాషలో చేస్తున్నారు. ఇది శోచనీయం.

సీతమ్మ రామయ్య చేతిని చెట్ట పట్టింది.. ఇటువంటి వాక్యాలు వచ్చినప్పుడు తెలుగులో వాటి అంతరార్థాన్ని వివరిస్తే బావుంటుంది గాని sita holding the hand of Rama అని చెబితే అందంగా ఉంటుందా?

శంకర భగవత్పాదులు కూడా "భవాని! త్వత్ పాణి పరి గ్రహణ పరిపాటి...ఇదం" అని చెప్పారు.

శంకరుడు శ్మశాన వాసి. చర్మాంబర ధరుడు. చేతిలో కపాలం. మెడలో పాములు. ఇటువంటి వాడికి నీ చేయి పట్టుకోవడం వల్ల సౌభాగ్యం దక్కింది అన్న కాకువు పై శ్లోకంలో ఉంది. ఇది ఏ ఆంగ్ల పరిభాషకు దొరుకుతుంది?

మొత్తంగా పురాణ ఇతిహాసాల కథనాలు వక్రీకరణకు గురవుతున్నాయి.

వలస పాలకులు వెళ్లిపోయారు గాని వారు వదిలివెళ్లిన ఇంగ్లీష్ వైరస్ లాగా మన బుర్రలను వదలకుండా పట్టుకొని ఉంది. కరోనా పోయినా దాని వల్ల తర్వాత వచ్చే అనారోగ్య సమస్యల్లాగా ఇంగ్లీష్ మనలో ఉండిపోయింది. పిల్ల పోయినా పీతి కంపు పోలేదంటే ఇదేనేమో!

ఈ వైరస్ సాంస్కృతిక ఆధ్యాత్మిక రంగాలలో ఉన్న స్వామిజీ లకు, కళాకారులకు సోకడం దురదృష్టకరం..

శ్రీ చంద్రశేఖరసరస్వతి స్వామివారు, శ్రీభాష్యం అప్పలాచార్యులవారు, ఇటీవలే కీర్తిశేషులైన శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రిగారు తేటతెలుగులో బోధించేవారు. కొందరు ప్రవచనకారులు చక్కనైన తెలుగులో హృదయానికి హత్తుకునేట్టుగా ప్రవచనములు చెబుతున్నారు. అచ్చమైన నుడికారపు తెలుగు వాడుతున్నారు. వారిని చూసైనా పీఠాధిపతులు కొంత నేర్చుకోవాలి.

దీన్ని కేవలం భాషా సమస్యగా కాకుండా సాంస్కృతిక సమస్యగా, మొత్తంగా దేశ సమస్యగా చూడవలసిన అవసరం ఉంది

మాతృభాష అమలు విషయంలో ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన మరొక రంగం బోధన రంగం. ఈ విషయం గురించి ఆలోచించినప్పుడు మహాకవి శ్రీశ్రీ చెప్పిన సన్నివేశం ఒకటి గుర్తుకు వస్తుంది

ఒకసారి శ్రీశ్రీ గారు ఒక నాటకం చూస్తున్నారు. వేదిక మీద ఉన్న నటుడు పాతాళాన్ని గురించి చెప్పాలి. అందుకు ఆయన నేల వైపు చెయ్యిచూపించాలి. దానికి విరుద్ధంగా ఆయన ఆకాశం వైపు చెయ్యి చూపించి అభినయించాడు. అందరూ ఆ నటుడిని తప్పు పట్టారు. శ్రీశ్రీ మాత్రం అతనిని అభినందించాడు. తెలుగు నాటక రంగం పరిస్థితి పాతాళానికన్నా దిగువన ఉంది కాబట్టి నువ్వు పాతాళం అని చెయ్యి పైకి చూపించడమే సమంజసం అని అన్నారట. తెలుగు నాటకరంగ దుస్థితిని చెప్పడానికి ఆ రోజుల్లో ఈ సన్నివేశాన్ని చెప్పుడేవారు

బోధన రంగంలో మాతృభాష పరిస్థితి గురించి ఆలోచించినప్పుడు కూడా ఇదే ఆలోచన మనసులో మెదులుతూ ఉంటుంది. పాలకులు చేసే పొరపాట్లు ఒక తరం మొత్తానికి నష్టాన్ని కలిగిస్తాయి కాబట్టి వారి నిర్ణయాలు ఆచితూచి తీసుకునే విధంగా ఉండాలి. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొని ఏం లాభం?

మేధావులందరూ ప్రాథమిక విద్య కచ్చితంగా మాతృభాషలోనే ఉండాలని మొత్తుకుంటున్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ , వివేకానంద, సర్వేపల్లి రాధాకృష్ణ, నేటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ గారు, ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు గారు ఇలా ప్రాచీనులు, ఆధునికులు అనే తేడా లేకుండా ఎందరో మాతృభాష గురించి మొర పెట్టుకుంటూ ఉంటే- అవేవీ వినిపించని, వినిపించుకోని పాలకులు ఉన్న నేటి రోజుల్లో- మాతృభాష గురించి ఏం ఆలోచించగలం? అలా అని నిరాశపడి చేతులు కట్టుకుని కూర్చోగలమా? మన ప్రయత్నం మనం చేయక తప్పదు.

అది సాంస్కృతిక రంగం నుంచి మొదలు అయితే ప్రభావవంతమైన మార్పులను తీసుకుని రావచ్చన్నది నా దృఢ విశ్వాసం.

**పీఠాధిపతులకు వారి స్వేచ్ఛ వారికి ఉండే మాట నిజమే అయినా వారు పరంపరగా వస్తున్న ఒక సంస్కృతికి, ఒక ధర్మానికి వారసులు, ప్రతినిధులు కాబట్టి వారి నోటి నుండి ఆ సంస్కృతిని ఆ వారసత్వాన్ని ప్రతిబింబించే పదజాలం రావాలని కోరుకోవడంలో తప్పేం లేదు! మనం భాషకు సంబంధించిన మార్పునకు అక్కడ శ్రీకారం చుడదాం!**

'యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః
స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే'

**ఉత్తములు వేటిని ఆచరిస్తారో ,వాటిని మాత్రమే ఇతర జనులు ప్రమాణముగా తీసుకుంటారు. లోకము కూడా ఆ విధముగా అనుసరిస్తుంది.** అ

**అమ్మనుడిలో విద్యాబోధనతోనే ఆర్థిక ప్రగతి-**
**ప్రజల భాషలో పాలనతోనే ప్రజాస్వామ్య సుస్థిరత**

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జీవవైవిధ్య పరిరక్షణ వగైరా అంతర్జాతీయ ఒప్పందాల అమలులో తెలుగు వారసత్వం !

'తెలుగులో శాస్త్రమైనా అంతర్జాతీయ స్థాయికి రాదగిన
గుణం ఉంటేనే తెలుగు అంతర్జాతీయ భాష అవుతుంది'

# వికటించిన 'అభివృద్ధి'- 'సుస్థిర అభివృద్ధి' జీవవైవిధ్య సదస్సులు వేదికలు, చట్టాల ద్వారా దిద్దుబాటు చర్యలు.

**60** నుండి హరిత విప్లవం మొదలైన వాటిద్వారా జరిగిన 'అభివృద్ధి' వికటించి, భూతాపం పెరిగింది. దిద్దుబాటు చర్యగా' సుస్థిర అభివృద్ధి ప్రణాళిక ముందుకొచ్చింది. అంతకు ముందే, జీవ వైవిధ్యం (2003), అటవీ హక్కుల గుర్తింపు(2006), చట్టాలుగా వచ్చాయి. ఉత్తరాంధ్రలో ఊట భూములు, బీల తంపరలు, కంపెనీలకు అప్పచెప్పటం చట్టవిరుద్ధంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. పంచాయతీల వారీగా జీవవైవిధ్య జాబితాలు తెలుగులో తయారవుతున్నాయి. మేధో సంపత్తి హక్కులను (పోచంపల్లి నేత, కొండపల్లి బొమ్మలు) గుర్తిస్తున్నారు.

అడవులు, ఆదివాసులతో పనిచేసే వారు, మరో అడుగుముందుకేసి ప్రతి పల్లె, గూడెం వారీగా సాంప్రదాయిక సరిహద్దు మధ్య గల ఉమ్మడి, వ్యక్తి గత( పోడు ) వాడుకలను పటాలలో గుర్తించే విధంగా చట్టం తెచ్చారు. తెగలవారీగా ఈ వాడుక పదాల జాబితా కూడా ప్రభుత్వం జారీ చేసింది. నూతన విద్యావిధానం కింద గిరిజన సంస్కృతి బోధనకు 'ప్రధానోపాధ్యాయుల కరదీపికలు' తయారు చేయించింది. తమ సంప్రదాయజ్ఞానాన్ని స్వచ్ఛంద సంస్థల సాయంతో గిరిజనులే గ్రంథస్తం చేస్తున్నారు. ఈ సంస్థలు తీరప్రాంత మత్స్యకారులతో,వ్యవసాయ రంగంలోకి కూడా తమ కృషిని విస్తరిస్తున్నాయి. ఉపగ్రహ విద్యతో అనుసంధానం చేస్తున్నాయి.




భద్రిరాజు కృష్ణమూర్తి నాయకత్వంలో 1960లోనే రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి, రైతుల నుండి సేకరించిన పదసంపదతో కూర్చిన వ్యవసాయ మాండలిక వృత్తి పదకోశంలో, 427 వడ్లరకాలు, 100 రకాల జొన్న, 18 రాగి, ఆరికలు 5, కొర్ర 37, ఉలవలు 13, బొబ్బర 8, సెనగలు 8, నువ్వు 19, ఆముదాలు 7, చెరకు 2, పత్తి 12, పొగాకు 15, మిరప 10, కొబ్బరి 51, అరటి 15, నిమ్మ 8 రకాలు ఉన్నట్లు 'తెలుగుసామెతలు, జనజీవనం' (తెలుగు అకాడెమి. పాపిరెడ్డి నరసింహారెడ్డి)లో పేర్కొన్నారు . అయితే ఈ పదకోశంలో గిరిజనప్రాంతాల వివరాలు లేవు. అరకులోయలోని సొవ్వ పంచాయతీలో సంజీవని సంస్థ సేకరించిన విత్తనాల జాబితా కేంద్రప్రభుత్వం గుర్తింపు పొందింది. ఈ సంస్థ సంచాలకుడు దేవుళ్ళు, బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యుడు. అరకులోయ పక్కనే ఉన్న ఒడిశా జేపోర్‌లో, తమిళనాడులోని చెట్టినాడు, కాశ్మీర్‌లలో వ్యవసాయ వారసత్వం ప్రపంచ ఆహార సంస్థ గుర్తింపు పొందాయి. మనమేం తక్కువతిన్నాం !

1960లోనే అంతకంటే ఎక్కువ రకాలు నమోదుచేసిన మన వంగడాలు, వాటి రకాలు ఎన్నింటిని శాస్త్రవేత్తలు సేకరించారు. జీవవైవిధ్య పట్టికలో అవి నమోదు అవుతున్నాయా? అసలు ఈ పట్టికలో తెలుగు, ప్రజల వాడుకలో ఉన్నదేనా! ఇవి ఎవడు పట్టించుకుంటున్నాడు!?

ప్రభుత్వం బోధనా భాషగా ఆంగ్లాన్ని రుద్దుతుంది గాని, బతుకుతెరువులకు సంబంధించిన సమాచారం గ్రామస్థాయికి తెలుగులోనే అందిస్తున్నది. జనం ఏదో ఒకటిలే అని సరిపెట్టుకుంటున్నారు. ఈవేళ భాషను ఆధునీకరిస్తున్నవాళ్ళకు ఈ విషయాలు తెలుసా? ఈ విషయాలు చర్చించే వేదికలలోకి వీరికి ప్రవేశం ఉందా! ప్రవేశం ఉన్న తెలుగు శాస్త్రవేత్తలకు మన వృత్తి పదకోశాలు, జానపద వేత్తల సేకరణ గూర్చి తెలుసా!! జీవ వైవిధ్య సదస్సులు, ఈ ఒప్పందాల అమలు సమీక్షించి దిశానిర్దేశం చేస్తాయి. అటువంటి సదస్సు ఒకటి పదేళ్ళక్రితం హైదరాబాద్‌లో జరిగింది..

పంచాయతీలో మొత్తం గ్రామాలను కొన్ని గ్రామసభల కింద వికేంద్రీకరించి, తగాదాలను సంప్రదాయ పద్ధతిలో తెలుసుకోటానికి పంచాయత్ రాజ్ చట్టం సవరించింది. వనరుల గుర్తింపు పూర్తి కాకుండా ఒడిశాలో వేదాంత కంపెనీ గనుల తవ్వకం చేపట్టరాదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. అన్రాక్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

50లలో వృత్తి పదకోశాలు





ప్రజా జీవ పట్టిక (పి.బి.ఆర్)

ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు అకాడమీ, దూలపల్లి

"మేము శిక్షణ ఇవ్వము - మారుస్తాము"

తయారుచేసిన భద్రిరాజు, చేరా, బూదరాజు, పోరంకి, గ్రామనామాల మీద పని చేసిన కేతు విశ్వనాథరెడ్డి 70లనుండి భాషను బోధనా భాషగా, అధికార భాషగా, పత్రికల భాషగా, గారపాటి అంతర్జాలానికి తగ్గట్టు, 'ఆధునికీకరించటం'లో, సాహిత్య వ్యాసంగంలో తలమునకలైపోయారు.

**'బందెలదొడ్డి'లో 'రేజీకటి' కమ్మిన తెలుగుజాతి**

'బ్రౌన్ నుంచి కే వి ఆర్ దాకా, కొమర్రాజునుంచి బూదరాజుదాకా వలస క్రైస్తవ మేధాస్థితి బాహ్యంగా ఆలోచనలు సాగలేదు అనిపిస్తుంది 'వలస మనస్తత్వం ఏకంగా ఆంధ్రజాతిని గొర్రెలమందవలె ఒక బందెల దొడ్డిలోకి తోలివేసిందా అనిపిస్తుంది' (ప్రియ శత్రువు ఎమెస్కో. 2009 డి.వెంకటరావు.పుట 20)' ఒక శతాబ్దం పైగా ప్రబలిన ఈ నయా రేచీకటిలో స్వైరం చేస్తుంది'(పుట15).

సుస్థిర ఒప్పందాల అమలుకు జరుగుతున్న ప్రయత్నాలలో, మన వృత్తి కోశ సంపాదకులు పట్టించుకోని జానపద శాస్త్రవేత్తలు చేసిన కృషిని కలుపుకొనిపోవటంలో ఎటువంటి ప్రయత్నం జరగటం లేదు. ఈ ఒప్పందాల అమలును ప్రభావితం చేయాలంటే, జీవభౌతిక, సామాజిక శాస్త్రాలతో పరిచయంతో పాటు, శాసన కార్యనిర్వాహకవ్యవస్థల మీద పట్టుండాలి. అంతర్జాతీయ పరిణామాలపట్ల ఆసక్తి ఉండాలి.

శాస్త్రజ్ఞులు తెలుగు పండితుల కృషిని లెక్కలోకి తీసుకోరు. సాహిత్యగాళ్ళకు శాస్త్రం అక్కరలేదు. తెలుగువారు పెద్ద పెద్ద స్థానాల్లో ఉన్నారు. వారిలో శాస్త్రవేత్తలు ఉన్నారు. కాని వారి ఆసక్తి శిష్టసాహిత్యానికే పరిమితం. మరి తెలుగు శాస్త్ర వారసత్వం ఎవరికి కావాలి? దాన్ని అంతర్జాతీయ వేదికల దృష్టికి ఎవరు తెస్తారు? ఈవేళ పాలేకర్ సహజ వ్యవసాయ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. మరి మన వృత్తిపదకోశాలను, జానపద విజ్ఞానాన్ని ఎవరైనా సంప్రదిస్తున్నారా ? **ఇంట గెలిచి రచ్చ గెలవాలి !!!.**' వృత్తి పదకోశాల విషయంలోనే కాక సామాజిక భాషాపరిశోధనలో కూడా తెలుగు అగ్రగామి భాష కావటం గర్వకారణం' (భాష, ఆధునిక దృక్పథం 1998. పోరంకి దక్షిణామూర్తి. పుట (52) అని జబ్బలు చరుచుకుంటే ఒరిగేదేమిటి?

తెలుగులో జరిగిన కృషిని, పరిమితులను మన పెద్దలే ఇలా పేర్కొన్నారు. ఒప్పుకున్నారు.

'భారతీయభాషలలో తెలుగుది ద్వితీయస్థానం. భాష తెలీకుండా సంస్కృతిని ఎవరూ అర్థం చేసుకోలేరు.' (భాష, సమాజం సంస్కృతి. భద్రిరాజు కృష్ణమూర్తి. పుట 169) 'విశ్వప్రపంచాన్ని ప్రకృతి, సంస్కృతి అని విభజించవొచ్చు, ఈ సంస్కృతిలో కొంతభాగం విశ్వజనీనమైనా, ఒక్కో సమాజం, ఒక్కో రకంగా తన సంస్కృతిని మలుచుకుంటుంది. (261)' 'తెలుగులో సాహిత్యమైనా శాస్త్రమైనా అంతర్జాతీయ స్థాయికి రాదగిన గుణం ఉంటేనే తెలుగు అంతర్జాతీయ భాష అవుతుంది. (170)'

'కొండభాషలో మాండలికభేదాలు విస్తృతంగా కనిపిస్తాయి.(81)' 'కొండ భాషాపదానికి అర్థం తెలుగువల్లనే చాలావరకు తెలుస్తుంది.(91)'

'తెలుగు భాషాశాస్త్రవేత్తలు ఆంగ్ల లింగ్విస్టులు కనుక తెలుగులో ఎక్కువ రాయరు.' (భాషానువర్తనం. చేకూరి రామారావు. ముందుమాటలో సీతారాం పుట 7 ని)

**'సాహిత్యం మానసికావసరం. భాష భౌతికావసరం.' (భాషానువర్తనం. చేకూరి రామారావు. పుట63)**

'అనువాద సిద్ధాంత పీఠాన్ని అభివృద్ధి చేయాలని, అది 'ప్రాగ్ సౌందర్య శాస్త్ర పితామహ తరహాలో ఉండాలని భద్రిరాజు కలలు కనేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర శాఖ ఏర్పరచిన మూడు శతాబ్దాల తరువాతకూడా, ఆ శాఖకు ఇతర సాహిత్య శాఖలకు మధ్య పరస్పరసంబంధం కొరవడినట్లు కనపడుతున్నది.(7)'

ప్రభుత్వం, విద్యాలయాలు, పరిశోధనలు, ప్రచారసాధనాలు అనేక పరిమితులమధ్య పనిచేస్తాయి. కాబట్టి వివిధరంగాలలో ఉన్న తెలుగుభాషోద్యమ కార్యకర్తలే అటు ప్రజలలోకి పోయి, ఇటు ప్రభుత్వ వేదికలలో చేరి, మార్గదర్శకపాత్ర వహిస్తూ అందరినీ గాడిలోకి తేవాలి.

'బతుకు తెరువులను, సహజవనరులను పట్టించుకోకుండా భాషను బతికించుకోలేం'

అ

డాక్టర్ రజనీ రెడ్డి .కె
93479 37444

# నాడీ జాలికావలయం లేదా డీప్ లెర్నింగ్ సహాయంతో యంత్రానువాదం: ఒక పరిశీలన

**యం**త్రానువాద పరిశోధనలలో ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న విధానం నాడీ జాలికావలయం (న్యూరల్ నెట్ వర్క్) లేదా లోతైన నేర్పుదల (డీప్ లెర్నింగ్) ఆధారంగా చేసే యంత్రానువాదం. దీనినే నాడీ యంత్రానువాదం (న్యూరల్ మెషీన్ ట్రాన్స్‌లేషన్) అనీ సంక్షిప్తంగా ఎన్. ఎమ్. టి. అనీ అంటారు. ఈ యంత్రానువాద విధానం మంచి ఫలితాలని కూడా ఇస్తోంది, అయితే ఈ విధానం మర్మం ఏమిటో, ఇది ఎలా పనిచేస్తుందో, ఇది వ్యాప్తిలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దీని నిర్మాణ వ్యవస్థలో ఎలాంటి మార్పులు జరిగాయో, ఆయా మార్పులు జరిగాక, ప్రస్తుతం దీని పనితీరు ఎలా ఉందో, ఫలితాలు ఎలా ఉన్నాయో, ఇక విదేశీ భాషలలో దీని ఉపయోగం ఎలా ఉందో, భారతీయ భాషలలో దీని ఉపయోగం ఎలా ఉందో అన్నీ ఈ పత్రంలో స్థూలంగా చర్చిద్దాం.

**పరిచయం:** యంత్రానువాదం ప్రాథమిక సమాచారం తెలుసుకునేందుకేగాక అనువాద ప్రక్రియలో కూడా ఎంతో తోడ్పడుతుంది. అందుకే ప్రస్తుత అనువాదకులు చాలా వరకు యంత్రానువాదం పైనే ఆధారపడుతున్నారు. వాళ్ల అభిప్రాయంలో, ప్రారంభం నుంచీ అనువాదం చేయడం కంటే, యంత్రానువాదం ద్వారా పొందిన అనువాదాన్ని సవరించడం వలన చాలా తొందరగా ఇంకా అంత కష్టపడకుండా అనువాదం పూర్తి అవుతుంది. అందుకే ఈ మధ్యకాలంలో యంత్రానువాద వాడకం ఎక్కువ అయ్యింది. యంత్రానువాద ఉపయోగాన్ని తెలుసుకున్న యంత్రానువాద పరిశోధకులు కూడా యంత్రానువాద వ్యవస్థల నుంచి సరైన అనువాదాన్ని పొందేందుకు ఎన్నో కొత్త కొత్త విధానాలని అవలంబిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ నాడీ జాలికావలయం ఆధారంతో చేసే యంత్రానువాద ప్రయత్నం కూడా.

**నేపథ్యం:** యంత్రానువాదం చరిత్రను ఒకసారి తిరిగి చూసినట్లైతే, 1949లో వారెన్ వీవర్ అందించిన ఒక వివరణ పత్రికలో ప్రతిపాదించిన యంత్రానువాదం అనే ఆలోచన అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ పత్రంలో వీవర్ యంత్రానువాద అవకాశాల రూపురేఖలను సమర్పించి ఇది సాధ్యమయ్యేందుకు విభిన్న పద్ధతులను సూచించారు. ఆ సూచనలలో యుద్ధ సమయంలో గూఢలిపి సాంకేతికతలు, సాంఖ్యిక పద్ధతులు, షానన్ సూచించిన ఇన్ఫర్మేషన్ థియరీ (సమాచార సిద్ధాంతం) ఇంకా "మానవ సమాచార ప్రసారానికి సాధారణ ఆధారమైన" భాషకు సంబంధించిన అంతర్నిహిత తర్కం అలాగే సార్వత్రిక లక్షణాల శోధన మొదలైనవి ఉన్నాయి. దీనితో ఎన్నో సంస్థలు ఈ రంగంలో పరిశోధనలు మొదలుపెట్టాయి, ఇక పరిశోధనలలో భాగంగా ఎన్నో పద్ధతులూ, విధానాలనూ అనుసరించాయి. ఆ పద్ధతులూ విధానాలలో ప్రధానమైనవి: నియమాలూ లేదా జ్ఞాన ఆధారిత విధానాలూ (రూల్ బేస్డ్ లేదా నాలెడ్జ్ బేస్డ్); సాంఖ్యిక యంత్రానువాదం (స్టాటిస్టికల్ మెషీన్ ట్రాన్స్‌లేషన్ – బ్రౌన్ బృందం,1990 ఇంకా కొయెన్ బృందం, 2003); సంకర యంత్రానువాదం (హైబ్రిడ్ మెషీన్ ట్రాన్స్‌లేషన్) ; నాడీ యంత్రానువాదం (న్యూరల్ మెషీన్ ట్రాన్స్‌లేషన్).

**నియమాలు లేదా జ్ఞాన ఆధారిత యంత్రానువాదం:** ఈ యంత్రానువాదంలో, అనువాదం చాలా వరకు భాషాశాస్త్ర జ్ఞానం పైన ఆధారపడి చేతితో రాసిన నియమాలూ లేదా సూత్రాల ఆధారంగా ఉంటుంది. ఈ వర్గంలోకి 1. దిశాత్మక వ్యవస్థ (డైరెక్ట్ సిస్టమ్): ఇందులో ఎగుబడి (ఇన్పుట్) వాక్యాలు నేరుగా దిగుబడి (అవుట్పుట్) వాక్యాలలోకి సమాంతరణం (మ్యాప్) చేయబడతాయి), 2. సూత్రాధార పరివర్తన యంత్రానువాద వ్యవస్థ (ఆర్.బి. ట్రాన్స్‌ఫర్ ఎమ్.టి. సిస్టమ్). ఈ వ్యవస్థలో వాక్యాలను పద, వాక్యనిర్మాణ సంబంధమైన విశ్లేషణను సూత్ర ప్రయోగాలతో అనువదించడానికి ఉపయోగిస్తారు), 3. భాషాంతర్వర్తన సూత్రాధార యంత్రానువాద వ్యవస్థ (ఇంటర్ లింగ్వల్ ఆర్బిఎమ్టి సిస్టమ్). ఇందులో ఏదైనా ఒక మూల భాషలోని వాక్యాన్ని దాని గుప్త ప్రాతినిధ్యంగా మార్చి దాన్ని లక్ష్యభాష లోకి సమాంతరణం (మ్యాప్) చేస్తారు. అయితే, రెండు భాషలలోని భేదాలను చేరాతల నియమాలతో నియంత్రించడం చాలా కష్టంగా భావించబడింది.

**సాంఖ్యిక యంత్రానువాదం:** సాంఖ్యిక యంత్రానువాదాన్ని (ఎస్.ఎమ్.టి.) బ్రౌన్ బృందం 1990 లో పరిచయం చేశారు. దీని నిర్మాణం, మూల భాషలోని ప్రతి వాక్యానికీ సంభావ్య అనువాదం లక్ష్య భాషలో ఉంటుంది అనే మౌలిక భావనతో జరిగింది. ఈ సాంఖ్యిక యంత్రానువాద శోధన రెండు స్థాయిలలో జరిగింది. ముందుగా పదం స్థాయిలో (వర్డ్ బేస్డ్ ఎస్.ఎమ్.టి.) పద ఆధారిత సాంఖ్యిక యంత్రానువాదం వ్యవస్థ నిర్మించబడింది. ఈ అనువాద నమూనాలో ఒక గుప్త సమలేఖన చరాంశం (హిడన్ అలైన్మెంట్ వేరియబుల్) పరిచయం చేయబడింది. అయితే, ఈ స్థాయి సాంఖ్యిక యంత్రానువాదంలో కారకాలు, లింగ బోధకాలు ఇంకా భిన్నార్థబోధక పదాలు మొదలైన వాటిని అనువదించడంలో కొంచెం అవకతవకలను కనబరుస్తుంది. ఇక రెండవది పదబంధ స్థాయిలో పదబంధ ఆధారిత సాంఖ్యిక యంత్రానువాదం. నియమాలు లేదా జ్ఞాన ఆధారిత యంత్రానువాద వ్యవస్థలా కాకుండా ఈ సాంఖ్యిక యంత్రానువాద వ్యవస్థ అనువాద ప్రక్రియను పదాల సమలేఖనం (వర్డ్ అలైన్మెంట్) లేదా పదబంధాలని నేరుగా సమాంతర పాఠ్యనిధుల (ప్యారలెల్ కార్పస్) నుంచి నేర్చుకుంటుంది.

**సంకరణ యంత్రానువాదం (హైబ్రిడ్ మెషీన్ ట్రాన్స్‌లేషన్):** ఈ యంత్రానువాదంలో రెండు యంత్రానువాద విధానాలు అనగా సాంఖ్యిక యంత్రానువాద విధానాలూ ఇంకా వాటి నియమాలూ లేదా జ్ఞాన

ఆధారిత యంత్రానువాద విధానాల కలయిక ఉంటుంది. ఈ యంత్రానువాద విధానంలో ముందుగా సాంఖ్యిక యంత్రానువాదం జరుగుతుంది, ఆపైన సాంఖ్యిక యంత్రానువాద వ్యవస్థ ఉత్పత్తి చేసిన అనువాదం సరిగ్గా లేదో వాటికి నియమాలు రాసి ఆ నియమాల ద్వారా అనువాదం తప్పులు లేకుండా వచ్చేటట్లు చేయడం జరుగుతుంది.

నాడీ జాలికావలయ యంత్రానువాదం (న్యూరల్ మషీన్ ట్రాన్స్‌లేషన్, ఎన్.ఎమ్.టి): నాడీ జాలికా వలయ యంత్రానువాద వ్యవస్థ కూడా సాంఖ్యిక యంత్రానువాద వ్యవస్థలా పదాల సమలేఖనం లేదా పదబంధాల నిగూఢ నిర్మాణాలని నేరుగా సమాంతర పాఠ్యనిధుల నుంచి నేర్చుకుంటుంది. అయితే, సాంఖ్యిక యంత్రానువాదంలో పదాల మధ్య ఉన్న సుదూర ఆశ్రయణలను (లాంగ్ డిస్టన్స్ డిపెండెన్సీస్) అనువదించడంలో విఫలమౌతుంది. కానీ, లోతైన నేర్పుదల (డీప్ లెర్నింగ్) రంగంలో పురోగతితో న్యూరల్ మషీన్ ట్రాన్స్‌లేషన్ ఒక కొత్త ఉదాహరణలా అవతరించి కనురెప్పపాటులో సాంఖ్యిక యంత్రానువాదం ప్రత్యేక స్థానాన్ని అందిపుచ్చుకుంది. ఇక ఈ నాడీ జాలికావలయ యంత్రానువాదం గురించి మరింత వివరంగా తెలుసుకుందాం,

**నేపథ్యం :** నాడీ జాలికావలయ యంత్రానువాదం (న్యూరల్ మషీన్ ట్రాన్స్‌లేషన్) యంత్రానువాదంలో ఒక కొత్త విధానం. సాంఖ్యిక యంత్రానువాద వివిధ విధానాలలో, సాంఖ్యిక యంత్రానువాద వ్యవస్థలు, శోధన సమయంలో ఒకవేళ ఎప్పుడూ చూడని ఒక కొత్త పదబంధం కనిపించినట్లైతే దానిని నేర్చుకోవడంలో చాలా వరకు అసమర్థతను ప్రదర్శిస్తాయి. ఇది ఇలా ఉండగా వివిధ భాషా విశ్లేషణ కార్యాలలో ఒక అక్షరం, పదం, వాక్యం వంటి భాషాశాస్త్ర అంశాల నిరంతర ప్రాతినిధ్యం (కంటిన్యువస్ రిప్రెజంటేషన్) మంచి ఫలితాలని ఇస్తుందని తేలడంతో, ఈ దిశగా యాషువా బాంజియో బృందం(2003) ప్రారంభ పరిశోధనా ప్రక్రియలు చేపట్టారు. బాంజియో బృందం నిర్దిష్ట సదిశాత్మక పదాలను (ఫిక్సడ్ డైమెన్షన్ వర్డ్ వెక్టర్లు) నాడీ జాలికా వలయంలో ఉపయోగించుతూ యంత్రానువాద వ్యవస్థ నమూనాని ప్రతిపాదించారు. ఇక కోల్బర్ట్ బృందం (2008) పదాల నిరంతర ప్రాతినిధ్యాన్నీ సూట్స్కీవర్ బృందం (2011) అక్షరాల నిరంతర ప్రాతినిధ్యాన్నీ ఎడ్వర్డ్ గ్రెఫెన్సైట్ బృందం (2011), సోచర్ బృందం(2010) ఇంకా కార్ల్ మోరిట్జ్ హర్మన్ బృందం (2013) పదబంధాలూ వాక్యాల నిరంతర ప్రాతినిధ్యాన్నీ ప్రతిపాదించారు.

కోహ్న్ బృందం (2003) ప్రతిపాదించిన పదబంధ ఆధారిత సాంఖ్యిక యంత్రానువాదం, యంత్రానువాద వ్యవస్థలో ఉపభాగాలైన భాషా నమూనాలకూ (లాంగ్వేజ్ మోడల్) ఇంకా అనువాద నమూనాలకూ (ట్రాన్స్‌లేషన్ మోడల్) వేరువేరుగా శిక్షణ ఇచ్చి యంత్రానువాద ప్రధాన సమస్యలను అధిగమించడానికి ప్రయత్నించారు. దీనికి విపరీతంగా న్యూరల్ మషీన్ ట్రాన్స్‌లేషన్ లో ఒక చివర నుంచి మరో చివరివరకు ఒకే విషయంలో నాడీ జాలికా వలయానికి శిక్షణ ఇచ్చి యంత్రానువాద సమస్యలని అధిగమించే లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నిస్తారు.

**ముగింపు:** యంత్రానువాద క్షేత్రంలో నాడీ జాలికా వలయం సహాయంతో యంత్రానువాదం మంచి ఫలితాలని ఇస్తోంది. ఈ యంత్రానువాద వ్యవస్థని తయారుచేయడానికి ఎన్నో పద్ధతులు ఉన్నాయి. ఒక్కొక్క సమస్యను పరిష్కరించడానికి ఒక్కొక్క పద్ధతిని అవలంబించవచ్చు. అయితే ఇక భారతీయ భాషలలో వనరుల కొరత కారణంగా చాలా భాషలలో పరిశోధనలు జరగలేదు, కొన్ని భాషలలో మాత్రమే పరిశోధనలు జరిగాయి. అందులో తెలుగూ, హిందీ, తమిళం, మొదలైనవి కొన్ని మాత్రమే.

ఈ వ్యాసరచయిత పోస్ట్ డాక్టోరల్ ఫెలో, ఐ.సి.ఎస్.ఎన్.ఆర్
హైదరాబాదు విశ్వవిద్యాలయం.




**అమ్మనుడి**లో ధారావాహికగా ప్రచురించిన
ఈ నవల **జగమునేలిన తెలుగు** పుస్తకంగా వెలువడి,
అందరి ప్రశంసలను అందుకొంటున్న రచన!
వెల: రూ. 200/-
ప్రతులకు: 1. తెలుగుజాతి (ట్రస్ట్)
8-386, జీవక భవనం, అంగలకుదురు(పోస్టు)
తెనాలి - 522 211, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ammanudi@gmail.com,
ఫోన్: 98480 16136 / 94404 48244
2. నవోదయ బుక్‌హౌస్ ఆర్యసమాజ్ రోడ్డు కాచీగూడ
హైదరాబాద్ - 500027.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# భాష ప్రమాదంలో ఉందని ఎలా గుర్తిస్తారు?-2

(గత సంచిక తరువాయి.....)

## ప్రమాదంలో ఉన్న భాషలకు దన్ను

ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా మనకొక వింత అనుభవం ఎదురవుతోంది. ఆర్థికంగా, రాజకీయంగా బలం లేని నుడులను మాట్లాడే సముదాయాల ప్రజలు తమ అమ్మనుడులను వదిలి ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్న నుడులను ఆదరించి పిల్లల పెంపకంలో, చదువుల్లో ఆ బలమైన పరాయి నుడుకి ప్రాధాన్యతను ఇస్తున్నారు.

ఈ భాషాపరంగా అల్పసంఖ్యాకులైన ప్రజల్లో తమ అమ్మనుడుల భవిష్యత్తును గురించి పలురకాల అభిప్రాయాలు బలంగా ఉన్నాయి. కొందరు తమ అమ్మనుడులు చెలామణీలో ఉన్న భాషకన్నా అధమం అనీ, మనుగడకు పనికిరాని నుడి అనీ నమ్ముతున్నారు. ఈ భావనను అల్పసంఖ్యాకుల్లో రప్పించేది మాత్రం బలమైన నుడులకు సంబంధించిన వ్యక్తులే. వారు అల్పసంఖ్యాక భాషా ప్రజలను మభ్యపెట్టో, అపోహలకు గురిచేసో, అవమానించో, లేదా భాషాపరమైన బల ప్రదర్శన చేసో ఇలాంటి భావనలను నాటుతున్నారు. అయితే అల్పసంఖ్యాక నుడుల ప్రజల్లో కూడా అక్కడక్కడా తమ భాషపై అభిమానం ఉన్న వ్యక్తులు కనబడతారు. వారు అధికసంఖ్యాకుల ఎత్తుగడలను తిప్పికొట్టి, వారసత్వంగా వస్తున్న నుడులను తమ అస్తిత్వానికి గుర్తుగా మార్చుకుంటున్నారు. వీరిలో కొందరు తమ అమ్మనుడులకు ఆర్థికంగా, రాజకీయంగా ప్రాధాన్యత వచ్చేలా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు కూడాను. ఇలాంటి కొద్ది మంది వ్యక్తులు ఆ అల్పసంఖ్యాకులున్న నుడులకు చిన్న చిన్న పనుల ద్వారా చాలా మేలు చేకూర్చవచ్చు. డేకేర్ సెంటర్(తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగానికి వెళ్ళేప్పుడు చంటిపిల్లలను ఉంచే ఆటపాటలు నేర్పే చిన్నపాటి బడి) లలో, బడులలో ఒకటీ అరా తరగతుల్లో లేదా కొత్త బడులను ఏర్పాటు చేసి అక్కడి తరగతుల్లో అ నుడులకు సంబంధించిన మౌఖిక కథలు, పాటలు మొదలగునవి నేర్పించవచ్చు.

ప్రభుత్వం నుంచి గానీ, అంతర్జాతీయ/జాతీయ/రాష్ట్రీయ సంస్థల నుంచి గానీ, స్వచ్ఛంద సంస్థల నుంచి గానీ బయట నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆయా సముదాయాల్లోని వ్యక్తులు ముందుకు వచ్చి తమ భుజాలపైకి నుడుల పరిరక్షణను తీసుకోకపోతే ఆ నుడులు ప్రమాదంలోకి వెళ్ళిపోతాయి. బయటి వ్యక్తుల/సంస్థల ప్రయత్నాలు పైపైవే. ప్రతి నుడి సముదాయంలో లోపలి నుంచి ప్రయత్నం లేనిదే నుడి పరిరక్షణ జరగదు.

నుడులు అంతరించిపోతున్నా లేదా సుసంపన్నం అవుతున్నా అందుకు కారణం ఆ నుడులోని వ్యక్తులే. బయటి వ్యక్తుల ప్రమేయం నామమాత్రమే. నుడుల నిపుణులు ఆయా అల్పసంఖ్యాక నుడుల సముదాయాలను సంప్రదించి, నుడులను పరిపుష్టం చేసే దిశగా పూర్తి సహకారం అందిస్తే, ఏ అమ్మనుడి అంతరించిపోదు. కానీ ఈ పిలుపు నుడి సముదాయం లోపలి నుంచి రావాలి. ఎంత పెద్ద నుడి నిపుణుడైనా సముదాయంలోని వ్యక్తుల భాషావరమైన అవసరాలను గుర్తించలేకపోవచ్చు.

ప్రమాదంలో ఉన్న నుడులకు సహాయం చేసే వ్యక్తుల్లో నుడి శాస్త్రవేత్తలున్నారు, ఉపాధ్యాయులున్నారు, స్వచ్ఛంద కార్యకర్తలూ ఉన్నారు. వీరందరూ కూడా మొదటగా నుడులను భద్రపరచడమే ధ్యేయంగా పని చేస్తారు. భాషలోని పదసంపద, పలుకుబడులు, విశేషాలు, విచిత్రాలు మొదలగు అంశాలను పుస్తకంగానో, పత్రంగానో, శ్రవ్యకంగానో, దృశ్యకంగానో రూపొందిస్తే భాషను పరిరక్షించినట్టే అన్నది వీరి ప్రాథమిక భావన. అలా సేకరించిన భాషా సమాచారానికి వ్యాఖ్యానాలు వ్రాయడం, విశ్లేషణ చేయడం తరువాతి పని. ఈ రెండవ అడుగు కొన్ని నుడులకు విస్తృతంగా, కొన్నిటికి తక్కువగా జరుగుతుంది. అసలు మొదటి అడుగు తరువాత, అంటే నుడి పదాల సేకరణ తరువాత అక్కడితోనే నుడులకు సంబంధించిన పరిశోధనలు ఆగిపోవటం ఎక్కువ. అసలు పదాల సేకరణ స్థాయి కూడా చేరని నుడుల కథ వేరే.

అలా విశ్లేషణ అయ్యాక ఆయా వనరులను ఉపయోగించి నిపుణులు చదువుల స్థాయిలో వనరులను రూపొందించడం మూడవ అడుగు. ఇక్కడ నుంచి అటు పరిశోధకుడికీ, ఇటు నుడి సముదాయానికి సమస్యలు మొదలవుతాయి. పరిశోధకుడు తనకు తెలిసిన విధానంలో సంప్రదాయంగా ఈ వనరులతో పాఠ్య సామగ్రి తయారు చేసి అది ఆ సముదాయానికి ఇస్తాడు. కానీ, చాలా సందర్భాలలో ఆ సముదాయానికి ఈ విధానంలో తమ భాషను మలిచి చెప్పడం నచ్చకపోవచ్చు. చదువుల్లో తమ నుడి ఎలా ఉండాలో నిర్ణయించే హక్కు ఆ సముదాయానికి ఉంది. పరిశోధకులు ఆ సముదాయంతో సంప్రదింపులు చేసుకుని మధ్యే మార్గంగా పాఠ్య ప్రణాలికలు రూపొందించాలి. అలానే పరిశోధనా ఫలితాల కీర్తిని పరిశోధకుడు ఆ సముదాయానికే వదిలేయాలి. ఆపై ఆ ప్రణాలికల పర్యవసానంగా భవిష్యత్తులో జరిగే మంచి లేదా చెడును ఆ నుడుల సముదాయమే స్వీకరించాలి. కానీ కీర్తి కండూతి వలన పరిశోధకులు ఈ చిన్ని విషయాలను పక్కకు తోసిపుచ్చి, కొన్ని సందర్భాల్లో ఆ నుడులకు మరింత ఎక్కువ ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నారు. ఇది మౌఖికంగా మాత్రమే ఉన్న భాషా సముదాయాల్లో మరింత ప్రమాదకరం అవ్వవచ్చు. లిపిబద్ధం కాని ఒక భాషని ఇప్పటికే అందుబాటులో ఉన్న ఒక లిపిలోకి బలవంతంగా పట్టించాలని ప్రయత్నిస్తే, ఆ మౌఖిక నుడిలోని పదసంపదకు నష్టం కలుగుతుంది.

మరొక పక్క పరిశోధకులు తమ పరిశోధనకు సంబంధించి నుడి

సముదాయం నుంచి కొన్ని అంశాలలో సహకారం ఆశిస్తారు. ఇవి ప్రధానంగా ఐదు:

1. ఆ నుడిలో ప్రాథమిక అవగాహన కోసం, చదువుల్లో ఆ నుడి ఎలా పరిణమిస్తుందో తెలుసుకోవడం కోసం పరిశోధకుడు తనను తాను మొదటగా ఆ నుడిలో ఒక విద్యార్థిగా మలుచుకొని, ఆ నుడి సముదాయ సభ్యులను గురువులుగా చేసుకుని ఆ నుడిని అభ్యసించాలి. ఆ పరిశోధకుడికి అనువుగా సముదాయ సభ్యులు తమ నుడులను అతడికి నేర్పాలి. ఒకసారి ఆ నుడులను నేర్చుకున్నాక పరిశోధకుడు ఆ నుడిలో ఆధునిక పద్ధతిలో రూపొందించిన పాఠ్య సామగ్రిని వినియోగించుకునే విధంగా ఆ భాషా సముదాయంలోని ఉపాధ్యాయులు ముందుకు రావాలి. నిజానికి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆ నుడి సముదాయ వ్యక్తులు నుడి బోధన,నుడినేర్పులోని మెళకువల విషయంలో తమ వైపు నుండి చాలా వరకూ పరిశోధకులకు సహాయం చేయగలరు.

2. ఏ భాషనైనా సుస్థిరంగా నిలపాలంటే ఆ భాషను విద్యా భాషగా మలచాలి. ఆ భాషలో చదువులను తేవాలి. అందుకు పరిశోధనా సంస్థలు ఏర్పాటు కావాలి. ఆ నుడులలో పాఠ్య సామగ్రి నిర్మాణం జరగాలి. అక్షరాస్యతే నుడులను కాపాడుతుంది.

3. జాతీయ స్థాయిలో ప్రతీ దేశం ఒక జాతీయ నుడి విధానాన్ని అమలు చేయాలి. ఆ నుడి విధానం బహుభాషత్వాన్ని గుర్తించి గౌరవించాలి. నుడుల పరిరక్షణకు చట్టాలు ఆ విధానం ద్వారా జరగాలి. ఈ నుడుల విధానంలో సామాజిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు, మానవతావాదులు, ఆయా నుడుల సముదాయ సభ్యులు భాగస్వాములు కావాలి.

4. నుడుల్లో చదువులకు విద్యా విధానాలు అనుకూలించాలి. చాలా దేశాల్లో విధాన పరంగా విద్యార్థులకు అమ్మనుడిలో చదువులు అన్న చట్టాలున్నప్పటికీ, ఏ దేశానికి ఆ దేశంలో అక్కడి ప్రజాదరణ పొందిన నుడుల్లోనే విద్య నడుస్తుంది. విద్యా విధానాలలో బలమైన చట్టాలు చేసి ఈ అతిక్రమణలకు కట్టుబాట్లు చేయాలి. ఈ విధాన లోపం ఎంత తీవ్రంగా ఉందంటే – యునెస్కో 1953 నుంచి సభ్య దేశాల్లో అమ్మనుడులో విద్య అమలుకు ఎప్పటికప్పుడు అభ్యర్థనలు చేస్తూనే ఉన్నా, దాదాపు 2000 వివిధ నుడులున్న ఆఫ్రికా దేశాల్లో 10 శాతం కన్నా తక్కువ నుడుల్లో మాత్రమే చదువులు అందుబాటులో ఉన్నాయి. ఈ పది శాతంలో ప్రమాదంలో ఉన్న భాషలు ఒక్కటి కూడా లేవు.

5. అల్పసంఖ్యాక నుడి సముదాయాల ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరిచి, వారి మానవహక్కులను గౌరవించాలి. అల్పసంఖ్యాక నుడుల సముదాయ ప్రజలు, నుడుముఖ్యంగా మౌఖిక భాషల సముదాయ ప్రజలు దాదాపుగా నిరక్షరాస్యులై, దయనీయ పరిస్థితుల్లో బ్రతుకుతారు. వారికి మౌలిక వసతులు కల్పించి, నుడులపరంగా సామాజిక వివక్ష జరుగుతుంటే దాన్ని గుర్తించి అరికట్టాలి.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా నుడుల రక్షణ ప్రపంచవ్యాప్త పర్యావరణ నిధి (WWF) వారు మొత్తం ప్రపంచాన్ని 900 పర్యావరణ ప్రాంతాలుగా విభజించారు. ఇందులో 238 (వీటిని గ్లోబల్ 200 ఈకో–రీజియన్స్ అంటారు) ప్రపంచ పర్యావరణానికి ఎంతో ముఖ్యమైనవిగా కూడా గుర్తించారు. ఈ గ్లోబల్ 200 ఈకో–రీజియన్ ప్రాంతాల్లో అల్పసంఖ్యాక నుడుల సముదాయాలు నివసిస్తాయి. ఆయా ప్రాంతాల పరిరక్షణకు సంబంధించిన సమాచారమంతా ఈ అల్పసంఖ్యాక నుడుల సముదాయాల ప్రజలు మాట్లాడే నుడుల్లో నిక్షిప్తమయి ఉంది. అందువలన పర్యావరణం కోసం పని చేసే పరిశోధకులలో కొందరు భాషావేత్తలుండటమో, లేదా పర్యావరణ పరిరక్షణకు పని చేసే జట్టులో నుడులశాస్త్రవేత్తలు కూడా సభ్యులుగా ఉండటమో జరగాలి. అప్పుడు ఆ ప్రాంతం గురించిన సమాచారం సేకరించడం, భద్రపరచడం సులభం. జీవవైవిధ్యం కేవలం జీవవైవిధ్యమే కాదు – అది జైవిక–సాంస్కృతిక–భాషా వైవిధ్యంగా అని శాస్త్రవేత్తలు గుర్తించాలి. ఇద్దరు శాస్త్రవేత్తలు – లుయిసా మఫ్ఫీ, మైకేల్ క్రౌస్ జీవసాంస్కృతిక వైవిధ్యంగా ఈ అంశాన్ని చెప్పి, మన భూమిని అట్మాస్ఫియర్, బయోస్ఫియర్, మొ౹౹లాగానే లోగోస్ఫియర్ (logosphere) అంటే భాషల వలయంగా చూడాలి అని సూచించారు.

**మరుగునపడిపోయిన నుడులను దక్కించుకోవటం**

ఇకపై మనుగడలో లేని నుడి, ఆ నుడిలో మాట్లాడేవారెవరూ లేరు, ఆ నుడులను పునరిద్ధరించలేము అనుకున్న నుడులను కూడా పూర్తి స్థాయిలో భద్రపరచాలి. ఎందుకంటే ప్రతి నుడిలో ప్రత్యేక సంస్కృతి, పర్యావరణ సమాచారం నిక్షిప్తమై ఉన్నాయని ముందే అనుకున్నాం కదా.

మరుగునపడిపోయిన నుడులను భద్రపరచడం ద్వారా కలిగే ప్రయోజనాలు:

1. ఈ నుడుల్లోని విషయాలు మానవ విజ్ఞానాన్ని మెరుగుపరుస్తాయి.

2. మనకిప్పటికే తెలీని ఎన్నో సాంస్కృతిక విషయాలు ఆ నుడిలో ఉండవచ్చు. అవి మనం ప్రపంచాన్ని చూసే దృష్టికోణాన్ని మరింత మెరుగు చేయవచ్చు.

3. ఈ నుడులను వదిలివెళ్ళిన సముదాయానికి పునరుద్ధరణ తరువాత నుడులపై అవగాహన కలిగి తిరిగి తమ సొంతం చేసుకునే అవకాశాలు ఎక్కువ. అలా ఒక మర్చిపోయిన సంస్కృతిని, భాషాపరమైన విజ్ఞాన నిధిని మనం తిరిగి పొందగలము.

(వచ్చే సంచికలో భాషల ప్రమాద స్థాయిని గుర్తించే విధానాన్ని గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం)

## న్యాయవాదుల త్రిభాషా నిఘంటువు

న్యాయవాదాల త్రిభాషా నిఘంటువు
(ఆంగ్లం–తెలుగు–హిందీ)ను
భారత ప్రభుత్వం
https://tinyurl.com/telugunyayanighantuvu
వద్ద విడుదల చేసింది. ఇందులో
1500 వరకూ న్యాయపరమైన
పదాలు ఉన్నాయి.

సి. వి. క్రిష్ణయ్య
93965 14554



# ఎవరు తెలివి గలవారు?! 5

**జరిగిన కథ:**

కోతి సహాయంతో అడవిలో బడి పెట్టుకున్నారు
జంతుపక్షిజనాలు. ఆ బడిలో పిల్లలకు అనేక
అనారోగ్యసమస్యలు వచ్చాయి.
తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు చెప్పే సమాధానాలు
అర్థంగాక అయోమయంలో పడ్డారు.
తరువాత కథ చదవండి

## దారితప్పిన చదువులు

**రోజూ** ఎవరో ఒకరు బడికి వస్తూనే ఉన్నారు. ఉపాధ్యాయులను ఏదో ఒకటి అడుగుతున్నారు. వారు చెప్పే సమాధానాలు అర్థంగాక జ్ఞానం అంటే ఇలాగే ఉంటుందేమోనని సరిపెట్టుకొని బడికి వెళ్లడం మానుకొన్నారు.

కాని బడిలో పరిస్థితులు రోజురోజుకు క్షీణిస్తున్నాయి.టీచర్ల మధ్య స్థానికులు స్థానికేతరులు అనే తేడాలు వచ్చి తగువులాడుకొన్నారు. ఈ తగవులు విద్యార్థులకూ పాకాయి. విద్యార్థుల నుండి బడి బయటి జనాల మధ్య చర్చలు వాదులాటలు జరిగాయి. అంతటితో ఆగలేదు. జాతుల మధ్య భేదాలు వచ్చాయి. పక్షులు వేరు జంతువులువేరని జంతువుల్లో మేం గొప్ప మీరు తక్కువ అనే మాటలు వచ్చాయి. ఇవన్నీ వింటున్న అడవిజనాలకు మతులుపోతున్నాయి. చదవేస్తే ఉన్న మతిపోయినట్లు ఈ చదువులు సకల జీవుల మధ్య సామరస్యం కలిగించకుండా విభేదాలు సృష్టించడం ఏమిటంటూ ఆశ్చర్యపోతున్నారు.

ఒక రోజు అంతా కట్టగట్టుకొని బడి పెట్టిన కోతి దగ్గరకెళ్ళారు. ఇవేమి చదువులంటూ కోతిని నిలదీసారు. “తెలివితేటలు పెరిగేకొద్దీ మొదట ఇలాగే కొట్టుకొంటారు. ప్రతి ఒక్కరిలో ఆత్మ మేలుకొంటుంది. తాము ఎవరికీ తక్కువ కారని తల ఎత్తుకొని తిరుగుతారు. అందుకే ఈ కొట్లాటలు అని చెప్పింది కోతి. “ప్రతి ఒక్కరు తల ఎత్తుకొని తిరగడానికీ నువ్వు తక్కువ నేను ఎక్కువ అని భావించడానికి సంబంధం కనిపించడంలేదు. ప్రతి ప్రాణి దేనికదే గొప్ప. ఎక్కువ తక్కువలు ఏమిటి? ఇదేమి జ్ఞానం” అని ప్రశ్నించారు. “మనుషుల్లో కూడా చదువుకొన్న వాళ్లు జాతులు, ప్రాంతాలు, మతాలు అంటూ కొట్టుకొంటున్నారు. యుద్ధాలు చేసుకొంటున్నారు. అంటే మనుషులమాదిరి మన అడవిజనాలు కూడా విజ్ఞాన వంతులవుతున్నారనే సూచనలు కనబడుతున్నాయి అంటూ సంతోషం వ్యక్తంచేసింది కోతి. ఈ తలతిక్క మాటలకు తిక్కరేగి జంతువులు తోకలు కొరుక్కొంటే పక్షులు ఈకలు పీక్కున్నాయి. అయినా బడిమీద ఆశ చావక ఆలోచించుకొంటూ వెనుతిరిగి ఇంటిదారి పట్టారు.

ఇంతలో ఉన్నట్లుండి అడవి చుట్టూ ఆకాశంలో నల్లని మేఘాలు కమ్మాయి. టపటపమంటూ చినుకులు రాలాయి. అవి తొలకరి చినుకులు. అందరూ, పరుగెత్తుకొంటూ పెద్ద చెట్టుకిందికి చేరారు.

ఎండిన నేలమీద పడ్డ ఆ తొలి వర్షపు చినుకులకు భూమాత శరీరం పులకరించింది. కమ్మటి మట్టివాసన అరణ్యమంతా వ్యాపించింది. ఆ వాసన పీల్చుకొన్న జంతు పక్షిజనాలు ఆనందంతో పరవశులయ్యారు. చినుకులు మరింత ఎక్కువయ్యాయి. చెట్ల ఆకుల సందుల నుండి పడుతున్న అ నీటిలో అంతా ఆనందంగా తడిసి పోతున్నారు. చెట్లు ఆకుల మీద ఇన్నాళ్లు పేరుకపోయిన దుమ్ము ధూళిని కడిగేసుకొన్నాయి. తలస్నానం చేసి కొత్త ఆకుపచ్చచీరలు కట్టుకొని ముస్తాబైన ముత్తైదువుల్లా చెట్లన్నీ పచ్చగా మెరిసిపోతున్నాయి. చెట్ల కింద ఎండి మగ్గిన ఆకులు తడిసి ఒక రకమైన మత్తుకల్గించే వాసన వచ్చింది. మట్టిలోపల ప్రాణాలు బిగబట్టుకొని కొనఊపిరితో ఉన్న వ్రేళ్లు, దుంపలు, గింజలు ఊపిరిపోసుకొని ఎప్పుడెప్పుడు మట్టిపొరలను చీల్చుకొని భూమి పైకి వద్దామా అని ఎదురు చూస్తున్నాయి. నేల మీద పడ్డ వాన నీటి చినుకులు కాలువలుకట్టి పాముల్లా పాకుతూ భూమిలోకి మాయమైపోతున్నాయి.

ఈ ప్రకృతి ఇంద్రజాలాన్ని సమస్త ప్రాణికోటి ఆనందంగా ఆస్వాదించింది. ఒక్క బడి మాత్రం దీన్ని చూడలేక గుడ్డిదైపోయింది. అది అక్షరాలతో కుస్తీపడుతున్నది. చదువుల పేరుతో ప్రకృతికీ, పరిసరాలకూ దూరమై వీళ్లు సంపాదించే విజ్ఞానం ఒకరకమైన అజ్ఞానమే. వారేమి పోగొట్టుకొంటున్నారో వారికి తెలియదు. ఇవి దారితప్పిన చదువులు.

వర్షం ఒక్కసారిగా ఆగింది. మేఘాలు చెల్లా చెదురై ఎండకాసింది. ఇంతలో రెండు పావురాలు ఎగురుకొంటూ వచ్చి వారి ముందు వాలాయి. రేపు బడిని ఇక్కడిజనాలను కలుసుకోడానికి చుక్కలగుర్రం, రంగుల చిలుక వస్తున్నట్లు కబురు అందించాయి.

మరునాడు బడిని శుభ్రం చేసి అలంకరించారు. అంతా బడిదగ్గరకొచ్చి అతిధులకోసం ఎదురుచూడసాగారు. చుక్కల గుర్రం గంభీరంగా నడిచి వచ్చింది. గుర్రం పక్కన దృఢకాయుడు ఆరడుగుల ఎత్తు ఉన్న ఒక మనిషి ఉన్నాడు. ఆ మనిషి భుజం మీద చిలుక



కూర్చుని ఉంది. ఈ మనిషిని చూసి అక్కడున్న జంతుపక్షిజనాలు ఆశ్చర్యపడ్డారు.

వారి ఆశ్చర్యాన్ని గమనించిన చిలుక "ఈ మనిషిమనకు మిత్రుడేగాని అపకారి కాదు. ఇక్కడికి పది పరుగుల దూరంలో ఉత్తరదిక్కున ఉన్న కొండలోయలో ఉంటున్నాడు. అంతరించిపోతున్న చెట్లజాతులను పశు పక్ష్యాదులను రక్షించడానికి కంకణం కట్టుకొన్నాడు. అంటూ వెంట వచ్చిన మనిషిని గురించి వివరించింది.

తర్వాత గుర్రం మాట్లాడింది. "ఈ బడిలో జరిగే సంగతులు ఎప్పటికప్పుడు మాకు తెలుస్తూనే ఉన్నాయి. పిల్లల్లో వచ్చిన మార్పులు తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన అంతా మేం వింటూనే ఉన్నాం. సమయం సందర్భం వచ్చినప్పుడు అన్నిటికీ సరైన పరిష్కారాలు దొరుకుతాయి. మీరు భయపడకండి. బడిసంగతి తర్వాత తేల్చుకొందాం. ముందుగా మనం వెంటనే తెలుసుకోవలసిన విషయాలున్నాయి. మనం నివశిస్తున్న ఈ ప్రాంతంలో యవ్వనాన్ని, మనుషుల జీవితకాలాన్ని, పెంచే ఔషధమొక్కలున్నాయని ప్రచారం జరుగుతున్నది. మనుషులు ఆ మొక్కలకోసం అడవిలోకి వస్తాన్నారు. మనం జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ మనుషులు వచ్చినప్పుడు అడవిలో ఏ జంతువుగాని పక్షిగాని వారికంట పడకుండా జాగ్రత్తపడాలి." అంటూ హెచ్చరించింది.

తర్వాత చిలుక మాట్లాడింది. "బడి సరైన జ్ఞానం ఇవ్వడం లేదనే మాట నిజం. దీనికి మొదటి కారణం తమ చుట్టూ జరుగుతున్న విషయాలను విస్మరించి ఎక్కడి సంగతులో ఎప్పటి సంగతులో తెలుసుకొంటూ ఉంటారు. ముందు మన చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించుకోడానికి ప్రయత్నిస్తూ గతంలో ఉన్నవిషయాలను అధ్యయనం చెయ్యాలి. గతంలోనుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి. గతంలో యుద్ధాలు చేసుకున్నారు. ఎంతో నష్టపోయారు. ఇప్పుడుకూడా యుద్ధాలు చేసుకొంటున్నారు. ఎంతో నష్టపోతున్నారు. ఏమి నేర్చుకొన్నారు? చదువు వేరు జీవితం వేరు కాకూడదు. ఇక్కడే మనుషులు చదుపుకొన్న చదువులకు జీవితాలకూ ఏ సంబంధం ఉండడం లేదు. దీనివల్ల మనుషులకే కాదు భూమి మీద అన్ని ప్రాణులకు కష్టం వచ్చింది. ఎందుకంటే మనిషి వివేకశీలి, క్రియాశీలి. మంచి జరిగినా కీడు జరిగినా అతనివల్లే.

ఇదిగో మీ ముందు నిలబడ్డ ఈ మనిషి తన వాళ్లందరూ అరణ్యాలను వదలి మైదానాలకు వెళ్లినా ఒక్కడే ఈ అరణ్యంలో నివశిస్తున్నాడు. ఇక్కడ నివసించే మనందరి గురించి తెలుసుకొంటున్నాడు. అతడు తెలుసుకొన్న విషయాలు ఏమిటో ఆయన ద్వారానే విందాం, అంటూ మనిషి వైపు చూసింది చిలుక.

మనిషి లేచి నిలబడ్డాడు. "నాకు ఎన్ని సంవత్సరాల వయస్సో నాకు తెలియదు. నేను అప్పుడప్పుడు మైదాన ప్రాంతంలో ఉన్నమనుషుల దగ్గరకెళ్లి నాకు కావలసిన వస్తువులు తెచ్చుకొంటూ ఉంటాను. అప్పుడు ఒక వైద్యుడు నా వెంట్రుకలు పళ్లూ చూసి నీవయస్సెంత అని అడిగాడు. నాకు తెలియదని చెప్పాను. ఆయన నన్ను రకరకాల పరీక్షలుచేసి తొంభై ఐదు అని చెప్పి చాలా మందిని పిలిచి నన్ను చూపించాడు. నేను ఏమి తింటానో ఎలా జీవిస్తున్నానో అడిగి తెలుసుకొన్నారు. అప్పుడు కొంతమంది నా బొమ్మలను తీసి

వారి వ్యాపారాలకు ప్రచారం చేసుకొన్నారు. నేను ఆరోగ్యంగా ఇంతకాలం జీవించడానికి ఈ అడవిలో ఉన్న ఔషధ మొక్కలే కారణం అని తాము ఆ మొక్కలను ఉపయోగించి మందు తయారు చేస్తామని తమ మందులు అమ్ముకొన్నారు. ఆ మొక్కకు ఏదో కొత్త పేరు పెట్టారు. జనం వేలంవెర్రిగా ఆ మొక్కకోసం అడవిలోకి వచ్చి గాలిస్తున్నారు. ఆ మొక్క ఆకులూ ప్రతిమందులో ఉన్నట్లు ప్రచారం చేసుకొంటున్నారు. ప్రజలకు వ్యాపారస్థులు తమ అబద్ధాలతో పిచ్చిపట్టిస్తున్నారు. జనం ఇది నిజమా అబద్ధమా అని ఆలోచించకుండా నమ్ముతున్నారు. నా ఆరోగ్యానికి కలుషితంగాని ఆహారం, కాలుష్యంలేని గాలి, వత్తిడి లేని జీవితం కారణం. కాని మనుషులు దీన్ని విస్మరించి మందుల వెంటబడి ఆరోగ్యంతోపాటు తమ కష్టార్జితాన్ని పోగొట్టుకొంటున్నారు.

నేను పసితనం నుండి ఈ అడవుల్లో తిరుగుతున్నాను ప్రతి చెట్టూ పుట్టా నాకు తెలుసు. ఇక్కడ నివసించే జంతువులు, పక్షులు, నాకు తెలుసు. డెబ్భైసంవత్సరాల క్రిందట ఉన్న చెట్ల జాతుల్లో సగం చెట్ల రకాలు ఇప్పుడు లేవు. అనేక పక్షి జాతులు, జంతువులు అంతరించాయి. వాటి వివారాలన్నీ మీకు తెలియజేస్తాను.

ఈ ప్రపంచంలో లక్షరకాల చెట్లు ఉన్నట్లు విన్నాను. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకం చెట్లు ఉంటాయి. వాటి ఆధారంగా అక్కడ ఆ పక్షులు జంతువులు జీవిస్తాయి. ఈ అడవుల్లో 135 రకాల చెట్లు ఉండేవి. టేకు, నిమ్మ, అల్లి, అందుగు, ఆరి, అశోక, బాదం, బాడిస, గనప, బిక్కి, బిల్లుడు, బీర, బొట్టవ, కోయ, బురగ, చందన, జాండ్ర, గార, చవక, చీకిరేని, నార, గిట్లంగి, గుగ్గిలం, గుమ్ముడు, గుంపెన, ఇరికి, ఎనుమద్ది, ఈత, జామ, జమ్మి, జాన, జీడి, యర్రచందనం, కానుగ, కరక్కాయి, కొండరావి, కొండటేకు, కొండ మంగ, కోవి, కలే(వాక్కాయి) కోయి, కుంకుడు, మద్ది, మామిడి, మందార, మారేడు, మర్రి, మెరుకుమ్మ, మోదుగు, ముష్టి, ముంత మామిడి, మునుకుడు, నాగరి, నక్కెర, నల్లబలుజు, నల్లతుమ్మ, తెల్ల తుమ్మ, నల్లవాలుడు, నీరుడు, నేరేడు, నీరుద్ది, తొగరు, పాల, పాలబరిక, ఎల్తూరు, పనస, పచ్చ బంటికారి, ఆరి, పచ్చారి, పెద్ద రేగు, పోనికి, పొగడ, పొన్న, పునుకు, రావి, మర్రి, జమ్మి, సోమి, సుంకేశర, తడ, తాడి, తాండ్ర, తంబ, వెదురు, వెలదుబ్బ, వేప, వెలగ, ఈడగ, ఉసిరిక, యేది, యెదిశ, యేలేది, వేప, ఎర్రవాలు, ఇంకా చాలా ఉన్నాయి. ప్రతి చెట్టుకు, ప్రతి తీగకు ఒక ప్రత్యేక లక్షణం ఉంది. కొన్ని ఆహారానికి, కొన్ని వైద్యానికి, కొన్ని నీడకు, కొన్ని ఇంటికి ఉపయోగపడతాయి. కొన్ని విషపు ఆకులూ, గింజలు, కాయలు ఉంటాయి. అవి తింటే చచ్చిపోతారు. ఏ ప్రాణి వాటిని ముట్టుకోదు. వాసన ద్వారా ఈ విషయం అర్థమైపోతుంది. ఇలాగే ఈ అడవుల్లో 120 రకాల జంతువులు నివశించేవి. ఇందులో సగానికి పైగా నశించిపోయాయి.

గండంగి, కొండముచ్చు, కోతి, దేవాంగపిల్లి, గబ్బిలం, కబోది, ఎలుగు, నీరుపిల్లి, పెద్దపులి, చిరుతపులి, ఇబ్బందిగండు, నెమలిపిల్లి, జంగుపిల్లి, కొర్నగండు, పునుగుపిల్లి, మానుపిల్లి, మెంటవ, ముంగీస, తోడేలు, నక్క, గుంటనక్క, రేచుకుక్క, ఉడత, ఎలుక, చుంబెలుక, ఎర్రెలుక, పంది కొక్కు, జాబిలిగాడు, సొరపుంజిగాడు, మెట్ట ఎలుక, ఏదు పంది, అడవి గోవు, తోడేలు, కొండచిలువ, నాచిన్నతనం లోనే సింహాలు కనిపించేవి. నాలుగురకాల జింకలుండేవి. ముప్పైజాతుల పాములుండేవి. ఒక్కొక్క దాని ప్రవర్తన ఒక్కొక రకంగా ఉంటుంది. వాటి ఉనికిని బట్టి ఎక్కడ ఏ పండ్లుంటాయో, ఎక్కడ నీళ్లుంటాయో తెలుసుకొనేవాళ్లం. వాటి శబ్దాలను అనుకరించి అరిచేవాళ్లం. బదులుగా అవి శబ్దం చేసేవి.

వెయ్యిరకాల కక్షులుండేవి ప్రతిదాని పేరు ముఖం నాకు తెలుసు. ఇప్పుడు వందరకాల పక్షులు కూడా లేవు. అవి కనిపించనందువల్ల ఇప్పుడు వాటి పేర్లుకూడా మరిచిపోయాను. ఎనిమిది రకాల గద్దలు, నాలుగు రకాల కాకులు, ముప్పైరకాల పావురాళ్లు, రకరకాల పిచ్చుకలు ఉండేవి. గుర్తున్న కొన్నిటి పేర్లు చెపుతాను.

బోరువ, నల్లబోరువ, తెల్లబోరువ, డేగ, బైరి డేగ, గాలి డేగ, సాలువ, గద్ద, ఇవన్నీ గద్దజాతి పక్షులు. కోకిల, కొంగ, గూడ కొంగ, గుడ్డి కొంగ, కాకి, మాలకాకి, కొండలదోసిగాడు, ఉడతగాడు, అడవినల్లగాడు, జుట్టుబైరిగాడు, పాములగాడు, కొండమీనుగాడు, అలబుడములిగాడు, తోకపిట్ట, నల్లంచిపిట్ట, గిజిగాడు, గరటాలవాడు, అడవిరామదాసు, బావుర పిట్ట, గుడ్లగూబ, పైడిగంటి, ఏడురకాల గుడ్లగూబలు, ఎనిమిది కరాల వాన కొవెలలు ఉండేవి. పాలపిట్ట, లకుముకిపిట్ట, ఇంకా చాలా రకాలు ఉన్నాయి. ఈ భూమి మీద హాయిగా ఆనందంగా జీవించాల్సిన ప్రాణులు అసలే లేకుండాపోవడం ఎంత అన్యాయం. ఇందుకు కారణం మనిషే అని చెప్పడానికి నేను సిగ్గుపడుతున్నాను. కంటికి కనిపించే ప్రతిదాని మీదా పెత్తనం చేస్తున్నాడు. కాని కంటికి కనిపించని మాయాజీవుల చేతిలో అతనికి ప్రమాదం పొంచి ఉంది. ఈ మాయాజీవుల నుంచి తప్పించుకోలేడు.

నేను మిమ్మల్ని హెచ్చరించడానికే వచ్చాను. మనుషులదగ్గర పెరిగిన పెంపుడు జంతువులు, పెంపుడు పక్షుల శరీరాలలో రోగ జీవులు ప్రవేశించి ఉండవచ్చు. వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనుషుల దగ్గర నుండి కొత్తగా వచ్చేవారిని జాగ్రత్తగా గమనించాలి,

ఈ భూమాతకు పుట్టిన బిడ్డలం. మనం బ్రతికినంతకాలం ఆరోగ్యంగా ఆనందంగా బ్రతుకుదాం. మనుషుల మాదిరి రోగాలతో బ్రతకకుండా జాగ్రత్తపడదాం. మైదాన ప్రాంతంలో మనుషులు తినే ఆహారాలను వాళ్లు వదిలిపారేసిన వాటిని తినకుండా జాగ్రత్తపడాలి. ఈ సంగతి అందరికి తెలియజేయండి. అడవి జనాలందరికి మేలు జరగాలని కోరుకొంటున్నాను అంటూ మనిషి తన మాటలను ముగించాడు.

---

*వచ్చే సంచికలో –"అడవిలో ఆటల ప్రదర్శనలు"*

పెండ్లిపిలుపులు, శుభాకాంక్షలు (గ్రీటింగ్ కార్డులు), గుర్తింపు చీట్లు (విజిటింగ్ కార్డులు), తెలుగులో వేద్దాం. అక్కర ఉంటేనే ఇంగ్లీషులో కూడా వేద్దాం.

రంగనాయకమ్మ

# పిల్లలకు ఎక్కాలు నేర్పడం ఎలా?-2

(గత సంచిక తరువాయి.....)

**పిల్లలకు ఎక్కాల్ని నేర్పే 'రెండో పద్ధతి':**

**మొ**దటి పద్ధతిలో, ఏ ఎక్కాని కైనా పట్టిక ఎలా వుంటుందో సరిగా అర్థం చేసుకున్నారా పిల్లలు? మొదటి పద్ధతిలో, ఎక్కాల పట్టికల్లో, నిలువు లైన్లూ, అడ్డం లైన్లూ, వుంటాయి కదా? అలాగే, ఈ రెండో పద్ధతిలో కూడా నిలువు లైన్లూ, అడ్డం లైన్లూ, వుంటాయి.

ఎక్కాల మొదటి పద్ధతి పట్టికకీ, ఈ రెండో పద్ధతి పట్టికకీ, ఏమైనా తేడాలు వుంటాయా?– ఆ తేడాలే లేకపోతే, రెండో రకం పద్ధతి ఎందుకు వస్తుంది? తేడాలతో చెప్పాలనుకున్న వాళ్ళే, రెండో పద్ధతిని తెచ్చారు.

**ఎక్కాల్ని నేర్పే 2వ పద్ధతిలో, 1వ ఎక్కానికి**
**చదివే విధానమూ, రాసే విధానమూ:**

| 1వ, నిలువు లైను **1** | 2వ, నిలువు లైను **2** | జవాబుల నిలువు లైను **3** |
|---|---|---|
| ఒక 1 **X** | ఒకటి 1 **=** | ఒకటి 1 |
| ఒక 1 **X** | రెండు 2 **=** | రెండు 2 |
| ఒక 1 **X** | మూడు 3 **=** | మూడు 3 |
| ఒక 1 **X** | నాలుగు 4 **=** | నాలుగు 4 |
| ఒక 1 **X** | ఐదు 5 **=** | ఐదు 5 |

ఈ రెండో పద్ధతిలో, 'పెద్ద తప్పు' వుంది. ఈ తప్పు ఏమిటో ఆలోచించండి!

రెండవ పద్ధతిలో, 2డో ఎక్కం పట్టికనీ, 3డో ఎక్కం పట్టికనీ కూడా చూస్తే, మొదటి పద్ధతికీ, రెండో పద్ధతికీ తేడాలేమిటో ఎక్కువ స్పష్టంగా తెలుస్తాయి.

రెండో పద్ధతిలో,

2డో ఎక్కాన్నీ, 3డో ఎక్కాన్నీ కూడా వరసగా, చదివే పద్ధతుల్ని చూడండి!

2వ ఎక్కం:

| | | | |
|---|---|---|---|
| రెండు 2**X** | ఒకట్లు 1,1 | రెండు **=** 2 | ఈ మొదటి లైనులో 2 జవాబు, ఎలా వచ్చింది? 2వ ఎక్కం నంబరుగా వున్న 2 వల్ల కాదు; 1ట్లు, 2 సార్లు కలవడం వల్ల వచ్చింది. 2డో ఎక్కం లో, 1ట్లు కలవడం ఏమిటి? |
| రెండు 2**X** | రెండులు 2,2 | నాలుగు **=** 4 | ఈ వరసలో, జవాబుగా 4 ఎలా వచ్చింది? పై జవాబుగా వున్న 2కి, ఎక్కం నంబరుగా వున్న 2 కలవడం వల్ల కాదు. 2, 2 సార్లు కలవడం వల్ల వచ్చింది. |
| రెండు 2**X**<br><br>రెండు 2**X** | మూడులు 3,3<br><br>నాలుగులు 4,4 | ఆరు **=** 6<br><br>ఎనిమిది **=** 8 | 6 ఎలా వచ్చింది? 3లు, 2 సార్లు కలవడం వల్ల. ఇది రెండో ఎక్కం. ఈ 2డో ఎక్కంలో, పైజవాబుకి, 2 కలవలి గానీ, 3, 3 కలవడం యేమిటి? 3కి 3 కలిస్తే ఇది 3డో ఎక్కం లో జరగాలి గానీ, 2డో ఎక్కంలో ఎలా జరుగుతుంది.<br><br>8 అయినా, 4, 4 కలిసే. 2డో ఎక్కం లో, ప్రతీ చోటా 2 కలవాలి. కానీ, 4,4 కలవడం యేమిటి? |
| రెండు 2**X** | ఐదులు 5,5 | పది **=** 10 | 10 అయినా, 5, 5 కలిసే. ఇది 5దో ఎక్కం లో జరిగేది 2డో ఎక్కం అవదు. దీన్ని చూస్తే, 2డో ఎక్కం లో పిల్లలకు ఏఁ తెలుస్తుంది? టీచర్లకే తెలీదు. పిల్లలకి ఏవి కలుస్తాయని చెపుతారు? |

ఈ రెండో పద్ధతిలో, ఎక్కాన్ని 'చదివే పద్ధతిలో' పెద్ద మార్పు జరిగింది. ఆ మార్పు ఏమిటో గమనించారా టీచర్లు?

రెండో పద్ధతిలో, చదివే పద్ధతి ఇలా మారింది. ఎలా అంటే,

పట్టికలో వుండవలిసిన, 1వ, 2వ నిలువు లైన్లు, తారుమారుగా, ఇది అటూ, అది ఇటూ, మారాయి. ఈ లైన్లు మారడం వల్ల, ఎక్కాన్ని చదివే విధానం మారిపోయింది. ఎందుకు మారింది?

ఎక్కం నంబరునే మొదటి నిలువు లైనుగా పెట్టాలనుకున్నారు, రెండో పద్ధతి వారు. అలా మార్చితే, ఎక్కాన్ని చదివే పద్ధతే మారుతుందని వారు గ్రహించలేదు. 'చదవడం ఎలా మారినా, ఎక్కం లో జవాబులన్నీ అవే వస్తున్నాయి కదా?' అంటారు వారు.

జవాబులు అవే వచ్చినా, ఆ జవాబులు ఏర్పడే అంకెల సంబంధాలు మారిపోతాయని వారు తెలుసుకోలేదు. సరైన సంబంధాలు మారిపోతే, తప్పు సంబంధాలు ఏర్పడతాయి!

రెండో పద్ధతి ప్రకారం రాసిన 2డో ఎక్కంలో, అడ్డం లైన్లలో, ఏఁ తప్పులు జరిగాయో చూడండి!

చదవడం లో మార్పు జరిగిన ఎక్కాన్ని, ఇక్కడ మళ్ళీ చూపిస్తాను. ప్రతీ అడ్డం లైను లోనూ ఏఁ జరిగిందో చూడాలి.

***

టీచరు, ఒక స్టూడెంటుతో, "3డో ఎక్కాన్ని, రెండో పద్ధతి ప్రకారం చదువు" అంటే?

**3డో ఎక్కాన్ని,**
**రెండో పద్ధతి ప్రకారం చదివితే:**

| | | |
|---|---|---|
| మూడు<br>3 X | ఒకట్లు<br>1,1,1 | మూడు<br>= 3 |
| మూడు<br>3 X | రెండులు<br>2,2,2 | ఆరు<br>= 6 |
| మూడు<br>3 X | మూడులు<br>3,3,3 | తొమ్మిది<br>= 9 |
| మూడు<br>3 X | నాలుగులు<br>4,4,4 | పన్నెండు<br>=12 |
| మూడు<br>3 X | ఐదులు<br>5,5,5 | పదిహేను<br>= 15 |

– ఇలా చదవాలి.

ఈ 3వ ఎక్కంలో అడ్డం లైన్లు, ఎక్కాలు ఏర్పడే తార్కిక పద్ధతి ప్రకారమే ఏర్పడ్డాయా? ఇది, 3డో ఎక్కం కాబట్టి, సరైన పద్ధతి అయితే ప్రతీ అడ్డం లైనులోనూ, పై జవాబుకి, 3 కలుస్తూ, ఎక్కం పెరగాలి. అలాగే జరిగిందా? ఒక్కొక్క లైనునీ చూడండి!

1వ అడ్డం లైనులో: ఇది, 3డో ఎక్కం. కాబట్టి, ఈ లైనులో జవాబుగా, 3 ఎలా వచ్చింది? '3 ఒకట్లు, మూడు' అని, ఒకట్లు 3 సార్లు 1,1,1 కలవడం వల్ల, 3 వచ్చింది. 3 ని 1ట్లు అని హెచ్చవేత పద్ధతిలో 3 వచ్చింది. సరైన ఎక్కం పద్ధతిలో అయితే, 'ఒక్క 3, మూడు' అనే ప్రకారం, 3 రావాలి. ఇలా రాలేదు.

2వ అడ్డం లైనులో: ఇది, 3డో ఎక్కం లో లైను. ఇక్కడ జవాబుగా, 6 ఎలా వచ్చింది? 3లు, 2 సార్లు కలిసి కాదు; 2డే, 3సార్లు కలిసి! 2 ఒ 3 గా గాక, 3ఒ 2 గా! 3డో ఎక్కం లో, 2లు ఎలా కలుస్తాయి?

**3వ అడ్డం లైనులో:** ఇది, 3డో ఎక్కం లో లైను. ఇక్కడ జవాబుగా, 9 ఎలా వచ్చింది? రెండో పద్ధతి ప్రకారం, 6కి 3 కలిసినట్టే కనపడుతోఁది. కానీ, అలా జరగలేదు. ఇటూ అటూ 3లు వుండడం వల్ల ఇలా కనపడుతోఁది. ప్రతీ ఎక్కం లోనూ, అదే నంబరు లైనులో ఇలా, తప్పు పద్ధతిలోనే జరుగుతుంది. అది, సరిగానే జరిగినట్టు కనపడుతుంది.

**4వ అడ్డం లైనులో:** ఇది 3డో ఎక్కం లో లైను. ఇక్కడ జవాబుగా, 12 ఎలా వచ్చింది? 9కి, 3 కలిసి కాదు. 4లు, 3సార్లు వున్నాయి. ఇది 3డో ఎక్కం కాబట్టి, ఈ ఎక్కాన్ని చదివే పద్ధతి, ఇక్కడ 4 ఒ 3 అని వుండాలి. ఇలా వుంటే, 9కి, 3 కలిసినట్టు వుంటుంది. ఇలా గాక, 3 ఒ 4 అని వుంటే, 4లు, 3సార్లు 4,4,4గా వుండి, 8కి, 4 కలిసి, 12 అయినట్టు జరిగింది. 3డో ఎక్కం లో, ప్రతి చోటా 3 కలవాలి గానీ, 4 కలవడం ఏమిటి? అసలు, <u>మూడు నాలుగులు</u>, 4,4,4,4, ఏమిటి?

**5వ అడ్డం లైనులో:** ఇది, 3డో ఎక్కంలో లైను. జవాబుగా 15ఎలా వచ్చింది? 12కి, 3 కలిసి కాదు. <u>మూడు 5,5,5</u> అని, 5లు 3 సార్లు కలిసి 15 అయ్యింది. 3డో ఎక్కంలో, 3కలవడం కనపడాలి గానీ, 5లు కలవడం ఏమిటి?

ఈ తప్పంతా ఎందుకు జరుగుతోఁది? ఎక్కాన్ని చదవడంలో తప్పు వల్ల. ఆ తప్పు ఎందుకు జరిగింది? ఎక్కం పట్టికలో, 1వ 2వ నిలువు లైన్లని, తారుమారుగా మార్చి పెట్టడం వల్ల. అడ్డం వరసల్లో ప్రతీ తప్పూ, ఎక్కాన్ని చదవడంలో మార్పు వల్లే జరిగింది.

3డో ఎక్కాన్ని తార్కికంగా (తర్కంతో) చదవడం అంటే,

| | | |
|---|---|---|
| ఒక<br>1 | మూడు<br>3 | మూడు<br>3 |
| రెండు<br>2 | మూడులు<br>3+3 | ఆరు<br>6 |
| ఐదు<br>5 | మూడులు<br>3,3,3,3+3 | పదిహేను<br>15 |

చదివే విధానం ఇలా వుంటేనే, ఎక్కంలో ప్రతీ లైను లోనూ, పై జవాబుకి చివర 3డే కలుస్తూ వుండేది. కానీ, అలా జరగలేదు.

ఎక్కం, ఎన్నో నంబరు ఎక్కం అయితే, ఆ నంబరు ఎక్కాన్నే మొదటి నిలువు లైనుగా మార్చడం వల్ల, ఎక్కాన్ని చదివే పద్ధతి మారిపోయి, తప్పుగా చదవడం ప్రారంభం అయింది.

**జవాబులు ఒకే రకం:**

ఎక్కాల్ని చదివే పద్ధతి తారుమారుగా మారినా, మొదటి పద్ధతిలోనూ, 2డో పద్ధతిలో కూడానూ, జవాబులు ఒకే రకంగా వచ్చాయి. జవాబుల్ని చూడండి! అని, రెండు పద్ధతుల్లోనూ, ఒకే రకంగా ఎందుకు వస్తున్నాయి?

కూడికల్లోనూ, హెచ్చవేతల్లోనూ, 2 అంకెల్ని తారుమారు చేసినా, ఒకే జవాబులు వస్తాయి.

2+3 = 5 |

3+2 = 5 | కూడికలో, అంకెలు
ఎటు మారినా జవాబులు ఒకటే.
2 X 3 = 6 |
3 X 2 = 6 | హెచ్చవేతలో అంకెలు
ఎటు మారినా జవాబు ఒకటే.

ఏ పద్ధతి అయినా జవాబులు ఒకటే – అని సరిపెట్టుకోవడమేనా? అలా చూస్తే, ఆ అంకెల 'సంబంధాలే' మారి పోతాయి. ఎలా మారిపోతాయో చూడండి!

ఎవరైనా ఒక చీపుర్ని కొనేటప్పుడు, ఒక చీపురు ధర, 5 అనుకుందాం. ఆ మనిషి 2 చీపుళ్ళని కొన్నప్పుడు, 2 ఐదులు, 2X 5 = 10 అవుతుంది. ధరని అలా లెక్క పెట్టకుండా, 5 రెండులు, 5 X 2, అని లెక్క పెడితే, దానికి కూడా జవాబు 10దే వస్తుంది. ఆ జవాబు కోసమే, లెక్కని అలా చెయ్యడం సరైనదేనా?

ఈ చీపుళ్ళ ఉదాహరణలో, 5 అంకెకీ, 2 అంకెకీ వున్న 'సంబంధం' ఏమిటి? 2 అనేది, చీపుళ్ళ సంఖ్య. 5 అనేది – చీపురు ధర. "2 చీపుళ్ళ ధర ఎంత?" అనే ప్రశ్నకి జవాబు చూడాలంటే, '2 ఐదులు' అని చూడవలిసిందే. 2 X 5 = 10 అని. ఇలా గాక, ఆ ధర కోసం, 5 X 2 = అని చూడవచ్చా? ఇలా చేస్తే, ఆ అంకెల సంబంధాలు ఏమిటి? లెక్కని ఇలా చేస్తే, 5 రెండులు, 2,2,2,2,2, అవుతాయి. చీపురు ఉదాహరణలో, 2లు, 5 సార్లు ఎందుకు? కొన్నది, కాదు. రెండేసి చీపుళ్ళ చొప్పున, 5 సార్లా? ఆ రకంగా 10 చీపుళ్ళా? కాదు. మరి, 2లు, 2,2,2,2,2, అని 5 సార్లు ఎందుకు? చీపుళ్ళ ధరని మాత్రమే లెక్క కట్టాలి. కాబట్టి, 2 X 5 = 10. ఈ ఉదాహరణలో, చీపుళ్ళ సంఖ్యకీ, చీపురు ధరకీ, ఇంత స్పష్టమైన సంబంధాలే కనపడాలి.

ఏ ఉదాహరణనీ చెప్పకుండా, కేవలం 2 అనీ, 5 అనీ, ఆ అంకెల్ని మాత్రమే ఇచ్చి, వాటితో కూడికని చెయ్యమన్నా, హెచ్చవేతని చెయ్యమన్నా, ఆ అంకెల్ని ఎలా పెట్టినా, 2+5 అన్నా, 5+2 అన్నా హెచ్చవేతలో కూడా ఆ అంకెల్ని తారుమారు చేసిపెట్టినా, ఏ తప్పూ వుండదు.

చీపుళ్ళు కొన్న మనిషి, వాటిని అమ్మిన మనిషికి, 1 చీపురు ధర 5 చొప్పున, 10 డబ్బు ఇచ్చింది. ఎన్ని చీపుళ్ళు కొన్నది? 10 లో ఎన్ని 5లు వుంటే, అన్ని చీపుళ్ళు. 10/5 = 2 చీపుళ్ళు. ఏ ప్రశ్నకి అయినా, 5 X 2 అని, 2లు, 5 సార్లు అని, వచ్చిందా? రాదు. ఇలా చూస్తే, ఈ లెక్కా, ఈ సంబంధాలూ, తప్పులై పోతాయి.

ఎక్కాల్ని నేర్పే రెండో పద్ధతిలో, ప్రతీ ఎక్కం లోనూ హెచ్చవేతల లెక్కలన్నీ, తారుమారుగానే వున్నాయి.

రెండో పద్ధతి వారు, 'హెచ్చవేతలంటే కంఠతాలు పట్టడం కదా? ఇవి, చాలా మంచివి. పిల్లలు ఇలాగే నేర్చుకోవాలి' – అంటారు.

ఈ 'ఎక్కాల కంఠతాల్ని' చూస్తే, కంఠతాలనేవి 'గొప్ప విద్యా మార్గం' అయినట్టే ఇప్పటి వారు భావిస్తున్నారు.

కంఠతాలు పట్టేస్తే, సంస్కృతం పద్యాలూ, ఇంగ్లీషు పద్యాలూ, భక్తి పాటలూ, అన్నీ వచ్చేస్తాయి. కానీ, వాటి అర్థాలు ఏ మాత్రమూ తెలియకుండా!

ఎక్కాల్ని, కంఠతా పట్టడాలతో నేర్చుకోడం ప్రారంభిస్తే, అంకెల సంబంధాలకి అర్థాలు తెలియకుండానే అవి, కేవలం గుర్తులుగా మాత్రమే మిగిలి పోతాయి.

***

**నేను,** ఈ ఎక్కాల విషయం మీద, 1991లో కూడా కొంత రాశాను. అది, 'తెలుగు నేర్పడం ఎలా?' అనే నా పుస్తకంలో వుంది. కానీ, ఎక్కాల గురించి అక్కడ రాసినది చాలా కొద్దిగానే, దాదాపు 2 పేజీలది. దాన్ని వివరంగా రాయాలనే అభిప్రాయం అప్పటి నించీ వుంది నాకు.

ఈ మధ్య , ఈ విషయం కోసం కొంత మంది టీచర్ల తోటీ, పిల్లల తోటీ కూడా మాట్లాడాను.

టీచర్లలో కొందరైతే, "అవును, నేను వెనకటి పద్ధతిలోనే చదివాను. అదే బాగుంటుంది నాకు. కానీ, అదెక్కడుంది ఇప్పుడు? ఎక్కాల పుస్తకాలన్నీ రెండో పద్ధతి లోనే వుంటున్నాయి. అదే రకంగా పిల్లలతో చదివిస్తున్నాం" అన్నారు.

ఇద్దరు టీచర్లయితే, "నేను రెండో పద్ధతిలోనే చదివాను. హెచ్చవేతలతో జవాబు చక చకా వచ్చేస్తుందిగా?" అన్నారు.

ఇక, పిల్లలైతే, పెద్ద పిల్లలు కూడా,"కంఠతాలు కష్టమే గానీ, గట్టిగా పట్టేస్తే, ఎప్పుడే జవాబు కావాలంటే అది దొరుగుతుంది. 6 X 9, లేదా 9 X 8 కావాలంటే, కంఠతా లేకపోతే జవాబు వచ్చేది ఎలాగ?" అన్నారు.

ఈ నాటి 60 ఏళ్ళాయన, తన చిన్న తనాన్ని ఇలా చెప్పారు: "నాకు గుర్తే. ఒక సారి చిన్నప్పుడు టీచరు గారు, నన్ను 2డో ఎక్కం అప్పజెప్పమంటే, నేను ఆలోచిస్తూ, 2,ల4,ల6,ల8,లఇలా చెపుతున్నాను. ఆ మేష్టారు, 'ఒరే వెధవా! ఎక్కాన్ని కంఠతా పట్టకుండా, ఆలోచనలు చేస్తున్నావా, ఆలోచనలు? రేపటికి, 3డో ఎక్కాన్ని అందరూ కంఠతా పట్టండి!' అన్నారు. ఇంక కంఠతాలే చేశాం. మా ఆలోచనలే పోయాయి" అన్నారు.

ఈ కాలపు యువతి ఒక అమ్మాయి అయితే, 'రెండో పద్ధతికేం? ఎవరిష్టం వాళ్ళదీ! జవాబులు అవేగా?' అంది.

ఇలా చెప్పిన వాళ్ళల్లో కొందరు ఆంధ్రా ప్రాంతంలో చదివిన వారూ, కొందరు ఇతర ప్రాంతాల్లో చదివిన వారూనూ.

మొత్తానికి, ఆంధ్రా ప్రాంతంలో కూడా ఇప్పుడు రెండో పద్ధతి లోనే ఎక్కాల చదువు వున్నట్టు చెప్పారు. ఏదో కొత్త పద్ధతులు తేవాలని వంకర టింకర ఆలోచనలు చేస్తూ వుంటారు మేధావుల్లో ఎవరో!

గతంలో, నేను 'తెలుగు నేర్పడం ఎలా?' అని రాసింది తెలుగు అక్షరాల్నీ, మాటల్నీ నేర్పడం మీద. అక్షరాలనేవి 'శబ్దాల' వరసలో (శబ్ద సామ్యంతో) వుండ వలిసినవి. కానీ, కొందరు ప్రొఫెసర్లు బైల్దేరి, అక్షరాలు, అక్షరాల 'ఆకారాల' వరసలో (రూప సామ్యంతో) వుండాలని మొదలు పెట్టారు. ఒక ప్రొఫెసరైతే, 'క' అనే అక్షరాన్ని, ఏ ఇతర అక్షరాల తోటీ చేర్చ లేదు. 'క' రూపం, ఏ ఇతర అక్షరాల రూపాల తోటీ కలవదట! అందుకని, దాన్ని తన వ్యాసంలో చిట్ట చివరికి పెట్టారు. 'కాకి' అనే మాట అంత చివర్లో వచ్చింది. ఆ మాట కన్నా ముందు, 'పెళ్ళి, పళ్ళెం, తాళం, గొళ్ళెం' లాంటి మాటలన్నీ వచ్చాయి! అంటే, అక్షరాల్ని నేర్చుకునే, 1టో తరగతి పిల్లలు, 'పళ్ళెం, గొళ్ళెం' లాంటి

**తరువాయి 45వ పుటలో....**

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (13)



అబ్రహం గ్రియర్సన్

**భా**షించేది భాష "భాష్యతే ఇతి భాషా" అనేది నానుడి. భావ వ్యక్తీకరణమే భాష. మానవ జాతికి మాత్రమే పరిమితమైనది భాష. ప్రపంచ వ్యాప్తంగా వేలాది భాషలు వినిమయంలోవున్నాయి. అందులో అతి తక్కువగా మాట్లాడే భాషలు అంతరించి పోతున్నాయి. కొన్ని భాషలు కేవలం పరిమితమైన సందర్భాలలో వినియోగంలో ఉన్నందువల్ల కాలక్రమేణా అవి మృత భాషలవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నేడు జనాభా 800 కోట్లకు దగ్గరగా ఉంది. ప్రపంచంలో మొత్తం 195 దేశాలున్నాయంటారు. ఆఫ్రికాలో 54, ఆసియాలో 48, యూరప్‌లో 44, లాటిన్ అమెరికాలో 33, ఓసియాన 14, నార్త్ అమెరికా 02 మొత్తం 195. ప్రపంచ వ్యాప్తంగా 7000ల భాషలున్నాయని అంచనా. ప్రారంభంలో ఒకే భాష ఉందని కాలక్రమేణా అనేక భాషలు ఉత్పన్నమయ్యాయని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. ఒకే భాష ఉన్నప్పుడు ఏక మూల భాషా వాదం అని, బహు భాషలయిన తర్వాత బహుమూల భాషావాదం అని సిద్ధాంతం. దీనికి ఉదాహరణగా బైబిల్ లోని ఒక ఘటన ఉటంకిస్తారు.

"క్రీస్తుపూర్వం 3500-3000 ప్రాంతంలో బాబిలోనియాకు ఉత్తరంగా బోర్సిప్పాలో భూమికి ఆకాశానికి (స్వర్గానికి) ఒక భారీ నిర్మాణం చేపట్టారు. ఇది 325 అడుగుల ఎత్తు వరకు నిర్మాణం జరిగింది. ఐతే ఈ నిర్మాణం దైవసృష్టికి వ్యతిరేకంగా ఉన్నందువల్ల నిర్మాణ సమయంలో కార్మికుల భాషలు తారుమారై ఎవరు ఏ పని చేస్తున్నారో అర్థం కాక అర్థాంతరంగా ఆ నిర్మాణం ఆగిందని బైబిల్ ఆదికాండం 11-1-9లో ఉంది. ఇక్కడ నిర్మాణానికి సంబంధించిన కొన్ని వివరాలు లభిస్తున్నాయి. మట్టితో చేసి కాల్చిన ఇటుకలు ఆనాటినుంచి ఉన్నాయి. ఇటుకల మధ్య అంటించడానికి మోర్తార్ అనే జిగురు పదార్థం (మన సిమెంట్ లాంటిది)వాడినట్టు తెలుస్తుంది. (ఇదే మోర్తార్ పిరమిడ్ నిర్మించే భారీ రాళ్ళకు వాడారు. భూభాగంలో 8 టన్నుల రాయి, శిఖరాగ్రంలో 1 టన్ను రాయిని వాడినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. ఈ వ్యాస రచయితం స్వయంగా తిలకించి సేకరించిన ఆధారం. ఈ వివరాలు కేవలం అవగాహనకు మాత్రమే పొందుపరచడం జరిగింది.)

ప్రపంచంలో భాష ఎలా పుట్టింది? ఎక్కడ పుట్టిందనే చర్చ చరిత్రకందని విషయం. దీని విషయం ఎందరో శాస్త్రజ్ఞులు వివిధ వాదాలు, వివరాలు, విశేషాలు చేశారు. ఆడంస్మిత్ అనే పండితుడు భాషోత్పత్తి వాదాలను సమీకరించాడు. వీటిని సూక్ష్మంగా 1.దేవదత్త వాదం 2. బౌ వౌ వాదం 3. డింగ్ డాంగ్ వాదం 4. పూ పూ వాదం 5. యొ-హే-హూ వాదం 6. ధాతువాదం 7. సంగీత వాదం 8. సంవర్ధవాదం 9. క్రమ పరిణామ వికాస వాదం 10. సంపాదనా వాదం 11. సంజ్ఞవాదం 12. స్వతస్సిద్ధ వాదం అని వేర్వేరు పేర్లతో భాషోత్పతి మూలాలు అన్వేషించ ప్రయత్నించాడు. అనాదిగా భాష ఉత్పత్తి వివిధ క్రమ వికాస పరిణామాన్ని తత్వజ్ఞులు, జిజ్ఞాసువులు, పండితులు అన్వేషిస్తూనే ఉన్నారు. అలా ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన వేలాది భాషలు, వేలాదిగా రూపుదిద్దుకున్న సంస్కృతీ సంప్రదాయాలు అనూచానంగా వస్తూనే ఉన్నాయి.

భారత దేశం స్థూలంగా రెండు భాగాలు 1. ఉత్తర భారత దేశం 2. దక్షిణ భారతదేశం. ఉత్తర దక్షిణ భారతదేశమంతా వేలాది బాషలు విస్తరించి ఉన్నాయి. భారతీయ భాషలు ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా మాట్లాడుతూనే ఉన్నారు. ఇన్ని భాషలు చెల్లాచెదురుగా ఉన్నవాటికి ఒక రూపం కల్పించ ఉద్దేశించి వాటిని ప్రాంతాల వారిగ విభజించి ఒక రూపం ఏర్పరిచినవారు పాశ్చాత్యులే. భాషల పుట్టుకను బట్టి వాటిని వివిధ కుటుంబాలుగా నిర్ణయించడం ఒక పద్ధతి. ఈ పద్ధతిని వంశానుగుణ వర్గీకరణ లేదా జాత్యాశ్రిత వర్గీకరణ Geneaolgical classificaiton అనిఅంటారు. దీన్నే భాషా చారిత్రక వర్గీకరణ Historical classificaiton అని కూడా అంటారు. ఇలా భాషలోని పద, పదాంగ నిర్మాణం లేదా వ్యాకరణాంశ నిర్మాణాన్ని బట్టి భాషలు వర్గీకరించడం మరో పద్ధతి. దీన్ని పదాంశ వర్గీకరణం లేదా రూపాశ్రిత వర్గీకరణం Morphological or typological classificaiton అనికూడా అంటారు. ఈ పద్ధతులన్ని ఆయా భాషల సారూప్యాన్ని బేధాలను భాషల్లోని మూలాలను అన్వేషించి వర్గీకరించినా ఏదీ సమగ్రం కాదు.

హిందార్య భాషల్లో చాలా ప్రాచీనమైనది వైదిక సంస్కృతం అని అంటారు. వేదాలలో అతి ప్రాచీనమైనది ఋగ్వేదం. ఇది క్రీ.పూ. 1500 ప్రాంతానిదని ఒక నిర్ధారణ. ఒకనాడు వేదాలు విని వల్లెవేసేవారు. అందువల్ల వీటిని శ్రుతులు అన్నారు. తొలి లిఖిత గ్రంథం యాస్కుని నిరుక్తం. భారతీయ చతుర్వేదాలైన ఋగ్వేదం, యజుర్వేదం, అధర్వణ వేదం, సామవేదాలకు వివరణ గ్రంథాలుగా బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు వచ్చాయి. భారతీయ భాషా చరిత్ర అత్యంత ఆసక్తి కరమైన, అద్భుతమైన విషయ వివరణకు బహు భాషా గ్రంథాలు

నేడు లభ్యమవుతున్నాయి. భారతీయ భాషా చరిత్రను జాతుల, నాగరిక, అనాగరిక మూలాలను అన్వేషించి వాటిని ప్రాంతాల వారిగ విభజించి గ్రంథస్తం చేసినవారిలో సర్ జార్జ్ అబ్రహాంగ్రియార్సన్ మహాశయుడిని ముఖ్యంగా పేర్కొనాలి. ఈయన సేకరించి గుదికూర్చి 11 సంపుటాలుగా ముద్రించి Linguistic Survey of India ని ప్రచురించాడు. 30 సంవత్సరాలు శ్రమించి భారతీయ భాషలను వర్గీకరించిన ఖ్యాతి గ్రియర్సన్‌కే దక్కుతుంది. సర్ జార్జ్ అబ్రహాం గ్రియర్సన్ (Sir George Abraham Grierson) (7-1-1851 - 9-3-1941) ఐర్లాండ్ దేశంలోని డబ్లిన్ సమీపంలోని గ్లీనాగరి అనే గ్రామంలో జార్జ్ గ్రియర్సన్, ఇజబెల్లాకు జనవరి 7 వతేది 1851లో జన్మించాడు. తండ్రి వృత్తిరీత్యా ముద్రాపకుడు, ప్రచురణకర్త. స్వంత ప్రెస్ ఉంది. డబ్లిన్ ప్రింటర్స్ అని ప్రసిద్ధి చెందిన ప్రచురణ సంస్థకు అధిపతి. ఆది నుంచి స్థితిమంతుల కుటుంబమే. బాల్యంలో సెయింట్ బీన్ స్కూల్‌లో ప్రారంభమయ్యిన విద్య 13 సంవత్సరాలు వచ్చేసరికి ష్రూబెర్రి (Shrewberry) పాఠశాలలో చదివాడు. డబ్లిన్‌లోనే ప్రతిష్ఠాత్మకమైన ట్రినిటీ కళాశాలలో లెక్కలు ప్రత్యేకాంశంగా స్వీకరించి అత్యుత్తమ విద్యార్థిగా వెలిగాడు. కళాశాల విద్యలో ఉన్నపుడే ప్రాచ్య భాషల విభాగాధిపతి అయిన రాబర్ట్ అట్కిన్సన్ (Robert Atkinson)ప్రభావంతో సంస్కృతం హిందుస్థానీ భాషలు నేర్చుకున్నాడు. చదివే రోజుల్లోనే సంస్కృత భాషపై మక్కువ ఏర్పరుచుకున్నాడు. విద్యార్థి దశలోనే సంస్కృత భాషాధ్యయనంలో సర్వ ప్రథముడిగా గెలిచి బహుమతులుందుకున్నాడు. భాషలపై మక్కువతోను, లెక్కలపై ఉన్న అధ్యయనం వల్ల ఇండియన్ సివిల్ సర్వీసులో 1871 వ సంవత్సరంలో ప్రథముడిగా ఎంపికయ్యాడు. అన్ని పరీక్షలు నెగ్గి 1873 నాటికి బీహార్ లోని బన్కిపూర్ (Bankipore), పాట్నా కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ గా నియమితుడయ్యాడు. 1880లో డబ్లిన్‌లో డాక్టర్ గా పనిచేస్తున్న మారిస్ హెన్రీఫిజ్జరాల్డ్ కాలిస్ కుమార్తె అయిన లూసీ ఎలిజిబెత్ జీన్‌ని వివాహం చేసుకున్నాడు. లభించిన ఆధారాలను బట్టి గ్రియర్సన్‌కు పిల్లలు కలగలేదు. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే గ్రియర్సన్ కలెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్నాడు. ప్రజలతో మమేకమై వారి సాధక బాధలు తెలుసుకునేవాడు. అదే సమయంలో ఆప్రాంత భాషలు మాండలికాలు, సమీప కొండ జాతుల జీవన విధానం తెలుసుకున్నాడు. గ్రియర్సన్‌కి భారతీయ భాషలపై ఉన్న ఆసక్తిని తెలుసుకున్న ప్రభుత్వం 1886లో వియన్నాలో జరిగిన ప్రాచ్య భాషల సదస్సు (Oriental congress)కి భారతదేశ ప్రతినిధిగా పంపించింది. రాయల్ ఏషియాటిక్ సొసైటీ పక్షాన డాక్టర్ తియోడార్ డ్యూక్, ఆల్బర్ట్ టెరియన్ డి లాకోవేరి, సిసిల్ థిండాల్, ఆర్.ఎన్. కుస్ట్, అనేవారితో కలిసి భారతదేశంలో ఉన్న భాషలను అధ్యయనం చేసి, 'లింగ్విస్టిక్ సర్వే' నిర్వహించాలనే ప్రతిపాదన చేశాడు. భారతీయ భాషల సర్వేకి అవసరమైన సహాయ సహకారాలు మాక్స్ ముల్లర్, మెనియర్ విలియమ్స్, కారల్ భూలర్ అనేవారితో కలిసి చేయవలసిందిగా బ్రిటీష్ ప్రభుత్వం నియమించింది. 1898 నాటికి గ్రియర్సన్ నేతృత్వంలో లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా అనే నూతన సంస్థ ఏర్పాటయ్యింది. ఈ బృహత్తర ప్రణాళికకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించింది. ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక సిబ్బందిని గ్రామగ్రామాల్లో పర్యటించడానికి భాషల సేకరణకు అవసరమైన దేశీయ పండితులను ప్రాంతీయ సహాయకులను నియమించింది. 30 సంవత్సరాల నిర్విరామ కృషి వల్ల భారతదేశమంతా పర్యటించి భాషలు, మాండలికాల సేకరణతో పాటు లిపిలేని భాషలు, కొన్ని సందర్భాల్లో పేరు తెలియని భాషలు సయితం సేకరించి, రోమన్ లిపిలో గ్రంథస్తం చేశాడు. 1928 మే 8న లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా సంపుటాల వివరణ ఐర్లాండ్‌లో లార్డ్ బిర్కన్ హెడ్ ఆధ్వర్యంలో రాయల్ ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ సహకారంతో క్రిటీరియన్ రెస్టరెంట్ లో ఏర్పరచిన సభలో వివరించాడు.

గ్రియర్సన్ తన జీవిత కాలంలో ఎన్నో గ్రంథాలు, రచనలు చేశాడు. హిందీ భాష సాహిత్యంపై ఎంతో విలువైన సమాచారం సేకరించి ముద్రించాడు. భారతీయ భక్తి సాహిత్యంపై ఎనలేని మక్కువ చూపాడు. అద్వైత వేదాంతం సాహిత్యం పై వచ్చిన గ్రంథ సేకరణ గావించి ప్రచురించాడు. బీహారి వ్యాకరణంతో పాటు మాండలికాలు 3 గ్రంథాలుగా 1883-87 ప్రాంతాలలో ప్రచురించాడు. 1916లో కాశ్మీరి నిఘంటువును కూడా ప్రచురించాడు. రాజపుట్ ప్రాంత వీరుల వీరోచిత గాథలను గ్రంథస్తం చేశాడు. ఇది 1923 నాటికి అచ్చయింది. కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా లభించినంతవరకు ఆయా ప్రాంత వీరులు శూరుల గాథలను మౌఖికంగా ఉన్న జానపద వాఙ్మయాన్ని గ్రంథస్థం చేసి ముద్రించాడు. గ్రియర్సన్ కి విశ్వవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా 11 సంపుటాల విభజన ఈ విధంగా ఉంది.

గ్రియర్సన్ 1898 నుంచి 1928 వరకు ప్రచురించిన సంపుటాలు. I. తొలిభాగం - పరిచయం - సంపూర్ణ వివరణ - భారతీయ భాషల తులనాత్మక పదజాలం. II. సోమ - ఖైబర్ - తాయ్ కుటుంబాలు III. హిమాలయమాండలికాలు, ఉత్తర అస్సాం సమూహాలు - టిబెట్ - బర్మన్ భాషలు - బోడో- నాగ- కొచ్చిన్ భాషల సమూహాలు -కుకి - చిన్ - బర్మా సమూహాలు - టిబెట్ బర్మన్ భాషలు IV. ముండా - ద్రావిడ భాషలు V. ఇండో ఆర్యన్ భాషలు - తూర్పు సమూహాలు 1. బెంగాలి - అస్సామి 2. బీహారి - ఒరియా VI. ఇండో ఆర్యన్ భాషలు - మధ్యవర్తి సమూహం - తూర్పు హిందీ VII. ఇండో ఆర్యన్ భాషలు - దక్షిణ సమూహం - మరాఠి VIII. ఇండో ఆర్యన్ భాషలు -నార్త్ వెస్టన్ గ్రూప్ 1. సింధి - లహండా 2. డార్డి లేదా పిశాచ భాషలు (కాశ్మీరీతో కలిపి) IX. ఇండో ఆర్యన్ భాషలు (సెంట్రల్ గ్రూప్) 1. వెస్టన్ హిందీ - పంజాబి 2.రాజస్థాని - గుజరాతి 3. ఖందేసి - బంజరీ లేదా లభాని, బహుప్రియ మొదలైన భిల్ భాషలు 4. పహరి భాషలు 8 గుజురి X ఎరానియన్ కుటుంబం XI. జిప్సీ భాషలు

భారత దేశంలో గ్రియర్సన్ చేసిన సేవలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. 1902లో యూనివర్సిటీ ఆఫ్ డబ్లిన్ గౌరవ డాక్టరేట్ డి.లిట్ బహుకరించింది. 1928లో రాయల్ ఏషియాటిక్ సొసైటీ వారు సర్ విలియం జోన్స్‌కు బంగారు పతకం బహూకరించారు. అలాగే ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్ గా 1912లో గుర్తించి గౌరవించారు. ప్రపంచ వ్యాప్తంగా హాలే, కేంబ్రిడ్జ్, ఆక్స్ ఫర్డ్, బీహార్

కవిత

# పురుషులందు...

ఎందుకు లేరు
మహానుభావులు!
గాలిలా అంతటా వుండరు
మధూళిలా అక్కడక్కడ.
అది ఒక మారుమూల పల్లె
అతి చిన్న పాఠశాల,
కాని దాని ఆవరణలోని చెట్లన్నీ
అక్షరాలనే వీస్తాయి.
వాటిని చెమట పోసి పెంచాడతను.
పిల్లల్ని ప్రేమించడమంటే ఏమిటో
ముందే అభ్యసించాడు
వారి నేపథ్యాల్ని
పద్యాలుగా మలుచుకున్నాడు.
వారి కళ్లల్లో
వెలుగుల్ని సృష్టించాడు
పుస్తకాల్లోని విజ్ఞానాన్ని
మట్టిలో చల్లి
మళ్లీ మొలిపించాలి.
ఆ స్కూలు చుట్టు
ఎన్నిసార్లు తిరిగినా
తరగని బ్రహ్మాండంలా వుంటుంది
ఏదో తెలియని అతి మానుష ఘోష
మదిని అలముకుంటున్నది.
నా చిన్నతనంలో
అతని నీడ సోకి వుంటే
ఆచార్యుడయ్యే సంగతి తర్వాత
ఇంత కన్న మంచి మనిషిని మాత్రం
అయివుండే వాణ్ని.
అతనితో పాటు
పిల్లబాటలో
ఓ మూడు మైళ్ల దూరం నడిచాను,
అవి త్రివిక్రముని అడుగుల్లా వున్నాయి
అతని ప్రతి మాటా
దారిలో పువ్వై పరిమళిస్తున్నది.
అతణ్ని ముట్టుకుంటే
మనస్సులో ఏదో సున్నితమైన అలజడి,
అతని పాదముద్రల్ని తలుచుకుంటే
సరికొత్త గమ్యాలు
తెరుచుకుంటున్నాయి.
ఎందుకు లేరు
మహానుభావులు!
అందుకే ఈ భూగోళం
పడిపోకుండా వుంది

డా॥ ఎన్.గోపి
9391028496

విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ బిరుదును (పట్టా) ప్రదానం చేశాయి.

భారతదేశమంతా పర్యటించి 364 భాషలను మాండలికాలను గుర్తించాడు గ్రియర్సన్. ఇది 11 సంపుటాలుగా లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా అనే పేర ప్రచురణ జరిగింది. ఈ ప్రచురణల వివరాలు అమెజాన్లో లభ్యమవుతున్నాయి. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గ్రంథాలయంలో కూడా ఈ ప్రతులున్నాయి. బ్రిటిష్ మ్యూజియంలో, గ్రామఫోన్ రికార్డుల రూపంలో, సీడీల రూపంలోనూ లభ్యమవుతున్నాయి.

1991 భారత జనాభా లెక్కల ప్రకారం ప్రత్యేక వ్యాకరణ నిర్మాణాలున్న భాషలు 1576గా నిర్ధారించి, మాండలికాలు మరికొన్ని మాతృభాషలు 1796గా నిర్ధారించారు. ఇది కొంత అస్పష్టతకు దారి తీసింది. 1984లో రిజిస్ట్రార్ జనరల్ మరియు సెన్సస్ కమిషనర్ కార్యాలయం రెండవ లింగ్విస్టిక్ సర్వే చేపట్టాలని ఒక ప్రతిపాదన చేశారు. 2010 నాటికి 40 శాతం పూర్తయిందని 11వ పంచవర్ష ప్రణాళికకు (2007-12)కు మరో ప్రతిపాదన చేశారు. ఉదయ నారాయణ నేతృత్వంలో 54 విశ్వ విద్యాలయాలు పదివేలమంది పరిశోధక శాస్త్రవేత్తలు మరో రెండు వేల మంది యువ పరిశోధకులతో ఒక బృహత్తర ప్రాజెక్టు తలపెట్టింది. ఐతే అది మధ్యాంతరంగా ఆగిపోయింది. ఎన్నో ప్రభుత్వాలు చేయలేని పనిని ఒక విదేశస్తుడు భారతదేశమంతా పర్యటించి భారతీయ భాషలకొక నిర్దిష్ట రూపం ఏర్పరచి భావితరాలకు సంపదగా మిగిల్చిన సర్ జార్జ్ అబ్రహం గ్రియర్సన్ కి మనమేమిచ్చి రుణం తీర్చుకోగలము. ఆ మహనీయుడు తన జీవితమంతా భారతదేశంకోసం త్యాగం చేసి 1941 మార్చి 9 వతేదిన ఇంగ్లండ్ లో తుది శ్వాస విడిచాడు. మరణించేనాటికి ఆయన వయస్సు 90 సంవత్సరాలు.

అ

**41 వ పుట తరువాయి...**

## పిల్లలకు ఎక్కాలు.....

వన్నీ చదివాకే, 'కాకి'ని చూస్తారు! అదండీ సంగతి!

ఇంకొక్క విషయంతో ముగిస్తాను. చదువులో ఏ మార్గం అయినా, పిల్లల కోసమే కాదు; చిన్న తనంలో చదువులు లేక, వృద్ధాప్యంలో అయినా చదువు కోవాలని, రాత్రులు వచ్చి చాపల మీదో, నేల మీదో, ఆరాటాలతో కూర్చునే వయోజనులు కూడా చిన్న పిల్లల వంటి విద్యార్థులే. అక్షరాలు నేర్పినా, ఎక్కాలు నేర్పినా, ఈ నిరుపేద పెద్దల్ని కూడా దృష్టిలో పెట్టుకోవద్దూ?

ఈ వ్యాసం రాయడం లో నా అభిప్రాయం, జీవితాల్లో ఎక్కడ ఏ తప్పు జరిగినా, దాన్ని దిద్దుకోవాలి-అని. పసిపిల్లలకి ఎక్కాల్ని నేర్పడంలో, రెండో పద్ధతి ఎందుకు? దాన్ని చదివిన వాళ్ళు, పెద్దవాళ్ళయి పోయారు. వాళ్ళు ఇప్పుడు మొదటి పద్ధతిలోనే చదవాలని కాదు. ఇప్పుడు, 1 టో తరగతిలోకి ప్రవేశించే పిల్లలు, 2డో ఎక్కాన్ని మొదలు పెడతారు. ఎక్కాల పుస్తకాలన్నీ 1 టో పద్ధతిలోకి మారవద్దా? పసిపిల్లల్ని, ఎక్కాల భయాల్లోనే వుంచేస్తారా? ఇవన్నీ, పిల్లలు ఆలోచించే విషయాలు కావు. వాళ్ళ తల్లిదండ్రులూ, టీచర్లూ, రచయితలూ వంటి వారే ఆలోచించాలి మరి!

"నీ ఆలోచనలు కాదు, 2డో ఎక్కాన్ని అయినా, కంఠతా పట్టు!" అని, 55 ఏళ్ళ క్రితం టీచరు ద్వారా తిట్లు తిన్న, ఈ నాటి 60 ఏళ్ళ జె.యు.బి.వి. ప్రసాద్, ఎక్కాల్ని రెండో పద్ధతిలోనే చదివి, అదే మంచిది - అని తెగ వాదించిన కంప్యూటర్ ఇంజనీరు. ఈ వ్యాసాన్ని అతడే కంపోజ్ చేస్తూ, అంతా చూసి, "నేను మారిపోయాను" అన్నాడు! "ఎక్కాలకు తార్కిక పద్ధతి వుండాలని తెలుసుకున్నాను" అన్నాడు!

అ

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలు ఆనవాళ్లు-16
# నా ఉమామహేశ్వరం - ప్రతాపరుద్రునికోట యాత్ర

హైదరాబాదు నుంచి ఎన్నోసార్లు శ్రీశైలం కారులో వెళ్లానుగాని శ్రీశైలం ఉత్తర ద్వారంగా పేరుగాంచిన ఉమామహేశ్వరం చూడలేదన్న విషయం నన్ను తరచూ బాధిస్తూనే ఉంది. నీటి ముంపు దేవళాల తరలింపు కార్యక్రమంలో భాగంగా నేను 1978-81 మధ్య అలంపూర్‌లో ఉద్యోగం చేసేప్పుడు బాలబ్రహ్మేశ్వరాలయం వెళ్లినప్పుడు ప్రముఖ శాసన పరిశోధకుడు, సాహిత్యవేత్త గడియారం రామకృష్ణశర్మగారు తరచూ ఉమామహేశ్వరం గురించి చెప్తూ ఉండేవారు. అంతేకాదు ఉమామహేశ్వరంలో ఒకే పానవట్టంపైన రెండు శివలింగా లున్నాయని కూడా చెప్పారు. ఇలా ఒకే పానవట్టంపైన రెండు శివలింగాలు, మునుపటి కరీంనగర్ జిల్లా కాళేశ్వరంలో, కాళేశ్వర, ముక్తేశ్వర పేరిట పూజలందుకొంటున్నాయని, అలానే, కర్నూలుకు సమీపంలోని పంచలింగాలలో బాదామీ చాళుక్యుల కాలానికి చెందిన ఒకే పానవట్టంపైన ఐదు శివలింగాలున్నాయని కూడా గడియారం రామకృష్ణ శర్మగారు చెప్పారు. ఆయన చారిత్రక విషయాలను ఆసక్తికరంగా రాజుల పేర్లు, తేదీలతో సహా అలవోకగా చెబుతుంటే, నేను ఆయనలా ఎప్పుడు మాట్లాడతానో ననిపించేది. నేను కాళేశ్వరం, పంచలింగాల రెండు క్షేత్రాలూ చూశాను. ఉమామహేశ్వరం మాత్రం చూడలేకపోయాను.



ఒకనాటి శనివారం సాయంత్రం అనుకొన్నానో లేదో, నాయంతటనేనే, ఒక్కణ్ణే, నా డ్రైవర్ మురళీతో కలిసి, మరుసటిరోజు ఆదివారం ఉదయం 4.00 గం॥లకే బయలుదేరి, 5.40 కల్లా నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట చేరుకొన్నాం. ఇంకా తెలవారలేదు. కారు దిగాను. చలిపెడుతుంది. ఛాయ్ దుకాణాలు కూడా తెరవలేదు. అచ్చంపేట ఊరు బయట కొంచెం సేపు అటూ ఇటూ తిరిగి, ఉమామహేశ్వరం బయలుదేరి రంగాపురం చేరుకొన్నాం. వేడి వేడి ఛాయ్ తాగి, ఉమామహేశ్వరం దారి అడిగి ప్రయాణం కట్టాం. ఇంకా పొగమంచు కురుస్తూనే ఉంది. గుట్టలు, చెట్లూ బూజురు బూజురుగా కనిపిస్తున్నాయి. ఇంతలో ఒక లంబాడీ తండా వచ్చింది. లంబాడీ మహిళలు, వాకిళ్లు ఊడుస్తూ, కళ్లాపు జల్లుతూ ఉంటే, మహానగరమైన మన భాగ్యనగరం ఈ భాగ్యాన్ని కోల్పోయిందిగదా అనిపించింది.



ప్రయాణం సాగుతూనే ఉంది. వెలుతురు పెరుగుతూనే ఉంది. పైర్లతో నిండిన నేలంతా పచ్చదనాన్ని పరచుకొంది. ఇంతలో ఎదురుగా ఒక పెద్దకొండ కనిపించింది. అదే ఉమామహేశ్వరం కొండ. మొన్న మొన్నటి దాకా, తెలంగాణా వారే కాదు, ఉత్తరాది వాళ్లు కూడా కాలినడకన శ్రీశైలం చేరుకొనే ముందు విడిది చేసిన కొండ అది. బాగా తెల్లవారింది. 6.30 అయింది. ఉమామహేశ్వరాలయం చేరుకోటానికి ప్రాచీన కాలపు మెట్ల మార్గానికి ఎడమవైపున లక్షల మంది దప్పిక తీర్చిన కోనేరుంది. చుట్టూ దట్టమైన అడవి, మెట్లపై చెట్లూ, పొదలు పెరగ్గా ఇండియన్ కల్చర్ నేచర్ సంస్థ వ్యవస్థాపకుడు పట్నం కృష్ణంరాజు తన మిత్రబృందంతో ఇటీవలే ఆ పొదల్ని తొలగించి, కోనేరుకు విముక్తి కల్పించినట్లు నాకు చెప్పాడు. ఆ కోనేరు కాకతీయుల కాలం నాటిది. దాన్ని చూచి బయటకొస్తుంటే, అక్కడొక పాడుబడిన గుళ్ల వరుస, ముందు ఒక ఉమ్మడి మండపం కనిపించాయి. వెళ్లి చూశాను. అది ఏడు దేవాలయాల సముదాయం. లోపల దేవుళ్లు

లేరు. కప్పులు లేచి పోయాయి. మండపం రాళ్లు పడిపోయాయి. కట్టడశైలిని బట్టి, ఆ దేవాలయ సముదాయం రేచర్ల పద్మనాయకుల కాలంలో నిర్మించిందనిపించింది. ముళ్లూ, పొదలు దాటుకొంటూ, ఎట్టకేలకు ఆలయం చుట్టూ తిరిగి చూడగలిగాను. ఒక్క నిమిషం ఆగాను. ఆ శిథిలాలు చెప్పిన మౌన గాథల్ని విన్నాను. ఒకనాడు వైభవోపేతంగా వెలుగొందిన ఆలయం నేడు వెలవెలబోవటం చూచి, దేవుళ్లు కూడా ఏమీ చేయలేకపోతున్నారే అని వాపోయాను.

ఇంకా కొంచెం ముందుకు పోయాను. మరో శిథిలాలయం. ఆలయ విడిభాగాలతో కట్టిన పిట్టగోడ. అందులో అపురూప శిల్పాలు, శాసనాలు, ద్వారశాఖలు, కప్పురాళ్లు. ఇంకొంచెం ముందు కెళ్లాను. నాలుగు ముక్కలుగా పడి ఉన్న క్రీ.శ.1377వ సం॥పు పద్మనాయకరాజు మాదా నాయకుని శాసనాన్ని చూచి చరిత్ర చెరిగిపోతుందన్న బాధ కలిగింది. పట్టించుకోని ప్రభుత్వం పట్ల కసి రగిలింది.



ఇంకేమైనా చరిత్ర శకలాలు దొరుకుతాయన్న ఆశ, నన్ను ఒక మూలన, ముళ్లపొదల మాటున నిర్లక్ష్యంగా పడి ఉన్న నిలువెత్తు వీరభద్ర, నంది శిల్పాల వైపు మళ్లించాయి. కాకతీయ శిల్పకళ పరాకాష్టకు ప్రతిబింబాలైన ఆ శిల్పాలు రెండూ కాకతీయ ప్రతాపరుద్రుని కాలానివని ఉమామహేశ్వరంలోని ఒక శాసనం ద్వారా తెలుసుకొన్న నేను ముక్కు మీద వేలేసుకొన్నాను. వరసదప్పుతున్న వారసత్వాన్ని పట్టించుకొనేవాళ్లే లేరా? ఉమామహేశ్వరం ఆలయ అధికారులు, ధర్మకర్తలు ఈ అపురూప శిల్పాల్ని కాపాడలేరా? అనిపించింది. ఇంతకీ ఈ శిల్పాలు ఇక్కడికెందుకొచ్చాయని వాకబు చేస్తూ, భిన్నమైన విగ్రహాలు ఆలయంలో ఉంటే అరిష్టమని వాటిని నిర్దాక్షిణ్యంగా తోసేసి చేతులు దులిపేసుకొన్నారని స్థానికులు చెప్పారు. చూచిన కొద్దీ చూడాలనిపించే వీరభద్ర, నంది విగ్రహాల చరిత్ర తెలుసుకొందామని ఉమామహేశ్వరం శాసనాలను పరిశీలించాను. క్రీ.శ.1320 నాటి కాకతీయ ప్రతాపరుద్రుని శాసనంలో వీటి ఆచూకీ దొరకటంతో ఆ ముళ్లపొదల్లోనే ఎగిరి గంతేశాను. అదే కాలపు మరో శాసనంలో వావిలిపాటి పెదశరభయ్య, చినశరభయ్య అనే ఇద్దరు శిల్పి సోదరులు, పార్వతి, చెన్నకేశవ, మహిషాసురమర్ధిని, వీరభద్ర, నందికేశ్వరుల విగ్రహాలను చెక్కగా, వాటిని, సదానందస్వామి అనే వ్యక్తి ప్రతిష్టించాడన్న వివరాలున్నాయి. పార్వతి, చెన్నకేశవ విగ్రహాలు రెండు విడి ఆలయాల్లోనూ, మహిషానురమర్ధిని విగ్రహం, ప్రధానాలయంలో ఉన్నాయి. ముళ్లపొదల్లోని వీరభద్ర, నంది కేశ్వర విగ్రహాలు ఆ శాసనంలో పేర్కొన్నవేననే నిర్ధారణ కొచ్చాను.

సమయం సరిగ్గా ఉదయం 7 గం॥లు. ఘాట్‌రోడ్ మీదుగా కొండసానువులో నున్న ఉమామహేశ్వరాలయాన్ని చేరుకొన్నాం. ఒకరిద్దరు ఆలయ సిబ్బంది తప్ప, జనసంచారం లేదు. ఎక్కడ చూచినా గుంపులు గుంపులు కోతులు. ఎవర్నీ ఏమీ చేయటం లేదుగాని అదో రకం భయం. బిక్కుబిక్కుమంటూ చివరిదాకా వెళ్లి, శ్రీశైలం వెళ్లే మెట్లను తాకి వెనక్కొచ్చి, ఒక్కో ఆలయాన్ని చూశాను. క్రీ.శ.13వ శతాబ్దినాటి ప్రధానాలయ మహామండపం మీద దేవాదాయశాఖ వారు అనాలోచితంగా నిర్మించిన సిమెంటు శిలాగారం, ఆ ఆలయం ప్రాచీనతకు ముప్పులను కలిగిస్తున్నాయి. బయటి స్థంభాలపైన గల శాసనాలను పరిశీలిస్తుండగా పూజారులు వచ్చారు. లోనికి వెళ్ళటానికి ప్రయత్నిస్తున్న నన్ను, వేం ఇంకా దేవుణ్ణి సిద్దం చేయాలి. పూజాదికాలుంటాయి. ఒక అరగంట తరువాత రమ్మన్నారు. నేను గర్భాలయం దాకా రాను, మండపంలో వాస్తు శిల్పాన్ని పరిశీలిస్తాను. గతంలో నేను దేవాదాయ శాఖలో పనిచేశానని చెప్పా. లోనికిరమ్మన్నారు. పేరుకు ఆధ్యాత్మిక కేంద్రమేగానీ, శుచీ, శుభ్రంలో ఏమాత్రం ఆ శాఖవారికి శ్రద్ధ లేదనిపించింది. ఒక చోట భైరవుడు, మరో చోట మహిషాసురమర్ధిని, ఇంకొక చోట ప్రతాపరుద్రుని శాసనం, దానిపైన ఏవో బండరాళ్లు చూచి చరిత్రకు అపచారం జరుగుతుందని లెంపలేసుకొన్నాను. అంతకన్నా ఇంకేం చేస్తాను? ఎప్పుడు బయట పడదామా అని ఆలోచిస్తున్న నన్ను గర్భాలయ, అర్ధమండప ద్వారశాఖలపైన గల శిల్పం, అర్ధమండపం ముందు అలంకార శిల్పంతో శోభిల్లుతూ కాకతీయ శిల్పుల పనితనానికి అద్దం పడుతున్న స్థంభాల కప్పురాళ్లు నన్ను కదలకుండా చేశాయి. ఆలయ ప్రాంగణ నిర్వహణలో ఏమాత్రం శ్రద్ధ లేని అధికార్లు, పూజార్లపై కోపంతో నాకు నేను బయటకు



నెట్టి వేయబడ్డాను. చుట్టూ అస్తవ్యస్త కట్టడాలు, షెడ్లు, ఆదాయాన్నిచ్చే కౌంటర్లు, ఏమాత్రం శుభ్రంలేని టాయ్‌లెట్లు, మరో క్షణం కూడా అక్కడ ఉండొద్దని తరిమేయగా, కారెక్కి కిందికి దిగాను. అక్కడ మరో శిథిలాలయం, నన్ను పదిలం చేయరూ అంటూ బిక్కమొహంతో ప్రాథేయపడుతుంది. గోడలు కూలిపోయాయి. ద్వార శాఖలు వాలిపోయాయి. శిఖరం రాలి పోయింది.

ఒకప్పుడు ధూప, దీప, నైవేద్యాలతో అలరారిన ఆలయంలో గబ్బిలాల గుసగుసలు కాపురం చేస్తున్నాయి. నన్ను అక్కణ్ణించి వెళ్లిపొమ్మని సాగనంపుతున్నాయి. ముళ్లపొదల్లోని వీరభద్ర నంది



విగ్రహాలు, ఒకదానిపై ఒకటిగా కుప్ప బోసిన ఆలయ విడి భాగాలు, స్థంభాలు, కప్పులు, చెప్పుకోలేని బాధల్ని వెళ్ళగక్కుతున్నాయి. నా గుండె బరువెక్కింది. చేసేదిలేక నేను కారెక్కాను. కార్లో ఎక్కానేగాని,



మరో తీరని కోరిక నన్ను వెంటాడుతూనే ఉంది. అది కూడా శ్రీశైలం వెళ్లే దారిలోని చారిత్రక ప్రదేశం. అదే ప్రతాపరుద్రుని కోట. కాకతీయ



ప్రతాపరుద్రుడు కట్టించిన కోట. మెలికలు తిరుగుతూ సాగుతున్న కారుప్రయాణం. ఉల్లాసాన్నిస్తుండగా, పచ్చటి ప్రకృతి నడుమ గల కొండలు, కోనలు, చెట్లూ చేమలూ, పుట్టలూ, పొలాల గట్టులూ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. మన్ననూరే ఘాటెక్కాం. కొంతదూరం పోగానే ఎడమవైపు ఒక తోరణం. శ్రీశైలం యాత్రికుల స్వాగత తోరణం. అంత అలంకరణ లేకపోయినా కాకతీయ వాస్తు శిల్పానికి మచ్చుతునకగా ఉంది. దగ్గరగా వెళ్ళి రెండు వైపులా చూచి, మళ్లీ కారెక్కిపోతుండగా ఎడమవైపున కొండమీద ప్రతాపరుద్రుని కోట గోడలు కట్టిపడేశాయి. కారు దిగాను. చుట్టూ కలియజూశాను. అక్కడున్న మసీదు దగ్గర జనసంచారం ఉంది. ఆ కోటకు ఎలా వెళ్లాలని అడిగాను. ఫారెస్టు డిపార్టుమెంటు పర్మిషన్ కావాలన్నారు. ఆసక్తి సన్నగిల్లినా, మరోవైపు నుంచి ఒక అరకిలో మీటరు నడుచుకొంటూ వెళ్లా. అక్కడ ఒక కోట గుమ్మం. పక్కనే దేవాలయాలు. క్రీ.శ.14వ శతాబ్ది దుర్గ వాస్తు విన్యాసానికి ఒక చక్కటి ఉదాహరణ. లోనికెళ్లాలని మనసు ఉవ్విళ్లూరింది. అడవి జంతువులుంటాయి. పోవటం మంచిది గాదన్నాడు ఫారెస్టు గార్డు. కనీసం ఇదన్నా చూశానన్న సంతోషంతో చకచకా నడిచి శ్రీశైలం రోడ్డుమీదకొచ్చాను. పక్కనే కుడివైపున కొండ, బండరాళ్లు. వాటిపైన ఆనాటి క్వారీ నుంచి కోటగోడకు కావల్సిన రాళ్లను విడగొట్టిన పెద్ద సైజు ఉలులు, ఇనుప గూటాలు దించిన ఆనవాళ్లు కనిపించాయి. పైకెక్కాను. చాలా రాళ్లను పగులగొట్టిన గుర్తులు. అలనాటి శిల్పులకు మొక్కి, తిరుగు ప్రయాణం కోసం కారెక్కాను. అ

## రాయలసీమ పద్యపోటీలు

రాయలసీమ జీవన స్థితిగతులు, సంస్కృతి నేపథ్యంగా పద్యపోటీలను 'వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం' ఆధ్వర్యంలో ప్రముఖ అవధాని, పద్మశ్రీ డా.ఆశావాది ప్రకాశరావు గారి స్మారకార్థం నిర్వహిస్తున్నాం.

మార్చి 25 వ తేది లోపు 9962544299 వాట్సప్ నెంబర్ కు ఐదుపద్యాలు మాత్రమే పంపాలి. ఉగాది సందర్భంగా పదివేల రూపాయల బహుమతులు కవులకు అందచేస్తాం.

డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సమన్వయ కర్త,
అనంతపురము. 99639 17187

**అమ్మనుడి** పత్రిక చందా చెల్లించి
ప్రతీ నెలా పోస్టులో పత్రికను పొందండి
మీ మిత్రులను కూడా
చందాదారులుగా చేర్పండి.
అమ్మనుడి సందేశాన్ని
ఇంటింటికీ అందించండి.
మన మాతృభాషతోనే మన గుర్తింపు

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# మరువలేని మంచి మిత్రుడు యెండ్లూరి

సుధాకర్ కవిత్వం అగ్నిజ్వాల. సుధాకర్ వ్యక్తిత్వం వెన్నెలసోన. అతను రాయకుండా వెళ్ళిపోయిన కవిత్వంలా అతని స్నేహం విషాదమాధురి. అతను లేని లోకంలో అతడి కవిత్వమే మనుషులకు మిగిలిన రహదారి.

**2002**వ సంవత్సరం జూన్ నెల చివరివారంలో హైదరాబాదులో అప్పటి బేగంపేట విమానాశ్రయంలో తొలిసారిగా యెండ్లూరి సుధాకర్‌ను కలిసాను. అప్పటికే అక్కడ– జులై 4న అమెరికాలో డల్లాస్ నగరంలో జరగబోయే అమెరికా తెలుగు అసోసియేషన్(ఆటా) సభలకు బయల్దేరిన ఆహూతులందరూ బిలబిలమని చేరిపోయారు. ఆటా ప్రత్యేక సావనీర్లున్న పెద్ద పెద్ద అట్టపెట్టెలను లగేజీచెక్‌లో పంపించి, ఆపైన టికెట్ కౌంటరు దాకా లాక్కెళ్లడానికి సిద్ధమైన అప్పటి యువకులిద్దరు ముగ్గురులో నేనూ, సుధాకరూ వున్నాం. టికెట్లు తీసుకున్నాక లుఫ్తాన్సా విమానంలో పక్క పక్కనే సర్దుకోవడంతో మొదలయ్యింది మా యిద్దరి సహప్రయాణం. దూరంగా అటుకూర్చున్న కేతు విశ్వనాథరెడ్డి దంపతులు సలహాలిస్తూనే వున్నారు. యిటువైపున తెల్ల పాంటు చొక్కాలతో దాదాపుగా మా వయసేవున్న వ్యక్తిని చూపెట్టి "అతనే గరికపాటి నరసింహరావు అవధాని, నా యంఫిల్ స్టూడెంటు" అని పరిచయం చేశారు సుధాకర్. అదే విమానంలో మరోవైపున గుంపుగా కూర్చున్న సినిమా అతిథుల సమూహానికి అక్కడ తెలుగు రచయితలం ఆనడం లేదు.

విమానం కదిలిన దాదాపోగంట తర్వాత నాకేసి తిరిగి"పాచి మొహంతోనే / స్నానంచిపోసింది/ విమానసాక్షీ/ నేనేమో/ వైనతేయుణ్ణే కావాలనుకున్నాను" అన్నాడు సుధాకర్. ఆ చెప్పేతీరు విన్నాక "కొత్త కవితా?" అని అడిగాను. అవునంటూ తలవూపాక "నోరువిప్పేసరికి / బారుబండిత్రోసుకుంటూ/ బీరుబాబులవైపుకు/ జోరుగా వెళ్ళి పోయింది. / జోరీగలాగా... అని" ముగించాడు. అదే మొదలు. అమెరికాలో వెంటే తిరుగుతూ సుధాకర్‌లోంచీ వందకు పైగా కవితలు పుట్టడం అతిదగ్గరగా చూశాన్నేను.

ఏ రచనయినా పుట్టకముందు కృత్యాద్యవస్థ అనేదొకటుంటుంది. సుధాకర్ కాస్సేపు మౌనంగా వున్నాడంటే కృత్యాద్యవస్థలోనే వున్నాడని అర్థం. యెవరో చెప్పిన మాటో, అప్పటికప్పుడు స్ఫురించిన పదమో చాలు. వెంటవెంటనే అతని పదకోశంలో దానితో కలిసే జంట పదాలూ, పర్యాయపదాలు కొల్లలుగా పుట్టేస్తాయి. చిన్న చమత్కారం దొరికితే కవితనల్లేస్తాడు. కొత్త విశేషం కనబడితే చాలు, అంతర్ముఖుడైపోతాడు.

జీవితాన్ని యెటువంటి అనుసంగిక ధోరణులూ లేకుండా అచ్చంగా అనుభవించి, మరువనివ్వకుండా తరుముకొచ్చే అనుభవాల్నే రచనలుగా సృజించడం నా పద్ధతి. కానీ అనుభవమూ, సృజనా వొకేసారయిన సుధాకర్ నాకు చిత్రంగా కనిపించేవాడు.

డల్లాస్‌లో మూడురోజులు సభలు ముగిశాక మిగిలిన రోజుల్లో, వో వారం మినహా, మేమిద్దరమూ కలిసే తిరిగాము. డల్లాస్ నుంచీ ముందుగా డెట్రాయిట్‌కు వెళ్ళాం. అక్కడి సభల్లోనే సుధాకర్ తన



'నల్ల ద్రాక్ష పందిరి'ని పాఠకులకు చేర్చడం మొదలుపెట్టాడు. అమెరికా ప్రయాణం కుదరగానే వేగుంట మోహనప్రసాద్ గారి యింగ్లీషుఅనువాదాలతో బాటూ రూపొందించిన తెలుగు కవితల సంపుట మది. సుధాకర్ స్వరంలోంచీ అతని కవితను విన్నాక ఆ పుస్తకాన్ని కొనకుండా వెళ్ళడం సాధ్యమయ్యేది గాదు. అతను కవితను చదివే ధోరణి అతడిదే అయిన విశిష్టమైన పద్ధతిలో వుండేది.

తెలుగు భాష పరిమళం విస్పష్టంగా కనబడే స్వరాల్లో సుధాకర్ ముఖ్యుడు. చిన్న అక్షరమైనా మింగకుండా, ప్రతి మాటా, ప్రతి పదమూ స్పష్టంగా వినబడేలా, ప్రతిపంక్తీ విరగాల్సిన చోటే విరిగేలా, వోపికగా పునరుక్తులు చేస్తూ అతను చదువుతూంటే, అతని వచనం కూడా కవిత్వంలా వుండేది. "యీ మాత్రం అభినవేశంలేకుంటే రాజమండ్రి పండితుల మధ్య యెలా నెట్టుకు రావటం చెప్పు" అంటూ తన సాధనను గుర్తుచేసేవాడు.

డెట్రాయిట్‌లో ప్రముఖ గాయని సుశీలతో కాస్సేపు మేమిద్దరమే కబుర్లు చెప్పుకోవడం మరుపురాని అనుభవం. అతని ఫోటోల సంచయంలో సుశీలగారితో అతను తీసుకున్న ఫోటోవుంది. డెట్రాయిట్‌లో ఆరి సీతారామయ్యగారి యింట్లో మేమిద్దరమూ అతిథులుగా చాలారోజులే గడిపాము.

డెట్రాయిట్ నుంచీ బస్సులో మేము చికాగోకు చేసిన ప్రయాణం మరో మరుపురాని, అనుభవం. విశాలమైన మైదానాల గుండా, చిన్న చిన్న పూర్లగుండా, దాదాపొక పగలంతా సాగింది మా ప్రయాణం. అక్కడి బస్టాండుల్లో బాహాటంగా ప్రణయాల్ని కొనసాగించే పడుచువాళ్ళు సుధాకర్‌కో రెండు మూడు కవితలకు వస్తువులైపోయారు. చికాగోలో బస్టాండులో మమ్మల్ని ఆహ్వానించిన డాక్టరు కట్టమంచి వుమాపతిరెడ్డి గారు సుధాకర్ కవితలకు పెద్ద అభిమానైపోయారు. 108 అంతస్థుల సీయర్స్ బిల్డింగెక్కాక 'అందర్నీ చూడు, బిన్‌లాడెన్ నామస్మరణ

చేస్తున్నారు” అన్నారు సుధాకర్.

న్యూయార్క్‌లో కలశపూడి శ్రీనివాసరావుగారి అతిథిగా కొన్ని రోజులు గడిపాక, సుధాకర్ తిరిగి న్యూజెర్సీ వచ్చి అప్పాజోస్యుల సత్యనారాయణగారింట్లో వున్న నన్ను కలిశాడు. సత్యనారాయణగారు మమ్మల్నిద్దరినీ, తుమ్మపూడి కోటేశ్వరరావు దంపతులనూ ఆ ప్రాంతంలోని దర్శనీయస్థలాలకంతా తీసుకెళ్ళారు. న్యూజెర్సీ నుంచి బోయరెడ్డి సుబ్రమణ్యంరెడ్డిగారి అతిథులుగా డల్లాస్ దగ్గరి మినరల్‌వెక్స్ కెళ్లాం. టెక్సాస్‌లో మాధవకృష్ణ, కన్నెగంటి చంద్ర, నందివాడ ఉదయభాస్కర్, డా॥ జువ్వల మోహనరెడ్డి, కేతుశశిధర్, హూస్టన్‌లో విష్ణుభొట్ల అక్కన్నలు మాకు ఆతిథ్యాలిచ్చారు.

**అమెరికాలో వెళ్ళిన ప్రతిచోటా సాహితీ మిత్రులు మా యిద్దరితో సమావేశాలు యేర్పాటు చేశారు. సమావేశాల్లో సుధాకర్ ప్రసంగించే పద్ధతి విలక్షణంగా వుండేది. మాట్లాడేందుకు నిలబడినప్పుడు ఆరడుగుల సుధాకర్ బిడియంగా, వినయంగా వొదుగుల్కు పోయేవాడు. ముందుగా జంకుతున్నట్లుగా ‘భారతదేశంలోని కోట్లాది మంది దళితుల ప్రతినిధిగా నేనిక్కడికొచ్చానని’ స్పష్టంగా చెప్పేవాడు. అయితే ఆ బిడియమూ, వినయమూ పైపై తొడుగులు మాత్రమేననీ, రగిలే అగ్నిశిఖల కున్న బూడిదపూత మాత్రమేననీ త్వరగానే తెలిసిపోయేది. వందల వేల సంవత్సరాల అన్యాయాల్ని నిరసించే నిలువెత్తు ప్రశ్న సుధాకర్. భారతదేశంలో యింకా లోతుగా వేళ్ళూనుకున్న చాతుర్వర్ణ వ్యవస్థను ధిక్కరించి యెదిరించే ధీశాలి సుధాకర్. అతనొక రగిలే జ్వాల. అతని వుపన్యాసం కార్చిచ్చు. అతడి కవితలు అగ్నికీలలు. నిద్రించని అగ్నిపర్వతంతో నేను సల్పిన నెలరోజుల సావాసం, జీవితం నాకిచ్చిన అద్భుత వరాల్లో వొకటి.**

అయితే సుధాకర్ మనస్సు అంత మెత్తన. అతనో అపురూప మానవ ప్రేమికుడు. దగ్గరి కొచ్చిన ప్రతి వ్యక్తినీ ప్రేమజల్లుల్లో ముంచెత్తేస్తాడు. స్నేహితులనూ, గురువులనూ, తోటి వుద్యోగులనూ, శిష్యులనూ అక్కున చేర్చుకుంటాడు. బంధువులనెప్పుడూ తలుచుకుంటూనే వుంటాడు. డల్లాస్‌లో డాలర్ షాపుకెళ్లినప్పుడు రెండు ట్రాలీలను చిన్న చిన్న వస్తువులతో నింపేశాడు. ‘వూరికెళ్లాక అమెరికా నుంచీ నాకేం తెచ్చావని అడిగే వాళ్ళకందరికీ యేదోవొకటి యివ్వద్దూ’ అన్నాడు. ఆ నెల్లాళ్ళ స్వదేశీ విరహాన్ని భరించలేకపోతూ.

సుధాకర్‌కున్న ఆత్మవిశ్వాసం గొప్పది. పరిచయమైన విదేశీయులతో ‘నేను తెలుగు దళిత కవిని. వింటారా నా కవితలు రెండు’ అంటూ తన కవితల యింగ్లీషు అనువాదాల్ని వినిపించేసేవాడు. అలా విమానాశ్రయాల్లో తన సూటుకేసు తనిఖీ చేసి, లోపలున్న పుస్తకాల్ని విచిత్రంగా చూసిన యిద్దరు ముగ్గురు చెకింగ్ ఆఫీసర్ల చేతగూడా ‘నల్ల ద్రాక్ష పందిరి’ కొనిపించేలా చేశాడు.

సుధాకర్ ఆధునిక శబ్దశాసనుడంటే అతిశయోక్తి కాదు. లేకుంటే ఆటా కవితల్ని ‘ఆటాజనికాంచె’ అని ఎలా అనగలడు? “వీసాదొరికినోడే మూసా/ వీసా చిక్కినమ్మే నవ్వుల మోనాలిసా – అనేస్తాడు. నాలుగ్గంటల తెల్లవారు జామున/ నాస్టాపెట్టారు/ యాస్టకొచ్చినా/ టేస్టుగావుందని తిన్నాం/ హాంఫట్ అని అరిగే లోపే ఫ్రాంక్‌ఫర్ట్ ప్రత్యక్షమయ్యింది” అంటాడు.

“నల్లవాడా/ నల్లవాడా/ నల్లవాడలోని పిల్లవాడా/ నీలివజ్రాల నిగనిగల కళ్ళవాడా/ ఘెట్టోలలో – చీకటి / కొట్టాలలో/ బానిస బంధాలలో / గాఢాంధకారాలలో శతాబ్దాలు మగ్గినవాడా/ పోరు చేసి నెగ్గినవాడా/ నిగ్గరుగా / బిగ్గరుగా/ పిలవబడినవాడా / నల్లరేగడి పోరగాడా / ఏనాటికైనా / అమెరికాను శాసిస్తావు / బహుశానువ్వే / శాశ్వతంగా పరిపాలిస్తావు” అని 2020లో అన్న సుధాకర్ మాటలు మరో యేడేళ్లకే ఫలించాయి.

అమెరికానుంచి తిరిగొస్తూనే బోయ సుబ్రమణ్యంరెడ్డి గారి ప్రోత్సాహంతో సుధాకర్ ‘ఆటాజనికాంచె’ ప్రచురించాడు. నేను రాసిన ముందుమాటల్ని వెనకమాటల్ని చేసి ‘నా అమెరికా జ్ఞాపకాల తీపి సంతకం/ నరేంద్ర మధురాంతకం’ అని సంభావించాడు. ‘నువ్వు మధురాంతకమయితే నేను మదిరాంతకం’ అని నవ్వేసేవాడు.

పాతిక ముప్పయి సంవత్సరాల మధుమేహాన్ని గెలిచినవాడు! ముప్పయ్యేళ్ల సహధర్మచారిణితోడు లేకపోవడాన్ని మూడేళ్లయినా భరించలేకపోయాడు. ఆమె ధ్యానంలోనే మూడేళ్ళు గడిపి, ఆమెకని లోకాన్ని తన్నిపారేసి, ఆమె కోసం వెతుక్కుంటూ వెళ్ళిపోయాడు. అయినా ఆలోకంలో, ఆమెతో వున్న అతను సుఖంగా వుండలేదు. అక్కడికెళ్ళాక, యిక్కడి ఆత్మీయులకోసం అర్రులు చాస్తూనే వుంటాడు.

సుధాకర్ కవిత్వం అగ్నిజ్వాల. సుధాకర్ వ్యక్తిత్వం వెన్నెలసోన. అతను రాయకుండా వెళ్ళిపోయిన కవిత్వంలా అతని స్నేహం విషాధమాధురి. అతను లేని లోకంలో అతడి కవిత్వమే మనుషులకు మిగిలిన రహదారి. ⓐ




తాడిత పీడితజనుల కోసం బ్రిటీషువారితో పోరాడిన ద్వారబంధాల చంద్రయ్యదొర

అల్లూరి సీతారామరాజుకంటే 45 సంవత్సరాల ముందు తెలుగుగడ్డపై బ్రిటీషువారినెదిరించి వారిపై పోరాటం చేసి, అసువులు బాసిన అమర యోధుడొకడున్నాడని తెలుసా? అతడే తన తర్వాతి వారందరికీ స్ఫూర్తినిచ్చిన స్వాతంత్ర్యయోధుడు ద్వారబంధాల చంద్రయ్యదొర. స్వాతంత్ర్యం కోసం, తాడిత పీడిత జనులకోసం, గిరిజనుల కోసం తనను తాను అంకితం చేసుకున్న వీరుడితడు. తూర్పుగోదావరి జిల్లా మన్యంలోని బురదకోటను స్థావరంగా చేసుకొని బ్రిటీషువారిపై పోరాటం చేసి, వారికి సింహస్వప్నమైనాడు. ఇతనిని కుట్ర పూరితంగా బందీని చేసి కిర్లంపూడిలో చెట్టుకు వ్రేలాడదీసి కాల్చిచంపారు ఆ పాలకులు. చంద్రయ్య దొర తూర్పుగోదావరి జిల్లా తొలి స్వాతంత్ర్య సమరయోధుడు. ఇతని పోరాటం తదుపరి భారత స్వాతంత్ర్య పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది. మరుగునపడిపోయిన ఆ చరిత్రను వెలికితీసి చూపే దీపం ఈ పొత్తం.

వెల: రూ. 99/- ప్రతులకు:

1. తెలుగు బుక్‌హౌస్ 3-3-862, ఆర్యసమాజ్ రోడ్డు కాచీగూడ హైదరాబాద్ - 500027.

2. రచయిత కోటిపల్లి సుబ్బారావు గారిని సంప్రదించండి ఫోన్:9491524786

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# తెలుగు భాషోద్యమ సమాఖ్య సర్వసభ్య సమావేశం 20-02-2022
## సమావేశంలో పాల్గొన్నవారిలో కొందరు



## కొత్తగా ఎంపికైన తెలుగు భాషోద్యమ సమాఖ్య తాత్కాలిక కేంద్రమండలి

1. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు (హైదరాబాదు) అధ్యక్షుడు, 2. డా॥ చుక్కా రామయ్య (హైదరాబాదు) గౌరవ అధ్యక్షుడు, 3. డా॥ సామల రమేష్‌బాబు (విజయవాడ) గౌరవ అధ్యక్షుడు, 4. జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు (హైదరాబాదు) 5. నందివెలుగు ముక్తేశ్వరరావు గారు (హైదరాబాదు), 6. డా॥ వావిలాల సుబ్బారావు (అమరావతి) 7. డా॥ వెన్నిసెట్టి సింగారావు (గుంటూరు) సమావేశకర్త, 8. డా॥ గంధం సుబ్బారావు (హైదరాబాదు), 9. డా॥ పిరాట్ల శివరామకృష్ణ (హైదరాబాదు) 10. డా॥ ఈమని శివనాగిరెడ్డి (హైదరాబాదు), 11. డా॥ మొవ్వా శ్రీనివాసరెడ్డి (విజయవాడ), 12. డా॥ సుందర్ కొంపల్లి (విజయవాడ), 13. రహ్మనుద్దీన్ షేక్ గారు (హైదరాబాదు), 14. బద్రి కూర్మారావు గారు (శ్రీకాకుళం), 15. వీవెన్ గారు (హైదరాబాదు), 16. యఱ్ఱంశెట్టి హనుమంతరావు (ఖాజీపేట- తెనాలి) 17. చిమ్మె జాన్ జర్నబాస్ గారు (నందికొట్కూరు), 18. స.వెం.రమేశ్ గారు (శ్రీకాళహస్తి), 19. డా॥ కట్టెపోగు సురేష్‌కుమార్(మంగళగిరి), 20. ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి (తెనాలి), 21. డా॥ కె.గౌరీశ్వరరావు (రావులపాలెం), 22. సి.వి.కృష్ణయ్య గారు (విజయవాడ), 23. డా॥ టి. లక్ష్మీప్రసన్న (గుంటూరు), 24. ఆచార్య పోలవరపు హైమవతి (తెనాలి), 25. డా॥ సి. భవానీదేవి (హైదరాబాదు), 26. డా॥ లంకా వెంకటేశ్వర్లు (ఏలూరు), 27. కోటిపల్లి సుబ్బారావు గారు (హైదరాబాదు), 28. డా॥ సామల లక్ష్మణబాబు (అంగలకుదురు, తెనాలి), 29. డి.పి.అనురాధ గారు (మహబూబ్‌నగర్), 30.డా॥ కొలిచాల సురేష్ (అట్లాంటా, అమెరికా), 31. డా॥ తొట్టెంపూడి శ్రీగణేష్(జర్మనీ), 32. డా॥ హరీష్ విరియాల (సింగపూర్), 33. డా॥ చల్లా అనిల్‌కుమార్ (న్యూఢిల్లీ), 34. పూదోట శౌరీలు గారు (బోధన్) 35. డా॥ అమ్మిన శ్రీనివాసరాజు (వాగీడు- ములుగు), 36. కరణం కళ్యాణకృష్ణకుమార్ గారు (చీరాల). 37. ఆచార్య పులికొండ సుబ్బాచారి (హైదరాబాదు).

**అమ్మనుడి** తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
MARCH 2022 Vol :8, Issue 1
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

1970 నుండి ఆయుర్వేద ఔషధ నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన జీవక® వారి విశిష్ట ఉత్పత్తి

# జీవశక్తి

16 శక్తివంతమైన మూలికల మిశ్రమం

సమగ్రమైన ఆరోగ్యానికి సకుటుంబ పానీయం

100% సహజమైనది



పోషణ
వ్యాధి క్షమత్వం
శక్తి
బలం
చురుకుదనం

'జీవశక్తి' శక్తివంతమైన 16 మూలికల సమ్మేళనంతో చేయబడిన విభిన్నమైన ఆరోగ్య పానీయం. శాస్త్రీయ ఆయుర్వేద సిద్ధాంతానుసారం ఆధునికంగా తయారుచేయబడిన ప్రత్యేకమైన టానిక్. సహజ పోషణను కొనసాగించటానికి దీనిలో ఉన్న శక్తివంతమైన ఔషధ గుణములు, పోలిఫెనోల్స్, అమైనో ఆమ్లాలు, కొవ్వు ఆమ్లాలు, సూక్ష్మపోషకాలు, స్థూల పోషకాలు మొదలగునవి సహాయపడతాయి.

'జీవశక్తి' రసాయనంగా పనిచేస్తుంది. అంటే జీవక్రియను సక్రమపరచి, సప్తధాతువుల నిర్మాణ క్రమాన్ని మెరుగుపరుస్తుంది. శరీర సహజ పోషణను మరింత శక్తివంతం చేస్తుంది. మానసిక మరియు శారీరక ఒత్తిడిని తగ్గించి పునరుత్తేజపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచి కాలుష్యపు ప్రభావంనుండి శరీరాన్ని కాపాడుతుంది.

సహజమైన పద్ధతిలో ఆరోగ్యకరమైన జీవితం యొక్క ప్రయోజనాలను పొందడానికి 'జీవశక్తి'ని ప్రతిరోజూ సకుటుంబంగా సేవించండి.




జీవక® ఫార్మ
SINCE : 1970
ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (భారత ప్రభుత్వం) ప్రోత్సహిస్తున్న సంస్థ
8-386, జీవక నగర్, అంగలకుదురు - 522 211.
తెనాలి. గుంటూరు జిల్లా. ఆంధ్రప్రదేశ్
Customer Care : 94 94 88 44 22 (10 a.m. to 6 p.m.)
GMP CERTIFIED
ISO 9001:2015 CERTIFIED COMPANY

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244